భర్తృహరి నీతి శతకము
రూ॥40/-
పేజీలు:48

నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్, కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

షాకిచ్చిన మేక్రాన్ :
ఫ్రెంచ్ అసెంబ్లీ రద్దు
దావోస్ నుండి అట్లాంటా వరకు
తెలుగుదేశంలోకి
మాజీమంత్రి మల్లారెడ్డి?
లోపలి పేజీల్లో...

సంపుటి 26, సంచిక: 352 | మంగళవారం | 11-06-2024 | హైదరాబాద్ | Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12 | ఖమ్మం : 8+8 | కరీంనగర్ : 8+8 | మహబూబ్‌నగర్ : 12 | వెల రూ. 5.00

# రుణమాఫీకి విధివిధానాలు

ఆగస్టు 15లోగా చేసి తీరాల్సిందే
పూర్తి వివరాలు సేకరించి,
ప్రణాళిక సిద్ధం చేయండి
అధికారులకు ముఖ్యమంత్రి
రేవంత్‌రెడ్డి ఆదేశం
వ్యవసాయ, సహకార శాఖ
అధికారులతో సమీక్ష



ప్రజాపక్షం / హైదరాబాద్

పంట రుణమాఫీకి సంబంధించి విధివిధానాలు రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఆగస్టు 15వ తేదీలోగా పంట రుణమాఫీ చేసి తీరాలని ముఖ్యమంత్రి అధికారులకు తేల్చి చెప్పారు. పంట రుణమాఫీ, ఇతర అంశాలపై వ్యవసాయ, సహకార శాఖ అధికారులతో సిఎం రేవంత్ రెడ్డి సోమవారం సమీక్ష నిర్వహించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రైతు రుణమాఫీ అమలు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. రూ.2లక్షల వరకు రుణాలు ఉన్న రైతుల జాబితాను సిద్ధం చేయాలన్నారు. పూర్తి స్థాయిలో బ్యాంకర్ల నుంచి రైతుల వివరాలు సేకరించి అర్హులను గుర్తించాలని తెలిపారు. రుణ మాఫీకి సంబంధించిన కటాఫ్ డేట్ విషయంలో సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సిఎం అధికారులకు సూచించారు. కేవలం బ్యాంకుల నుంచే కాకుండా, పిఎసిఎస్ నుంచి పంట రుణాలు తీసుకున్న రైతుల వివరాలు కూడా అందుబాటులో ఉండేలా చూడాలని తెలిపారు. రూ.2లక్షల రైతు రుణమాఫీ చేసేందుకు పూర్తి స్థాయి వివరాలతో పాటు అవసరమైన అంచనా వ్యయాన్ని రూపొందించాలని అధికారులకు సూచించారు. రుణమాఫీకి సంబంధించి విధివిధానాలను రూపొందించి స్పష్టమైన ప్రణాళికతో ముందుకు రావాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, సంబంధిత శాఖా అధికారులు పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ చట్టంలో రెండు తెలుగు రాష్ట్రాలకు అంశాల అమలు, కేంద్రం నుండి రెండు రాష్ట్రాలకు రావాల్సిన నిధులు, పథకాలు, ప్రాజెక్టుల సాధనకు కృషి చేయాలని రెండు రాష్ట్రాల నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రులను తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కె.రేవంత్‌రెడ్డి కోరారు. తెలుగు రాష్ట్రాల నుండి కేంద్ర మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసిన జి.కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కుమార్, కె.రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, భూపతిరాజు శ్రీనివాసవర్మకు ముఖ్యమంత్రి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు సిఎం సోమవారం 'ఎక్స్ వేదిక'గా ఒక ట్వీట్ చేశారు.

## సింగిల్ టీచర్ స్కూళ్లను మూసివేయం

03

డిఎస్‌సి ద్వారా త్వరలో టీచర్ పోస్టులు భర్తీ
ప్రతీ గ్రామం, ప్రతీ తండాకు విద్య అందిస్తాం

ప్రధాని ఆవాస్ యోజన కింద

# 3 కోట్ల ఇండ్లు

కేంద్ర మంత్రివర్గ
తొలి సమావేశం ఆమోదం
'పిఎం కిసాన్ నిధి'పై మోదీ
మొదటి సంతకం



న్యూఢిల్లీ : ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పిఎంఎవై) కింద మూడు కోట్ల ఇళ్ళు నిర్మించేందుకు ప్రభుత్వ సహాయాన్ని అందిస్తూ కేంద్రమంత్రివర్గం సోమవారంనాడు ఆమోదం తెలియజేసింది. వరుసగా మూడోసారి గెలిచి ప్రధానమంత్రిగా పదవీ ప్రమాణస్వీకారం చేశాక నరేంద్రమోదీ అధ్యక్షతన సోమవారంనాడు మొట్టమొదటి మంత్రివర్గ సమావేశం జరిగింది. ఢిల్లీలోని లోక కల్యాణ్ మార్గ్ 7లో ఉన్న ప్రధానమంత్రి నివాసంలో ఈ తొలి మంత్రివర్గ సమావేశం జరిగింది. ఎన్‌డిఎ కూటమిలో ఉన్న అన్ని మిత్రపార్టీలకు చెందిన మంత్రులూ ఈ సమావేశానికి హాజరయ్యారు. "ఈరోజు జరిగిన మంత్రివర్గ సమావేశంలో మూడు కోట్ల అదనపు ఇళ్ళను గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో పిఎంఎవై కింద నిర్మించేందుకు సహాయం సమ తరువాయి 2లో

## కీలక శాఖలన్నీ బిజెపికే...

న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో కొలువుదీరిన కేంద్ర మంత్రులకు సోమవారం శాఖలు కేటాయించారు. ఆర్థిక, రక్షణ, విదేశీ వ్యవహారాలు వంటి కీలక శాఖలన్నీ బిజెపి చేతిలోనే ఉన్నాయి. అమిత్ షా (హోం శాఖ), నిర్మలా సీతారామన్ (ఆర్థిక శాఖ), రాజ్‌నాథ్ సింగ్ (రక్షణ శాఖ), ఎస్. జయశంకర్ (విదేశాంగ శాఖ) తమతమ పాత శాఖలనే తిరిగి పొందారు. బిజెపి అధ్యక్షుడు జెపి నడ్డా తిరిగి ఆరోగ్య శాఖను దక్కించుకున్నారు. 2014లో మోదీ తొలిసారి ప్రధానిగా ఉన్నప్పుడు, ఆయన మంత్రివర్గంలో నడ్డా ఇదే శాఖ మంత్రిగా వ్యవహరించారు. మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు అత్యంత కీలకమైన వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి శాఖ లభించింది. మోదీ మొదటిసారి అధికారంలో ఉన్నప్పుడు ఆయన ఇదే శాఖను నిర్వహించారు. కాగా, తెలంగాణ నుంచి జి కిషన్ రెడ్డికి బొగ్గు శాఖ, గనుల శాఖ లభించగా, బండి సంజయ్ హోం శాఖ సహాయ మంత్రిగా ఉంటారు. ఆంధ్రప్రదేశ్ నుంచి తరువాయి 2లో

సీనియర్ మంత్రులకు పాతవే..
కిషన్‌రెడ్డికి బొగ్గుగనులు,
బండి సంజయ్‌కి హోంశాఖ
(సహాయ), రామ్మోహన్‌నాయుడుకు
పౌర విమానయాన, పెమ్మసాని
చంద్రశేఖర్‌కు గ్రామీణ అభివృద్ధి,
కమ్యూనికేషన్స్ (సహాయ), శ్రీనివాస
వర్మకు భారీ పరిశ్రమలు, ఉక్కు
(సహాయ)

పూర్తి వివరాలు 7లో..



## 'కాళేశ్వరం'పై విచారణ ఇక వేగవంతం

జస్టిస్ పినాకి చంద్రఘోష్ వెల్లడి
తొలి రోజు ఏడుగురికి నోటీసులు
నేడు మరో 18 మందికి..

ప్రజాపక్షం / హైదరాబాద్

కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణంలో అవకతవకలపై విచారణ మరింత వేగవంతం చేస్తామని కాళేశ్వరం కమిషన్ చీఫ్ జస్టిస్ పినకి చంద్ర ఘోష్ అన్నారు. తొలి రోజు సోమవారం ఏడుగురు విచారణకు రావాలని నోటీసులు ఇచ్చామని, నేడు మంగళవారం మరో 18 మందికి విచారణ రావాలని నోటీసులు ఇవ్వనున్నట్లు తెలిపారు. సోమవారం బూర్గుల రామకృష్ణారావు భవన్‌లోని తమ కార్యాలయంలో ఆయన మీడియాతో చిట్ చాట్‌గా మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టును ఇప్పటికే పిరిశీలించి వచ్చామని, దీనిపై విచారణ తాజాగా ప్రారంభం అయిందన్నారు. ఈ నెల 10 నుంచి వరుసగా ఆరు రోజుల పాటు బూర్గుల రామకృష్ణారావు భవన్‌లోని తమ కమిషన్ కార్యాలయంలో జరిగే విచారణకు హాజరు కావాలని కోరామన్నారు. ప్రాజెక్టులోని పలు చోట్ల మరమ్మతులు కూడా జరుగుతున్నాయని, వాటిపై రెండు రోజుల్లో నివేదిక కూడా ఇవ్వాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ప్రభుత్వ అధికారులతో పాటు, ఇరిగేషన్ కన్సల్‌టెన్సీ సంస్థలు తమను కలుస్తారని, అవకతవకలకు సంబంధించి అన్ని విషయాలు రానున్న రోజుల్లో బయటకు వస్తాయని చెప్పారు. కమిషన్‌కు ఇప్పటి వరకు 54 ఫిర్యాదులు వచ్చాయని, వాటిని పరిశీలన చేస్తామన్నారు. ఆ ఫిర్యాదులో నష్టపరిహారం అంద లేదని కూడా ఫిర్యాదులు వచ్చాయన్నారు. ఈ క్రమంలో సంబంధిత ఏజెన్సీలను తరువాయి 2లో

## హమాలీ రేట్లు సవరించాలి

క్వింటాలు ఎగుమతి, దిగుమతికి
రూ.35 చెల్లించాల్సిందే..
ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన
కార్యదర్శి ఎస్.బాల్‌రాజు
డిమాండ్
సివిల్ సప్లయిస్ హమాలీ
వర్కర్స్ యూనియన్
పౌరసరపరాల భవన్ ముట్టడి

ప్రజాపక్షం/హైదరాబాద్




పెరుగుతున్న ధరలకు అనుగుణంగా సివిల్ సప్లయిస్ హమాలీలకు హమాలీ రేట్లు సవరించాలని ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్ రాజు డిమాండ్ చేశారు. క్వింటాలు, ఎగుమతి, దిగుమతికి రూ.35లు చెల్లించాల్సిందేనని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సివిల్ సప్లయిస్‌లో పని చేస్తున్న హమాలీలకు హమాలీ రేట్లు పెంచాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర సివిల్ సప్లయిస్ హమాలీ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి అనుబంధం) రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్‌లోని పౌరసరఫరాల శాఖ ప్రధాన కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ నిరసన కార్యక్రమానికి వివిధ జిల్లాల నుంచి పెద్ద ఎత్తున హమాలీలు తరలివచ్చారు. హమాలీలు సివిల్ సప్లయి భవన్‌లోకి చొచ్చుకెళ్లేందుకు యత్నించడంతో అప్పటికే అక్కడ భారీగా మోహరించిన పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య తోపులాట చోటు చేసుకోవడంతో కొద్దిసేపు తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది.

**ఒప్పందాన్ని అమలు చేయాలి**

గతంలో జరిగిన ఒప్పందం ప్రకారం ప్రతి రెండేళ్ళకోసారి పెరుగుతున్న ధరలకు అనుగుణంగా హమాలీ రేట్లు పెంపును తక్షణమే అమలు చేయాలని బాల్‌రాజు డిమాండ్ చేశారు. గడువు ముగిసి 5 నెలలు గడుస్తున్న సివిల్ సప్లయిస్ అధికారులు కనీసం చర్చలకు పిలవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. హమాలీలకు ఇఎస్‌ఐ అమలు చేసేందుకు సివిల్ సప్లయి అధికారులు ఇయస్‌ఐకి రూ. 1.50 కోట చెల్లించారు తప్ప అమలుకు చర్యలు తీసుకోపోవడం దారుణమన్నారు. హమాలీ కార్మికులు ఎగుమతి, దిగుమతి చేస్తున్న ప్రమాదాలు సర్వ సాధారణమని, వెంటనే ప్రభుత్వం ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని ఆయన కోరారు. అనేక పోరాటాల అనంతరం సాధించుకున్న బోనస్‌ను దశలవారిగా పెంచుతూ ప్రస్తుతం రూ. 6500లు చెల్లిస్తున్నారని దీనిని రూ.10వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ కొత్త ఉద్యోగాలను భర్తీ చేస్తున్న నేపథ్యంలో రాష్ట్రంలోని 3200హమాలీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కమిషనర్, డైరెక్టర్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని లేకపోతే సమ్మె నోటీసు ఇచ్చి సమ్మె చేస్తామని బాల్‌రాజు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వై.ఓమయ్య, ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి టి.సమ్మయ్య తరువాయి 2లో




జులై 10న
## ఉప ఎన్నికలు

ఏడు రాష్ట్రాల్లోని 13 అసెంబ్లీ
నియోజకవర్గాల్లో పోలింగ్
ఈనెల 14న నోటిఫికేషన్ జారీ
నామినేషన్ల దాఖలుకు
21వ తేదీ వరకు గడువు

న్యూఢిల్లీ : దేశంలో మరోసారి ఎన్నికలు జరగనున్నాయి. పశ్చిమ బెంగాల్‌లో నాలుగు సహా ఏడు రాష్ట్రాల్లోని 13 అసెంబ్లీ నియోజకవర్గాల్లో జులై 10వ తేదీన ఉప ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎన్నికల కమిషన్ సోమవారం ప్రకటించింది. ఆయా నియోకవర్గాల్లో గెలుపొందిన సభ్యులు మరణించడం, రాజీనామా చేయడంతో ఖాళీ ఏర్పడడంతో వాటికి ఉప ఎన్నికలు నిర్వహించనున్నారు. రూపౌలి (బీహార్), రాయ్‌గంజ్, రణఘాట్ దక్షిణ్, బగ్దా, మాణిక్‌తాల (అన్ని బెంగాల్‌లోని స్థానాలే), విక్రవండి (తమిళనాడు), అమర్‌వార (మధ్యప్రదేశ్), బద్రినాథ్, మంగ్లార్ (ఉత్తరాఖండ్), తరువాయి 2లో



## రియాసీలో దాడి చేసింది మేమే..

ద రెసిస్టెంట్ ఫ్రంట్ ప్రకటన
కశ్మీర్ ప్రాంతంలో మరిన్ని
ఉగ్రదాడులు చేస్తామని హెచ్చరిక

శ్రీనగర్ : జమ్ముకశ్మీర్ రియాసీ జిల్లాలో యాత్రికుల బస్సుపై జరిగిన దాడికి పాకిస్థాన్ నుంచి కార్యకలాపాలు నిర్వహించే ద రెసిస్టెంట్ ఫ్రంట్ ఉగ్రసంస్థ బాధ్యత వహించింది. కశ్మీర్ ప్రాంతంలో అలాంటి ఉగ్రదాడులు మరిన్ని చేస్తామని తరువాయి 8లో

మణిపూర్ ముఖ్యమంత్రి
## కాన్వాయ్‌పై ఉగ్రదాడి

భద్రతా సిబ్బందికి
గాయాలు



ఇంఫాల్ : మణిపూర్ ముఖ్యమంత్రి ఎన్. బిరేన్‌సింగ్ అడ్వాన్స్‌డ్ సెక్యూరిటీ కాన్వాయ్‌పై సోమవారం మెరుపు దాడి జరిగింది. భద్రతా కాన్వాయ్ వాహనాలపై పలు మార్లు తుపాకీ కాల్పులు జరిగాయని పోలీసులు తెలిపారు. ఈ దాడిలో ఓ భద్రతా సిబ్బందికి బుల్లెట్ గాయాలు అయినట్లు వెల్లడించారు. ముఖ్యమంత్రి అడ్వాన్స్‌డ్ సెక్యూరిటీ కాన్వాయ్ సమస్యాత్మక ప్రాంతమైన జిరిబామ్ జిల్లాకు వెళ్తుండగా ఈ ఘటన జరిగింది. ఈ దాడిలో ఉగ్రవాదుల హస్తం ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ ఘటన కాంగ్‌పోక్పి జిల్లాలో జరిగినట్లు వెల్లడించారు. జిరిబామ్ ప్రాంతంలో రెండు పోలీస్ ఔట్‌పోస్టులు, ఒక ఫారెస్ట్ బీట్ అధికారి కార్యాలయం, దాదాపు 70 ఇళ్లను శనివారం దుండగులు తగులబెట్టారు. ఈ నేపథ్యంలో సోమవారం ఢిల్లీ నుంచి ఇంఫాల్‌కు బయలుదేరిన సిఎం బిరేన్ సింగ్, జిరిబామ్‌ను సందర్శించి పరిస్థితిని సమీక్షించేందుకు ప్రణాళిక వేసుకున్నారు. ఈ నేపథ్యంలో జిరిబామ్‌కు బయలుదేరిన తరువాయి 8లో

# ఫీజులపై నియంత్రణేది?

ఇష్టానుసారంగా వసూళ్లు
అచేతనంగా విద్యాధికారులు
మా పాఠశాల మా ఇష్టం అనే
రీతిలో యాజమాన్యాలు

ప్రజాపక్షం/ ఖమ్మం




ప్రభుత్వ విద్యా వ్యవస్థ బలహీనపడటంతో ప్రైవేటు విద్యా సంస్థల యజమానులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. కొన్ని యాజమాన్యాలు సేవా ధృక్పథంతో వ్యవహరిస్తుంటే మరి కొన్ని యాజమాన్యాలు ధనార్జనే ధ్యేయంగా పని చేస్తున్నాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ప్రైవేటు విద్యా సంస్థల్లో ఫీజులను నియంత్రిస్తామని స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. విద్యా సంవత్సరం ప్రారంభమవుతున్న ఇంత వరకు ఆ దిశగా ప్రభుత్వం ఆలోచన చేసిన దాఖలాలు లేవు. దీనితో విద్యను వ్యాపారంగా మార్చుకున్న కొన్ని సంస్థలు అతిపెద్ద దోపిడీకి తెర లేపాయి. ఇదే సమయంలో ప్రైవేటు విద్యా సంస్థల యజమానులు కొందరు పేద, సాదా చూసి ఫీజులు తీసుకోవడంతో పాటు కొంత మంది పేద విద్యార్థులకు సైతం ఉచితంగా విద్యను అందిస్తున్నారు. ఫీజుల విషయంలో పట్టింపు లేకుండా వ్యవహరిస్తున్న యాజమాన్యాల తీరు అభినందనీయమే కాని ధనార్జనే ధ్యేయంగా వ్యవహరించే విద్యా సంస్థల పట్ల కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఖమ్మంలో తన విద్యా వ్యాపారాన్ని విస్తరించిన ఓ సంస్థ ఒకటవ తరగతికి రూ.1.05 లక్షల ఫీజు నిర్ణయించిందంటే పరిస్థితి ఏవిధంగా ఉందో అవగతం చేసకోవచ్చు. జాతీయ, అంతర్జాతీయ పేర్లతో సంస్థలను నడుపుతున్న కొందరు విద్యార్థుల తల్లిదండ్రులను జలగల్లా పీల్చేస్తున్నారు. నర్సరీకి రూ. 10వేల అడ్మిషన్ ఫీజు, రూ. 28వేల స్కూల్ ఫీజు, రూ. 5వేల యూనిఫాం, రూ. 5వేలు బుక్స్, స్టేషనరీ, రూ.10వేల బస్సు, ఇతరత్రా కార్యక్రమాల నిర్వహణకు రూ. 8వేల డిపాజిట్ చేయాలని ఓ పాఠశాల డిమాండ్ చేసిందంటే వసూళ్ల స్థాయి ఏవిధంగా తరువాయి 8లో

## ఉక్రేన్ శాంతిసదస్సుకు 90 దేశాలు?



**బెర్న్ :** రష్యాకు వ్యతిరేకంగా మద్దతు కూడగట్టేందుకు ఉక్రేన్ దేశాధ్యక్షుడు చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగా స్విట్జర్లాండ్‌లో తలపెట్టిన శాంతిసదస్సుకు 90 దేశాలు, సంఘాలు హాజరవుతున్నాయి. స్విట్జర్లాండ్ ప్రభుత్వం సోమవారంనాడు ఈ విషయం వెల్లడించింది. ఈనెల 15,16 తేదీల్లో స్విట్జర్లాండ్‌లో ఈ ఉక్రేన్ శాంతి సదస్సు జరుగనున్నది. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి కూడా ఉక్రేన్ దేశాధ్యక్షుడు జెలెన్స్కీ ఆహ్వానం పలికారు. యూరప్‌లోని సగానికి సగం దేశాలు ఈ సదస్సుకు వస్తున్నాయని, ప్రపంచవ్యాప్తంగా భారీగా మద్దతు కూడగడుతున్నామని స్విట్జర్లాండ్ ప్రభుత్వం ప్రకటించింది. ఐక్యరాజ్యసమితి చట్టాలకు, అంతర్జాతీయ చట్టాలకు లోబడి ఉక్రేన్‌లో శాంతి సాధన చేసేందుకు ప్రపంచ దేశాల విస్తారమైన మద్దతు కూడగట్టడంకోసం ఈ శాంతి సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపింది. ఉక్రేన్ దేశాధ్యక్షుడు జెలెన్స్కీ విజ్ఞప్తి మేరకు స్విట్జర్లాండ్ ప్రభుత్వం ఈ శాంతి సదస్సు నిర్వహిస్తున్నది. కానీ రష్యా మాత్రం ఈ సదస్సుకు హాజరు కావడం లేదు.

### స్తంభింపజేసిన రష్యా ఆస్తులు ఉక్రేన్ యుద్ధానికి?

ఉక్రేన్ ప్రయోగించిన 71 డ్రోన్లను కూల్చేసినట్లు రష్యా ప్రకటించింది. అదేసమయంలో రష్యా జెట్‌ను కూల్చేసినట్లు ఉక్రేన్ ప్రకటించింది. మరోవైపు అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఒక ప్రకటన చేస్తూ ఉక్రేన్ పెద్ద ఆయుధాలు ఉపయోగించే విషయంలో ఉన్న ఆంక్షలు ఎత్తివేస్తామని ప్రకటించారు. రష్యా కేవలం ఉక్రేన్‌తోనే ఆగదని, ఇంకా ముందుకు దూసుకువస్తుందని ఆయన హెచ్చరించారు. ప్రపంచవ్యాప్తంగా ఇప్పటికే 280 బిలియన్ డాలర్ల మేరకు రష్యా ఆస్తుల నిధులను యూరోపియన్ యూనియన్, అమెరికాలు స్తంభింపజేశాయి. ఈ నిధులను ఉక్రేన్ యుద్ధానికి ఉపయోగించే ఆలోచన చేస్తున్నాయి.

## ఇరాన్ అధ్యక్ష ఎన్నికల్లో ఆరుగురు పోటీ



**టెహ్రాన్ :** ఇరాన్ అధ్యక్ష ఎన్నికల్లో ఆరుగురు అభ్యర్థులు పోటీ చేసేందుకు ఇరాన్ ప్రభుత్వం ఆమోదం తెలియజేసింది. అనేక పార్టీలకు చెందినవారు అధ్యక్ష పదవికి పోటీ చేసేందుకు నామినేషన్లు వేసినప్పటికీ, ఈ నామినేషన్లను పరిశీలించిన ప్రత్యేక ప్రభుత్వ కమిటీ చిట్టచివరి జాబితాలో ఆరు అభ్యర్థులు మాత్రమే పోటీ చేసేందుకు అనుమతి మంజూరు చేసింది. వారి పేర్లు ఖరారు చేస్తూ ఆమోదం తెలియజేసింది. ఈనెల 28వ తేదీన ఇరాన్ అధ్యక్ష పదవికి ఎన్నికలు జరుగుతాయి. మే 19వ తేదీన హెలికాప్టర్ ప్రమాదంలో ఇరాన్ దేశాధ్యక్షుడు ఇబ్రహీం రైసీ మరణించడంతో ఇరాన్ రాజ్యాంగానికి అనుగుణంగా ఈ ఎన్నికలు నిర్వహిస్తున్నారు. ఇరాన్ నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్‌లో దేశ సర్వోన్నతనేత ప్రాతినిధ్యం వహించే మాజీ అణు సంప్రదింపులకర్త సయీద్ జలిలీ, ప్రస్తుత ఇరాన్ పార్లమెంటు స్పీకర్ మహ్మద్ బాఘేర్ ఘలిబాఫ్, రిఫార్మిస్టు పార్లమెంటేరియన్ మసైద్ పెజెష్కియాన్, న్యాయ, దేశీయ మాజీ మంత్రి ముస్తాఫా పౌర్ మహ్మద్, ఉపాధ్యక్షుడు అమిర్ హుస్సేన్ ఘాజీజాదేహ్ హాషిమి, టెహ్రాన్ మేయర్, 2021లో అధ్యక్ష పదవికి పోటీ చేసిన అభ్యర్థి అలి రెజా జఖానీ ఈనెలాఖరున జరిగే ఎన్నికల్లో పోటీ పడేందుకు అధికారికంగా ఆమోదముద్ర లభించింది.

# షాకిచ్చిన మేక్రాన్ : ఫ్రెంచ్ అసెంబ్లీ రద్దు

**పారిస్ :** యూరోపియన్ యూనియన్ ఎన్నికల్లో ఫ్రాన్స్ అధికార పార్టీకి ఎదురు దెబ్బ తగలడంతో ఆ దేశ జాతీయ అసెంబ్లీని అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ రద్దు చేశారు. ఆయన నిర్ణయం దేశంలో రాజకీయపార్టీలకు తీవ్ర దిగ్భ్రాంతి కలిగించింది. ఈ నిర్ణయం మేరకు జూన్ 30, జులై 7 వ తేదీల్లో రెండు విడతలుగా జాతీయ అసెంబ్లీకి ఎన్నికలు నిర్వహిస్తారు. నిర్ణీత ప్రకారం ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ మరో మూడు సంవత్సరాలపాటు అధికారంలో కొనసాగే అకాశం ఉన్నప్పటికీ ఆయన ఈ మెరుపు నిర్ణయం తీసుకున్నారు. ఈ దెబ్బతో ఫ్రాన్స్‌లో సోమవారంనాడు స్టాక్ మార్కెట్లు కుప్పకూలాయి. లక్షలకోట్ల మేరకు నష్టపోయాయి. ఈ పరిణామంపై ఫ్రెంచ్ అసెంబ్లీ స్పీకర్ యాయెల్ బ్రేవల్ పివోట్ ఒక ప్రకటన చేస్తూ మేక్రాన్ తీసుకున్న నిర్ణయం అంత్యంత విచారకరమైనదని విమర్శించార. ఈ సమస్యకు మరో విధంగా కూడా పరిష్కారం సాధిచవచ్చునని ఆమె అన్నారు. పారిస్ మేయర్ అన్నే హిడల్గో దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ జూలై 26 నుండి ఒలింపిక్స్ మొదలవుతున్నాయనీ, ఈ ఎన్నికలు పెద్ద సమస్యగా మారతాయని ఆందోళన వ్యక్తం చేయగా ఐఒసి మాత్రం అలాంటి ఇబ్బంది లేదని స్పష్టం చేసింది.




"నేను మీ ఆందోళన, మీరిచ్చిన సందేశం గమనించాను, మీ సమస్యలను తేలికగా తీసుకోలేను, మీరు సరైన నిర్ణయం తీసుకోవడంతో పాటు దేశాన్ని సరైన మార్గంలతో నడపాలని నేను కోరుకుంటున్నాను

### జూన్ 30, జులై 7 తేదీల్లో ఎన్నికలు

అందుకు ఇది ఒక అవకాశం" అని మేక్రాన్ ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి చెప్పారు. ఫ్రాన్స్‌కు చెందిన కరడుగట్టిన మితవాద ర్యాలీపార్టీ యూరోపియన్ యూనియన్ ఎన్నికల్లో పట్టు సాధించడంతో మేక్రాన్ పార్టీకి ప్రజల్లో వ్యతిరేకత ఏర్పడిందనే ముందస్తు సంకేతాలు వెలువడ్డాయి. ఈ పరిణామాలు అధికార మేక్రాన్ 'రెనైజాన్స్' సెంట్రిస్ట్ పొలిటికల్ పార్టీకి దడపుట్టించాయి.





దీంతో 2027లో జాతీయ అసెంబ్లీకి నిర్ణీత ప్రకారం ఎన్నికలు జరగాల్సి ఉండగా, మేక్రాన్ తనకున్న అధికారాలను ఉపయోగించి జాతీయ అసెంబ్లీని రద్దు చేశారు. ఇంకా యూరోపియన్ యూనియన్ ఎన్నికల ఫలితాలుపూరర్తిగా వెలువడకముందుగానే మేక్రాన్ జాతీయ అసెంబ్లీ రద్దు చేసి సంచలన నిర్ణయం ప్రకటించారు. 2017 మే నెలలో మొదటిసారి అధికారం చేపట్టిన మేక్రాన్ 2022లో కూడా సునాయాసంగా దేశాధ్యక్ష పదవికి గెలిచారు. మేక్రాన్‌కు చెందిన 'రెనైజాన్స్' (ఆర్ ఇ)పార్టీతోసహా ఎనిమిది పార్టీల 'లిబరల్' కూటమి ఈ ఎన్నికల్లో గెలిచింది. 65 ఏళ్ళక్రితం 1958 లో ఉనికిలోకి వచ్చిన ఫ్రెంచ్ జాతీయ అసెంబ్లీలో మొత్తం 577 స్థానాలు ఉన్నాయి. ఇందులో మేక్రాన్ అధికార కూటమికి 249 స్థానాలు ఉండగా, ఆయన పార్టీ 'రెనైజాన్స్' 171 స్థానాలు గెలుచుకుని 2022 ఎన్నికల్లో ఏకైక పెద్దపార్టీగా ఆవిర్భవించింది. ఆనాడు ప్రతిపక్షంలో ఉన్న నేషనల్ ర్యాలీ పార్టీకి 88 స్థానాలు వచ్చాయి. ఇప్పుడు నేషనల్ ర్యాలీ పార్టీ యూరోపియన్ యూనియన్ ఎన్నికల్లో మెరుపులు మెరిపించడంతో ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ కంగుతిన్నారు. ఈ పరిణామాలే జాతీయ అసెంబ్లీ రద్దుకు దారితీశాయి.

### కరడుగట్టిన మితవాదులకే ఇయు పట్టం?



**పారిస్ :** యూరోపియన్ యూనియన్ పార్లమెంటుకు జరిగిన ఎన్నికల ఓట్ల లెక్కింపు సోమవారంనాడు కొనసాగింది. 2019 నుండి యూరోపియన్ యూనియన్ కమిషన్ ఛైర్మన్‌గా ఉన్న ఉర్సులే వోన్‌డెర్ లేయన్ ఈ సారి కూడా విజయం సాధించే అకాశాలు కనిపిస్తున్నాయి. ముందుగా రాజకీయ పండితులు హెచ్చరించినవిధంగానే కరడుగట్టిన మితవాదపార్టీలే ఎన్నికల ఫలితాల్లో దూసుకుపోతున్నాయి. దీంతో 2029 వరకూ తిరిగి వోన్ డెర్ లేయన్ ఛైర్మన్ పదవిలో కొనసాగే అవకాశాలు కనిపిస్తున్నప్పటికీ ఇంకా ఆమె ప్రాతినిధ్యం వహిస్తున్న సెంటర్ రైట్ మితవాద పార్టీతో మళ్ళీ ఒప్పందాలు కుదరాల్సి ఉంటుంది. యూరోపియన్ యూనియన్ ఎన్నికల్లో కరడుగట్టిన పచ్చి మితవాదులు, ఫ్రాన్స్‌దేశ ప్రతిపక్షం ఆధిపత్యంలో ఉందన్న సంకేతాలు రావడంతో ఆ దేశాధ్యక్షుడు మేక్రాన్ అందరినీ ఆశ్చర్యపరుస్తూ జాతీయ అసెంబ్లీని రద్దు చేశారు. బల్గేరియాలో కూడా మితవాదుల హవా నడుస్తున్నది. ఇంకా పూర్తిస్థాయిలో ఫలితాలు వెలువడలేదు. యూరోపియన్ యూనియన్ పార్లమెంటులో మొత్తం 720 స్థానాలు ఉండగా 27 దేశాల్లో ఈనెల 6 నుండి 9 వరకు పోలింగ్ ప్రక్రియ జరిగింది.

## 'కొరియా'ల మధ్య ఆగని 'చెత్త' ఘర్షణ

**సియోల్ :** ఉభయ కొరియా దేశాలమధ్యా మళ్ళీ ఉద్రిక్తలు పెరిగాయి. గడచిన పది రోజులుగా ఉత్తరకొరియా రెచ్చగొట్టే చర్యలకు పాల్పడుతోందనీ, తమదేశంలోకి బెలూన్ల ద్వారా చెత్తను పంపిస్తోందనీ విమర్శించి 2018 నాటి శాంతి ఒప్పందాన్ని రద్దు చేసుకున్న దక్షిణకొరియా సరిహద్దుల్లో మళ్ళీ సైన్యాన్ని మోహరించింది. ఐనాగానీ ఈ వివాదం చల్లారలేదు. ఉత్తరకొరియా తాజాగా మళ్ళీ మరో 300 బెలూన్లలో సిగరెట్టు పీకలు, మెన్యూర్, పేడ, ఇతర చెత్త వ్యర్థాలను బెలూన్ల ద్వారా గగనమార్గంలో పంపిందని దక్షిణ కొరియా విమర్శించింది. దీంతో మళ్ళీ ఉద్రిక్తతలు చెలరేగాయి. రెండు దేశాలు తమ సరిహద్దుల్లో లౌడ్ స్పీకర్లు పెట్టుకుని పరస్పరం దూషించుకుంటున్నాయి. ఉత్తర కొరియా చేష్టలతో ఇప్పటికే అమెరికా, కొరియా వైమానిక దళాలు ఉమ్మడిగా గగనతలో విన్యాసాలుచేసి నమూనా బాంబు దాడులు చేసి ఉత్తర కొరియాకు హెచ్చరిక చేశాయి.

## మంత్రగత్తెల సంఘ నాయకురాలు అరెస్ట్

**మాస్కో :** రష్యాలో అత్యంతశక్తిమంతమైన మంత్రగత్తెలసంఘం (ఎంపైర్ ఆఫ్ మోస్ట్ పవర్‌ఫుల్ విచెస్ ఆర్గనైజేషన్) నాయకురాలు అలెనా పోలైన్ అకా ఎలెనా సులికోవాను మాస్కో పోలీసులు బుధవారంనాడు అరెస్టు చేశారు. ఈ ముసుగులో ఆమె మోసాలకు, ఉగ్రవాదానికి, మతభావాలను విశ్వసించేవారిని అవమానపరచడం వంటి అనేక చర్యలకు పాల్పడుతోందని పోలీసులు సందేహిస్తున్నారు. ఈ మంత్రగత్తెల సంఘాన్ని 2015 లోనే ఆమె స్థాపించింది. మాస్కో రీజినల్ ఇన్వెస్టిగేటివ్ కమిటీ సమాచారం ప్రకారం గత మూడేళ్లలో ఆమెపై అనేక ఆరోపణలు వచ్చాయి.

## బ్రిటన్ ఎన్నికల్లో లేబర్‌పార్టీ పవనాలు!

**లండన్ :** బ్రిటన్ పార్లమెంటుకు జులై 4వ తేదీన జరిగే ఎన్నికల్లో భారత సంతతికి చెందిన ప్రస్తుత ప్రధానమంత్రి, కన్జర్వేటివ్ పార్టీ నాయకుడు రిషి సునాక్ తను పోటీ చేసే సొంత నియోజకవర్గంలో కూడా గెలవలేనంత దారుణమైన ప్రతికూల పరిస్థితులు నెలకున్నాయి! ఈసారి ఎన్నికల్లో లేబర్ పార్టీ పవనాలు వీస్తున్నాయి. డెల్టా పోల్స్ సర్వే ఈ విషయాన్నే వెల్లడిస్తున్నది.లేబర్‌పార్టీ 46 శాతం, కన్జర్వేటివ్ పార్టీ 21శాతం ఓట్లకే పరిమితం అవుతుందని ముందస్తు సర్వే వెల్లడించింది. రిషి సునాక్ లేబర్‌పార్టీని గట్టెక్కిస్తారని 22 శాతం మంది మాత్రమే ఈ సర్వేలో అభిప్రాయపడ్డారు. ఐతే "గడచిన వారంలో రిషి సునాక్‌కు, ఖైర్ స్టార్‌మర్‌కు మధ్య జరిగిన ముఖాముఖీ టీవీ డిబేట్‌లో లేబర్‌పార్టీ గనుక అధికారంలోకి వస్తే ప్రతి ఇంటిమీదా 2,000 డాలర్లు మేరకు పన్నుల భారాన్ని భారీగా పెంచేస్తారని రిషి సునాక్ చెప్పిన విషయంపై తాము తీవ్ర ఆందోళనతో ఉన్నాం" అని డెల్టా పోల్ సర్వేలో 59 శాతం మంది అభిప్రాయం వ్యక్తం చేశారు. లేబర్‌పార్టీ విజయం



సాధిస్తే బ్రెగ్జిట్(యూరోపియన్ యూనియన్ నుండి బయటకు వచ్చేయడం) నిర్ణయంపై పునఃసమీక్ష చేస్తుందని 41 శాతం మంది ఈ సర్వేలో అభిప్రాయపడగా 25 శాతం మంది తిరస్కరించచారు. బ్రిటన్ దిగువసభ హౌస్ ఆఫ్ కామన్స్‌లో ఉన్న మొత్తం 650 స్థానాలకుగాను లేబర్‌పార్టీ 416 స్థానాలు గెలుచుకుంటుందనీ, కన్జర్వేటివ్ పార్టీ దారుణమైనస్థాయికి దిగజారిపోతుందని తాజాగా వెల్లడైన డెల్టాపోల్ సర్వే అధ్యయనం పేర్కొంది. చివరకు ప్రధానంత్రి రిషి సునాక్ ప్రాతినిధ్యం వహిస్తున్న యార్క్‌షైర్ నియోజకవర్గంతో ప్రస్తుతం ఆయనకు 27,000 కు పైగా ఉన్న మెజారిటీని కూడా నిలబెట్టుకునే పరిస్థితి లేదని, ఆయన గెలిచే అవకాశాలు లేవనీ నివేదిక స్పష్టంచేసింది. ఈ అధ్యయనంప్రకారం లేబర్ పార్టీ నాయకులు స్టార్‌మర్ 25 పాయింట్లు లీడింగ్‌లో ఉన్నారు. టోరీలు (కన్జర్వేటివ్ పార్టీ) కేలం 37 సీట్లకే పరిమితం అవుతారనీ, లేబర్‌పార్టీకి భారీగా 416 కంటే ఎక్కువసీట్లు వస్తాయని ముందస్తు సర్వే నివేదికలు చెబుతున్నాయి. ఐతే రిషి సునాక్ మొన్న జూన్ 6వ తేదీన ఫ్రాన్స్ నార్మండీలో జరిగిన 'డి–డే' 80వ వార్షికోత్సవం పట్ల ఏ మాత్రం గౌరవం ప్రకటించకుండా అతి తక్కువ సమయం మాత్రమే ఆ కార్యక్రమాలకు కేటాయించి హడావుడిగా వెళ్ళిపోవడంతో బ్రిటన్ ప్రజల్లో తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం అవుతున్నాయి ముఖ్యంగా సునాక్ నియోజకవర్గం యార్క్‌షైర్‌లో ఉన్న వృద్ధులైన ఓటర్లు రెండో ప్రపంచ యుద్ధ పరిణామాలతో ఎంతో బలంగా మానసికంగా పెనవేసుకుని ఉన్నారు. వారంతా సునార్ చర్యను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసుపై సిఎం సమీక్ష

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసుపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి పోలీసు ఉన్నతాధికరులతో సమీక్షించారు. సోమవారం బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు విచ్చేసిన సిఎం, డిజిపి రవిగుప్తా, హైదరాబాద్ పోలీసు కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డిలతో కలిసి కేసు పురోగతిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. కేసులో ఇప్పటివరకు పోలీసు అధికారుల పాత్రమాత్రమే బయటపడింది. వారిచ్చిన వాంగ్మూలంతో పాటు ఎస్ఐబి చీఫ్ ప్రభాకర్‌రావుపై జారీ చేసిన రెడ్ కార్నర్ నోటీసు గురించి కూడా చర్చ జరిగింది. ఫోన్‌ట్యాపింగ్ కేసులో నిందితుగా ఉన్న వారంతా బిఆర్ఎస్ ప్రభుత్వం పెద్దల ఆదేశాల మేరకే పనిచేశామని పోలీసుల విచారణలో తేలింది. ఈనేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంపై ఉత్కంఠ నెలకొంది. అయితే ఎన్నికల కోడ్ కారణంగా తాను ఈ అంశంపై ఎలాంటి రివ్యూ నిర్వహించలేదని గతంలో రేవంత్‌రెడ్డి ప్రకటించారు. అయితే కోడ్ పూర్తవడంతో ఇవాళ ఫోన్ ట్యాపింగ్ అంశంపై అధికారులతో రివ్యూ నిర్వహించారు. ఈ అంశంపై పోలీసు అధికారులకు సిఎం ఎలాంటి సూచనలు చేశారనే అంశంపై సర్వత్ర ఆసక్తి నెలకొంది.

## ఇక వేగవంతం (మొదటి పేజీ తరువాయి)

పిలుచి విచారణ చేస్తామని తెలిపారు. తప్పు మాది కాదంటే మాది కాదని అటు, ఇటు నుంచి వస్తున్న ఫిర్యాదుల నేపథ్యంలో నిజాలు తెలుసుకునేందుకు అందరి వద్దా అన్ని రకాల సమాచారం తీసుకుంటున్నామన్నారు. నేడు జూన్ 11 అని , జూన్ 30 లోపు అంటే 20 రోజుల వ్యవధిలోనే విచారణ పూర్తి కాదు అని, ఇందుకు ఇంకా సమయం పడుతుందని అందుకోసం విచారణను వేగవంతం చేస్తామన్నారు. ఇరిగేషన్ శాఖకు సంబంధించి అసలు విషయాలు, నిజాలు తెలుసుకోకుండా పూర్తి నివేదిక ఇవ్వలేనని అభిప్రాయపడ్డారు. మొన్నటి వరకు ఎలక్షన్ కోడ్ అమలులో ఉందని, అందుకే కాళేశ్వరంపై విచారణకు కొంత ఆలస్యం అయిందన్నారు. నిన్న ఏడు 7 మందికి విచారణకు రావాలని నోటీసులు ఇచ్చిన క్రమంలో నేడు 18 మంది విచారణకు రావాలని నోటీసులు ఇచ్చినట్లు ఆయన మీడియా అడిగిన ప్రశ్నకు బదులిచ్చారు. తొలుత టెక్నికల్ అంశాల విచారణ పూర్తి అయ్యాక, ఆర్థిక అంశాల పై విచారణ మొదలు పెడతామన్నారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల సహా కాళేశ్వరం ప్రాజెక్టుపై ప్రభుత్వం వద్ద నుంచి రిపోర్టులు అన్ని అందాయని, దీంతో వాటి పరిశీలనను కూడా సైమల్‌టెనీస్‌గా చేస్తున్నామన్నారు.

## హమాలీ రేట్లు సవరించాలి

(మొదటి పేజీ తరువాయి)

నాయకులు ఎన్.దేవేందర్, బాల్రాజ్, జకరయ్య, ఆలేరుశ్రీను, గొరిగె నర్సింహ్మా, సంపత్ తో పాటు వందలాది మంది పాల్గొన్నారు.

**సమస్యను పరిష్కరిస్తాం : కమిషనర్ డి.ఎస్.చౌహన్**

హమాలీ రెట్లు తప్పక పెంచుతామని సివిల్ సప్లై కమిషనర్ డి.ఎస్.చౌహన్ హమాలీలకు హామి ఇచ్చారు. మరో 10 రోజుల్లో యూనియన్ నేతలతో సమావేశమైన తప్పక సమస్యను పరిష్కరిస్తామని ఆయన తెలిపారు.కార్మికుల వద్దకే నిరసన వ్యక్తం చేస్తున్న హమాలీల వద్దకు కమిషనర్ డిఎస్ చౌహన్ స్వయంగా వచ్చి వినతి పత్రం స్వీకరించారు. ఈసందర్భంగా హమాలీల అన్ని సమస్యలను పరిష్కరిస్తామని ఆయన హామిచ్చారు.

## జులై 10న ఉప ఎన్నికలు

(మొదటి పేజీ తరువాయి)

జలంధర్ పశ్చిమ (పంజాబ్), డెహ్రా, హమిర్‌పూర్, నాలాగఢ్ (హిమాచల్ ప్రదేశ్)లో ఉప ఎన్నికలు జరగనున్నాయి. ఉప ఎన్నికలు జరిగా స్థానాల్లో ఈనెల 14న నోటిఫికేషన్ జారీ కానుంది. అప్పటి నుంచి 21వ తేదీ వరకు నామినేషన్లను సమర్పించవచ్చు. 24న స్క్రూట్నీ చేయగా, 26వ తేదీ వరకు ఉపసంహరించుకోవచ్చు. జులై 10న పోలింగ్ నిర్వహించి, 13న ఓట్లు లెక్కించనున్నారు. ఉప ఎన్నికల ప్రక్రియను జులై 15వ తేదీ నాటికి పూర్తి చేయనున్నట్లు ఎన్నికల సంఘం పేర్కొంది.

# దావోస్ నుండి అట్లాంటా వరకు

రాష్ట్రంలో పెట్టుబడులకు విదేశీ సంస్థలు సుముఖత

అమెరికాలో పర్యటిస్తున్న


రాష్ట్ర ఐటి, పరిశ్రమల మంత్రి శ్రీధర్‌బాబు

**ప్రజాపక్షం/కాళేశ్వరం :** తెలంగాణ రాష్ట్రంలో విదేశీ పెట్టుబడులు ఆకర్షించేందుకు రాష్ట్ర ఐటి పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు తనదైన మార్క్ ప్రదర్శిస్తున్నారు. ఇటీవల రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వంలో ఐటి,పరిశ్రమల శాఖను చేపట్టిన కొద్ది రోజుల్లోనే మంత్రి శ్రీధర్ బాబు ఐటి మరియ పరిశ్రమ తదితర రంగాల్లో రాష్ట్రంలో విదేశీ సంస్థలు పెట్టుబడులు పెట్టేందుకు విదేశీ పర్యటనలు కొనసాగిస్తున్నారు. తెలంగాణలో విదేశీ కంపెనీలకు అనువైన మౌళిక సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉన్నట్లు విదేశీ సంస్థల ప్రతినిధుల భేటీలో మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. విదేశీ పర్యటనలో భాగంగా దావోస్ నుండి అట్లాంటా వరకు వివిధ సెమినార్లలో పాల్గొన్న మంత్రి శ్రీధర్ బాబు రాష్ట్రంలో విదేశీ పెట్టుబడులను ఆకర్షించేందుకు తన మార్క్ ప్రదర్శించి ముందుకు సాగుతున్నారు.గత జనవరిలో దావోస్ లో జరిగిన ప్రపంచ ఆర్థిక సమావేశాల్లో పాల్గొన్న మంత్రి శ్రీధర్ బాబు సుమారు 40 వేల కోట్ల విదేశీ పెట్టుబడులపై ఆయా విదేశీ సంస్థల ప్రతినిధులతో ఒప్పందాలు కుదుర్చుకోగా తాజాగా అమెరికాలో రాష్ట్ర ఐటి, రిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు నేతృత్వంలో ఉన్నతాధికారుల బృందం పర్యటిస్తున్నారు. దీనిలో భాగంగా అట్లాంటాలో జరిగిన అమెరికా తెలుగు అసోసియేషన్ బిజినెస్ సెమినార్ లో పాల్గొన్న మంత్రి శ్రీధర్ బాబు తెలంగాణ రాష్ట్రంలో విదేశీ సంస్థలు పెట్టుబడులను ఆహ్వానిస్తూ సుదీర్ఘ ప్రసంగం చేశారు.ఆయా రంగాల విదేశీ సంస్థల ప్రతినిధులతో మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు వరస భేటీలు నిర్వహించడంతో ఆయా రంగాల్లో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు విదేశీ సంస్థలు సుముఖత వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. దీనిలో భాగంగా ఇప్పటికే కోకో కోలా సంస్థ రాష్ట్రంలో రూ.700 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు సంసిద్ధత వ్యక్తం చేయగా, ఏవియేషన్ రంగంలో డెల్టా ఎయిర్ లైన్స్ పెట్టుబడులు పెట్టేందుకు సుముఖత వ్యక్తం చేసినట్లు సమాచారం.



# రాష్ట్రంలో మూడురోజుల పాటు వర్షాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో పలు ప్రాంతాలకు నైరుతి రుతుపవనాలు విస్తరించాయి. నైరుతి రుతుపవనాల విస్తరణ నేపథ్యంలో రాగల మూడు రోజులు కూడా ఉరుములు మెరుపులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు చెప్పారు. ఈదురుగాలులు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో వీస్తాయన్నారు. సోమవారం ఉత్తర అరేబియా సముద్రం, మహారాష్ట్రలోని మరికొన్ని ప్రాంతాల్లో రుతుపవనాలు విస్తరించనున్నాయి. నైరుతి రుతుపవనాల ఉత్తర పరిమితి నాసిక్, నిజామాబాద్, సుకుమా, విజయనగరం, ఇస్లాంపూర్ వరకు ఉన్నాయని విస్తరించాయన్నారు. సోమవారం రాష్ట్రంలో అక్కడక్కడ వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. కింది స్థాయిలోని గాలులు పశ్చిమ, నైరుతి దిశ నుంచి తెలంగాణ రాష్ట్రం వైపునకు వీస్తున్నాయన్నారు. రాష్ట్రంలో రానున్న మూడు రోజులు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉందన్నారు. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో కూడిన ఈదురు గాలులతో వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. నల్లగొండ, సూర్యాపేట, రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. కొమరం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి, కామారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల్, మేడ్చల్, మల్కాజిగిరి, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయన్నారు. రాష్ట్రంలో కురిసే ప్రాంతాల వల్ల లోతట్టు ప్రాంతాలు వరద నీటితో మునిగే అవకాశం ఉందన్నారు. ఈ విషయాలను ప్రజలు దృష్టిలో పెట్టుకుని అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



## కీలక శాఖలన్నీ బిజెపికే

(మొదటి పేజీ తరువాయి)

మంత్రివర్గంలో చోటు సంపాదించిన వారిలో రామ్మోహన్‌నాయుడు కింజరాపుకు పౌర విమానయాన శాఖ దక్కింది. చంద్రశేఖర్ పెమ్మసాని గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ, రాష్ట్ర మంత్రి, కమ్యూనికేషన్ల మంత్రిత్వ శాఖలో సహాయ మంత్రిగా ఉంటారు. బిఎల్ వర్మకు వినియోగ వ్యవహారాలు, ఆహారం, పౌర సరఫరాలు, సామాజిక న్యాయం, సాధికారత శాఖలకు సహాయ మంత్రిగా వ్యవహరిస్తారు.

**రెండు తెలుగు రాష్ట్రాల అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తాం**

రెండు తెలుగు రాష్ట్రాల అభివృద్ధి కోసం ఉత్సాహంతో, అంకితభావంతో పనిచేస్తామని కేంద్రం మంత్రి జి.కిషన్‌రెడ్డి చెప్పారు. కేంద్ర మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసిన జి.కిషన్‌రెడ్డికి బొగ్గు, గనుల శాఖలను కేటాయించగా, బండి సంజయ్ కుమార్‌కు కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బాధ్యతలను అప్పగించారు.

ఈ సందర్భంగా సోమవారం ఢిల్లీలో మీడియాతో కిషన్‌రెడ్డి మాట్లాడుతూ వచ్చే దేళ్లలో ప్రధాని మోదీ నాయకత్వంలో సంకల్ప పత్రాన్ని అమలు చేసేందుకు, పార్టీ కోసం అహర్నిశలు పనిచేసిన సాధారణ కార్యకర్తలను గల్లీ నుంచి ఢిల్లీ వరకు తీసుకొచ్చి కేంద్ర మంత్రులుగా తీర్చిదిద్దిన ఘనత బిజెపిదేనన్నారు. తెలంగాణ ప్రజలు బిజెపిపై, ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై విశ్వాసంతో అపూర్వ మద్దతిచ్చి, 8 స్థానాల్లో గెలిపించారన్నారు.

## తెలుగుదేశంలోకి మాజీమంత్రి మల్లారెడ్డి?



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ తెలుగుదేశం పార్టీలో మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి చేరే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. తన ముఖ్య అనుచరులతో గత రెండు రోజులుగా మల్లారెడ్డి సమావేశాలు నిర్వహించినట్లు విశ్వాసనీయ సమాచారం. తిరిగి సొంతగూటికి చేరే ఆలోచనలో మల్లారెడ్డి ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడుతోనూ ఆయనకు మంచి సంబంధాలు ఉన్నాయి. చంద్రబాబుతో ఉన్న పరిచయాలతో ఆయన టిటిడిపిలోకి వెళ్లనున్నట్లు సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం జరుగుతోంది. శాసనసభ ఎన్నికల ముందు ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మల్లారెడ్డి మధ్య మాటల యుద్ధం చోటు చేసుకుంది. రేవంత్ రెడ్డిపై పౌరుషపదజాలంతో మల్లారెడ్డి విమర్శలు చేశారు. అందుకు దీటుగా రేవంత్ రెడ్డి సైతం తిప్పికొట్టారు. గత శాసనసభ ఎన్నికల్లో బిఆర్ఎస్ ఓటమిపాలైన విషయం తెల్సిందే. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మాజీమంత్రి మల్లారెడ్డి భూ అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. పెద్ద ఎత్తున పత్రికల్లో కథనాలు ప్రచురితమయ్యాయి. విచారణ జరిపిన వివిధ శాఖలకు చెందిన ప్రభుత్వ అధికారులు చెరువులు, కుంటలలోని అక్రమ కట్టడాలను కూల్చేశారు. దీంతో మల్లారెడ్డి కాంగ్రెస్ పార్టీలో తీవ్రంగా ప్రయత్నాలు జరిపారు. సిఎం రేవంత్ రెడ్డిని మచ్చిక చేసుకునేందుకు సైతం ప్రయత్నించారు. సిఎం సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి నివాసానికి వెళ్లి, తాను కాంగ్రెస్‌లో చేరుతానని, తనకు సంబంధించిన కట్టడాల కూల్చివేతలు ఆపాలని కోరారు. దీనికి వేం నరేందర్‌రెడ్డి ఈ విషయంలో తనను లాగొద్దని సున్నితంగా తిరస్కరించారు. కర్నాటక ఉప ముఖ్యమంత్రి డికె శివకుమార్‌ను మల్లారెడ్డి, ఆయన అల్లుడు ఎంఎల్ఎ మర్రి రాజశేఖర్‌రెడ్డిలు బెంగళూరు వెళ్లి కలిశారు. అయిన ప్రయోజనం లేకుండా పోయింది. కాంగ్రెస్‌లో చేరేందుకు ఆయనకు గ్రీన్‌సిగ్నల్ లభించలేదు. మల్లారెడ్డి భూములపై ప్రభుత్వం విచారణను మరింత ముమ్మరం చేసింది. ఈలోపు లోక్‌సభ ఎన్నికలు రావడంతో విచారణలో జాప్యం నెలకొంది. బిజెపిలో చేరుతారనే ప్రచారం జరిగింది. అయితే ఆంధ్రప్రదేశ్‌లో టిడిపి ఆఖండ విజయం సాధించడంతో మల్లారెడ్డిలో సరికొత్త ఆశలు చిగురించాయి. కేంద్రంలోని ఎన్‌డిఏ ప్రభుత్వంలో టిడిపి భాగస్వామ్యం కావడంతో టిడిపిలోకి వెళ్లితే తనకు రక్షణ లభిస్తుందనే యోచనలో మల్లారెడ్డి ఉన్నట్లు సమాచారం. దీనికితోడు ఎవ్వరి మాటవినని సిఎం రేవంత్‌రెడ్డి చంద్రబాబు చెప్పే మాటకు గౌరవం ఇస్తాడని, చంద్రబాబు ద్వారా భూ విచారణల నుండి రక్షణ పొందే అవకాశం ఉంటుందనే అంశంతో టిడిపిలోకి వెళ్లేయోచనలో ఉన్నట్లు సమాచారం.

**టిడిపి నుండి ఎంపిగా ప్రస్థానం..** 2014 సాధారణ ఎన్నికల్లో మల్కాజిగిరి లోక్‌సభ స్థానం నుంచి టిడిపి అభ్యర్థిగా మల్లా రెడ్డి విజయం సాధించారు. అనంతరం చోటుచేసుకున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో బిఆర్ఎస్‌లో చేరారు. 2018 ఎన్నికల్లో మేడ్చల్ నియోజకవర్గం నుంచి ఎంఎల్ఏగా పోటీ చేసి, మంత్రిగా పనిచేశారు. మల్లారెడ్డి విద్యా సంస్థల ఛైర్మన్‌గా ఆయన కొనసాగుతున్నారు. అలాగే బిఆర్ఎస్ ప్రభుత్వంలో మంత్రిగా కొనసాగిన మరో నేత సైతం టిడిపిలో చేరేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం.

## 3 కోట్ల ఇండ్లు

(మొదటి పేజీ తరువాయి)

కూరుస్తూ నిర్ణయం తీసుకున్నాం, అర్హులైన కుటుంబాల సంఖ్య పెరిగినందువల్ల వారి అవసరాలకు అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకున్నాం" అని ఒక అధికార ప్రకటనలో కేంద్ర ప్రభుత్వం తెలియజేసింది. కేంద్ర ప్రభుత్వం 2015–16 ఆర్థిక సంవత్సరం నుండీ పిఎంఎవైని అమలు చేస్తున్నది. అర్హులైన గ్రామీణ, పట్టణప్రాంత కుటుంబాలు ఇళ్ళు నిర్మించుకునేందుకు ఆర్థిక సహాయం అందజేస్తున్నది. మౌలిక సదుపాయాలకోసం ఈ సహాయం వినియోగిస్తారు. గడచిన పది సంవత్సరాలుగా ఇప్పటివరకూ పేదలకు 4.21 కోట్లు ఇళ్ళను నిర్మించే ప్రక్రియ పూర్తి చేశారు. పిఎంఎవై కింద నిర్మించిన ఇళ్ళకు మౌలిక సదపాయాలు సమకూర్చారు. టాయిలెట్లు, ఎల్‌పిజి కనెక్షన్లు, విద్యుత్ కనెక్షన్లు, నీటి సరఫరా కనెక్షన్లు సమకూర్చారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇతర పథకాలను కూడా కేంద్రీకరించి ఈ సదుపాయాలు సమకూరుస్తారు.

**'పిఎం కిసాన్ నిధి' పై మోదీ తొలి సంతకం**

మూడవసారి ప్రధానిగా నరేంద్ర మోదీ బాధ్యతలు చేపట్టిన తరువాత 'పిఎం కిసాన్ నిధి' నిధులను విడుదల చేసే ఫైల్‌పై తొలి సంతకం చేశారు. దీంతో ఈ పథకం కింద 9.3 కోట్ల మంది రైతులకు సుమారు రూ.20 వేల కోట్లు మేరకు లబ్ది చేకూరనుంది. ఫైలుపై సంతకం చేసిన తరువాత ప్రధాని మోదీ మాట్లాడుతూ తమ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి సంపూర్ణంగా కట్టుబడి ఉన్నదన్నారు. అందుకే వారికి నిధులు విడుదల చేసే ఫైలుపైనే మొదటి సంతకం చేసినట్లు తెలిపారు. భవిష్యత్తులో రైతులు, వ్యవసాయ సంక్షేమం కోసం తాము మరింత పని చేయనున్నట్లు వెల్లడించారు. ఎన్‌డిఏ అధికారంలోకి వచ్చినప్పటికీ గ్రామీణ భారతంలో ఎన్నికల్లో చేదు ఫలితాలు సాధించడంతో ప్రభుత్వం తాజాగా తీసుకున్న నిర్ణయం ప్రభావం చూపిందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# సింగిల్ టీచర్ స్కూళ్లను మూసివేయం

డిఎస్‌సి ద్వారా త్వరలో టీచర్ పోస్టులు భర్తీ చేస్తాం

ప్రతీ గ్రామం, ప్రతీ తండాకు విద్యను అందిస్తాం

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు రాణించడం ప్రభుత్వానికి గర్వకారణం

పదవ తరగతి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి



**ప్రజాపక్షం / హైదరాబాద్:** డిఎస్‌సి ద్వారా త్వరలో టీచర్ పోస్టులను భర్తీ చేస్తామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి చెప్పారు. సింగిల్ టీచర్ పాఠశాలలను మూసివేయద్దని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని సిఎం వెల్లడించారు. ప్రతీ గ్రామం, ప్రతీ తండాకు విద్యను అందించేలా ప్రభుత్వం ముందుకెళుతుందని స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో సెమీ రెసిడెన్షియల్ విధానాన్ని అమలు చేసే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోందని, రెసిడెన్షియల్ స్కూల్ ద్వారా తల్లిదండ్రులకు పిల్లలకు మధ్య సంబంధాలు బలహీనపడుతున్నాయని ఒక అధ్యయన నివేదిక వచ్చిందని సిఎం వెల్లడించారు. త్వరలో విద్య, వ్యవసాయ కమిషన్‌లను ఏర్పాటు చేసి నిరంతరం సమస్యలను పరిష్కరించే వెసులుబాటు కల్పించనున్నట్లు సిఎం ప్రకటించారు. శిథిలావస్థకు చేరిన అన్ని ప్రభుత్వ పాఠశాలల భవనాలను పునర్నిర్మించేందుకు రూ.2 వేల కోట్లతో పనులు ప్రారంభించారని తెలిపారు.

హైదరాబాదులోని రవీంద్రభారతిలో సోమవారం వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పదో తరగతి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలతో పోటీపడి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు రాణించడం ప్రభుత్వానికి గర్వకారణమన్నారు. తనతో సహా ప్రముఖ రాజకీయ నాయకులు, ఇప్పుడు సర్వీసుల్లో ఉన్న ఐఎఎస్, ఐపిఎస్‌లలో 90 శాతం మంది ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాలల్లో చదివినవారేనని సిఎం అన్నారు. చాలా రాష్ట్రాల ముఖ్యమంత్రులు, మంత్రులు, కేంద్రమంత్రులు కూడా పాఠశాలల్లోనే చదివారన్నారు. ఒక్కో విద్యార్థి మీద ప్రభుత్వం రూ.80వేలు ఖర్చు చేస్తోందని, గత కొంతకాలంగా ప్రభుత్వ పాఠశాలలు నిర్వీర్యమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గత కొంతకాలంగా ప్రభుత్వ పాఠశాలలు నిర్వీర్యమవుతున్నాయని సిఎం ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు రావడం లేదని సింగిల్ టీచర్ పాఠశాలలను మూసివేసే పరిస్థితి గత ప్రభుత్వంలో ఉండేదని, మౌలిక వసతులపై దృష్టి కేంద్రీకరించకపోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని సిఎం అన్నారు. విద్యార్థులను బడిలో చేర్పించేందుకు 'ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట' కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తోందని, ప్రభుత్వ పాఠశాలల నిర్వహణను మహిళా సంఘాలకు అప్పగించామని, గ్రీన్ ఛానెల్ ద్వారా నిధులు విడుదల చేయాలని అధికారులను ఆదేశించామని సిఎం చెప్పారు. గ్రామాల్లో ఉండే పాఠశాలలపై నిర్లక్ష్యం వహించొద్దని, విద్య మీద ప్రభుత్వం పెట్టేది ఖర్చు కాదని, అది పెట్టుబడి అని, విద్యపై పెట్టె పెట్టుబడి మన సమాజానికి లాభాన్ని చేకూరుస్తుందని సిఎం చెప్పారు. తమ ప్రభుత్వానికి భేష జాలు లేవని, ఎవరైనా సలహాలు ఇస్తే స్వీకరించ దానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. పరీక్షల్లో 10/10 గ్రేడ్ వచ్చిన విద్యార్థుల అడ్మిషన్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు ఆదేశిస్తున్నామని, ఇంటర్మీడియట్ లోనూ స్టేట్ ర్యాంకులు సాధించి భవిష్యత్‌లో రాణించాలని ఆకాంక్షిస్తున్నామన్నారు. విద్యార్థులకు ప్రజా ప్రభుత్వం ఉందని, ప్రజాపాలనపై నమ్మకం కలిగించేలా ముందుకెళతామన్నారు. వందేమాతరం ఫౌండేషన్ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను ప్రోత్సహించడాన్ని సిఎం అభినందిస్తూ విద్యార్థులకు పురస్కారాలను అందజేశారు. ఇలాంటి కార్యక్రమాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తే బాగుండేదని, వందేమాతరం ఫౌండేషన్ ఇలాంటి మంచి కార్యక్రమం ద్వారా ప్రభుత్వ బాధ్యతను గుర్తు చేసిందని, విద్యార్థులకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు.



## నకిలీ మందులపై ఉక్కుపాదం

మంత్రి దామోదర్ రాజనర్సింహ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నకిలీ మందుల తయారీదారులపై ఉక్కు పాదం తో అణిచివేయడానికి చర్యలు చేపట్టిందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పేర్కొన్నారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా మెరిట్ ఆధారంగా ఎంపికైనా (జోన్ I నుండి ఐదు గురు) జోన్ II నుండి 12 మంది) మొత్తం 17 మంది డ్రగ్స్ ఇన్స్పెక్టర్లకు శాఖల మంత్రి దామోదర్ రాజనర్సింహ నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ. నూతనంగా ఎంపికైన 17 మంది డ్రగ్స్ ఇన్స్పెక్టర్లు శాఖ బలోపేతానికి కృషి చేయాలని ఆదేశించారు. నకిలీ మందుల నివారణకై నిరంతర పర్యవేక్షణ కోసం నూతనంగా డ్రగ్ ఇన్స్పెక్టర్ నియామకాన్ని చేపట్టిందన్నారు. ఎంతో బాధ్యతగా సమాజ హితం కోసం ఉద్యోగ విధులను నిర్వహించాలని నియామక పత్రాలను అందుకున్న అభ్యర్థులకు మంత్రి దామోదర్ రాజనర్సింహ దిశ నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్, డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్, డైరెక్టర్ జనరల్ (ఇంచార్జ్) ఆర్.వి. కర్ణన్, జాయింట్ డైరెక్టర్ రామ్ దాన్ పాల్గొన్నారు.

## మూడు కొత్త టిమ్స్ ఆస్పత్రులపై కెటిఆర్ ట్వీట్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్‌లోని టిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిఉలపై బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.రామారావు సోమవారం ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. సనత్ నగర్, అల్వాల్, ఎల్.బి.నగర్‌లోని ప్రతిపాదిత మూడు కొత్త టిమ్స్ ఆస్పత్రులు అద్భుతంగా రూపుదిద్దుకుంటున్నాయన్నారు. ఇందుకు చాలా సంతోషంగా ఉందని కెటిఆర్ పేర్కొన్నారు. తెలంగాణ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ఆస్పత్రులు హైదరాబాద్ ఆరోగ్య సంరక్షణ వ్యవస్థను పునర్ నిర్మిస్తుందన్నారు. పట్టణ పేదలకు వికేంద్రీకృత వైద్యాన్ని ఈ ఆస్పత్రులు అందిస్తాయన్నారు. ఈ మూడు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులను రూ. 2,679 కోట్ల వ్యయంతో నిర్మాణం జరుగుతుందన్నారు. ఇందుకు సంబంధించిన ఫొటోలను ఆయన షేర్ చేశారు.

## మంత్రి ఓఎస్‌డి, పశుసంవర్ధక శాఖ సిఇఒలకు ఎసిబి కస్టడీ



**ప్రజాపక్షం/హైదరాబాద్:** గొర్రెల పంపిణి కుంభ కోణంలో వారం రోజుల అరెస్టు అయిన పశుసంవర్ధక శాఖ మాజీ సిఇఒ రామచందర్‌నాయక్, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఓఎస్‌డి కల్యాణ్ కుమార్ ఎసిబి అధికారులు సోమవారం తమ కస్టడీలోకి తీసుకున్నారు.పశుసంవర్ధక మాజీ సిఇఒ రామచందర్ నాయక్, మాజీ ఓఎస్డీ కల్యాణ్ కుమార్ను ఏసీబీ అధికారులు విచారించనున్నారు. ఈక్రమంలో అధికారులు వారిని బంజారాహిల్స్‌లోని ఎసిబి ప్రధాన కార్యాలయానికి తరలించి విచారిస్తున్నారు. వీరిద్దరూ ఇచ్చే సమాచారం ఆధారంగా మరికొందరిని అరెస్టు చేసే అవకాశం ఉంది. బిఆర్ ఎస్ నేతల ప్రమేయం కూడా ఈ కుంభకోణం కేసులో తేలనుంది. ఈ కేసులో ఇప్పటికే రూ.700కోట్ల విలువైన అక్రమాలకు సంబంధించి ఆధారాలు గుర్తించినట్లు సమాచారం. బినామీ పేర్లతో బిల్లులను విత్డ్రా చేసినట్లు ఆరోపణలున్నాయి. ఈ కేసులో ఇప్పటికే సుమారు 10 మంది నిందితులను గుర్తించిన విషయం తెలిసిందే.

## మొదలైన కెసిఆర్ కొత్త సర్కాస్ ఫీట్లు

అల్లుడు హరీశ్ రావును బిజెపిలోకి పంపించనున్న కెసిఆర్ : ఎంఎల్‌ఎ రామ్మోహన్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిఆర్‌ఎస్ అధ్యక్షుడు కెసిఆర్ కొత్త సర్కాస్ ఫీట్లు మొదలయ్యాయని టిపిసిసి మీడియా, కమ్యూనికేషన్స్ చైర్మన్ సామ రామ్మోహన్ రెడ్డి విమర్శించారు. గాంధీ భవన్‌లో ఆయన సోమవారం మీడియాతో మాట్లాడుతూ కెసిఆర్ అల్లుడు హరీశ్ రావును బిజెపిలోకి పంపించి, పార్టీని కాపాడుకునే కొత్త కుట్రలకు కెసిఆర్ తెర లేపుతున్నారని ఆరోపించారు. నువ్వు కొట్టినట్టు చెయ్యి, నేను తిట్టినట్టు చేస్తా అనే మీ పాత ఎత్తుగడలు అర్థం కాక బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎలు ఆగం అవుతున్నారని ఎద్దేవా చేశారు. బిడ్డ కోసం, పార్టీ కోసం, ఆస్తుల కోసం అల్లుడు హరీశ్ రావు బుజంపై తుపాకీ పెట్టి కాల్చే కుట్రలను తెలంగాణ గమనిస్తోందని కెసిఆర్‌ను రామ్మోహన్ రెడ్డి హెచ్చరించారు.

## కుల గణనసర్వే కసరత్తుకు నిపుణులతో బిసి కమిషన్ భేటీ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో త్వరలో చేపట్టనున్న సామాజిక, ఆర్థిక కుల సర్వే' (కుల గణన) కు సంబంధించి, తమ ప్రతిపాదనలను ప్రభుత్వానికి నివేదించాల్సిందిగా పీపుల్స్ కమిటీ ఆన్ క్యాస్ట్ సెన్సస్ విషయ నిపుణులు, మేధావుల ప్రతినిధుల బృందం బిసి కమిషన్‌కు విజ్ఞప్తి చేశారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్య, ఉద్యోగ రంగాలలో నిర్దిష్టంగా 'కుల సర్వే' మొదలు పెట్టడానికి గానూ, పూర్తి స్థాయి 'కార్యాచరణ ప్రణాళిక' రూపొందించి ఇవ్వాలని ప్రభుత్వం, బిసి కమిషన్ ను కోరింది. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లోని రాష్ట్ర బిసి కమిషన్ కార్యాలయంలో సోమవారం రాష్ట్ర బిసి కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణ మోహన్ రావు, సభ్యులు సి. హెచ్ .ఉపేంద్ర, శుభ ప్రద్ పటేల్, కే. కిశోర్ గౌడ్, సభ్య కార్యదర్శి బి. బాల మాయ దేవి (ఐ.ఏ.ఎస్) లతో, పీపుల్స్ కమిటీ. ప్రతినిధులు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సమావేశంలో పాల్గొన్న జస్టిస్ చంద్ర కుమార్, ప్రొఫెసర్ మురళి మనోహర్, ప్రొఫెసర్ పి.ఎల్. విశ్వేశ్వర్ రావు, ప్రొఫెసర్ ఐ.తిరుమలి, ప్రొఫెసర్ సింహాద్రి, ప్రొఫెసర్ పద్మజాషా, ప్రొఫెసర్ నరేంద్ర బాబు, డాక్టర్ ఎస్ పృథ్వీ రాజ్, దేవల్ల సమ్మయ్య, సతీష్ కొట్టే తదితరులతో కూడిన ప్రతినిధి బృందం తమ అభిప్రాయాలను, సలహాలతో పాటు లిఖిత పూర్వకంగా పలు అధ్యయన పత్రాలను బిసి కమిషన్‌కు అందజేశారు.ఈ సందర్భం గా తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, బీహార్ రాష్ట్రాల లో నిర్వహించిన 'కుల సర్వే' లపై లోతుగా చర్చించారు. ఆయా రాష్ట్రాలలో సర్వే లు చేస్తున్నపుడు ఉత్పన్నమైన న్యాయపరమైన సమస్యలు, ప్రజల స్పందన, సాంకేతికంగా వివిధ అంశాలు, సాఫ్ట్ వేర్ ను రూపొందించడం, ఇలా ఒక్కొక్కటిగా కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణంకు ప్రతినిధుల బృందం వివరించింది. వీటిని ప్రభుత్వానికి అందజేసి అమలు చేసేలా చూడాలని బిసి కమిషన్ చైర్మన్ వారు కోరారు.



## లిఫ్ట్ ఇరిగేషన్‌లను 'స్థాయి సామర్థ్యంతో పనిచేయించడమే లక్ష్యం'

లిఫ్టుల నిర్వహణలో రైతులపై భారం తగ్గిస్తాం

ఔట్ సోర్సింగ్ పద్ధతిలో లిఫ్టుల పనితీరు మెరుగుపరిచేందుకు సిబ్బందిని నియమిస్తాం

రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



**ప్రజాపక్షం/కోదాడ :** సాగర్ ఎడమకాల్వపై ఉన్న లిఫ్ట్ ఇరిగేషన్‌లను స్థాయి సామర్థ్యంతో పనిచేయించడమే లక్ష్యమని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాలశాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు.సోమవారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో సాగర్ లిఫ్ట్ ఇరిగేషన్ పనితీరుపై జిల్లా కలెక్టర్ అధికారులతో రైతుల సమక్షంలో ఏర్పాటు చేసిన విస్తృత స్థాయి సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు.సాగర్ ఎడమ కాల్వపై హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని 35 లిఫ్టులు, కోదాడ నియోజకవర్గంలో 19 లిఫ్టులు ఉన్నాయన్నారు. వీటిలో పూర్తిస్థాయిలో పనిచేసే,పాక్షికంగా పని చేసే, పూర్తిగా పనిచేయని లిఫ్టుల వివరాలను నీటిపారుదలశాఖ అధికారులతో ఎల్ఈడి స్క్రీన్‌పై గణాంకాలను అడిగి తెలుసుకున్నారు. సగానికి పైగా లిఫ్టులు సామర్థ్యానికి మంచి పని చేయకపోవడంపై అధికారులను కారణాలు చెప్పాలని సమావేశంలో ఆదేశించారు. లిఫ్ట్ ఇరిగేషన్ల నిర్వహణలో రైతులపై భారం తగ్గించేందుకు లిఫ్టులపై సాంకేతిక సిబ్బంది, ఎలక్ట్రీషన్ ఆపరేటర్, వాచ్‌మెన్, ఫిట్టర్ పోస్టులను ఔట్ సోర్సింగ్ పద్ధతిలో నియమిస్తామన్నారు.వీరికి ప్రభుత్వమే వేతనాలు ఇస్తుందని చెప్పారు. గతంలో సాగర్ ఎడమకాల్వ డిజైన్‌లో భాగంగా ఎడమ కాలువపై లిఫ్టులు లేవని తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు నాటి కలెక్టర్ మనోహర్ ప్రసాద్‌తో కలసి కృష్ణానది ఒడ్డున ఉన్న గ్రామాలకు ఆర్టీసీ బస్సులో పర్యటించి దొండపాడు హైస్కూల్లో రాత్రి బసచేసి లిఫ్టుల నిర్మాణానికి ఎంతో శ్రమించామన్నారు.

మొత్తం 34లక్షల 460 ఎకరాలలో సాగు నీరు అందాల్సి ఉండగా 25 లక్షల లోపు భూమికే నీరు అందుతుందని ఈ విషయంపై సమీక్షలో పరిష్కారం దొరకాలన్నారు. జూలై మొదటి తేది నాటికి లిఫ్టులన్ని పూర్తిస్థాయిలో పనిచేయాలన్నారు. రేపల్లె, అడ్లూరు, పానుగోడు, వెలిదండ, రాయినిగూడెం,మర్రిగూడెం, రెడ్లకుంట లిఫ్ట్ ఇరిగేషన్లపై ఉన్న సమస్యలను రైతులను అడిగి తెలుసుకున్నారు.కొత్త లిఫ్ట్ ఇరిగేషన్లకు నీటి వనరులను బట్టి రైతులకు సహకరిస్తే తప్పకుండా ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామన్నారు. చెరువులు ఆక్రమిస్తున్నట్లు వార్తలు అందుతున్నాయని ఎవరైనా చెరువులు ఆక్రమిస్తే కేసులు నమోదు చేయాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. తిరిగి మళ్లీ సమీక్ష సమావేశం నిర్వహిస్తామన్నారు. జిల్లా కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ మాట్లాడుతూ తన 37 ఏళ్ల సర్వీస్‌లో అన్ని శాఖలతో ఇంత చక్కటి సమావేశం నిర్వహించడం అభినందనీయమన్నారు. సమావేశంలో ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి, చీఫ్ ఇంజనీర్ నాగేశ్వరరావు, హుజూర్‌నగర్ ఎస్‌ఈ నర్సింహారావు,ఇఇలు సత్యనారాయణ, శ్రీనివాసరావు, ఆర్డీవోలు, మాజీ ఎమ్మెల్యే చందర్‌రావు, ప్రజా ప్రతినిధులు, రెవిన్యూ, నీటిపారుదల,ఐసిడిఎస్ అధికారులు పాల్గొన్నారు.

## కౌలు రైతులకు రైతు భరోసా అమలు చేయాలి


సిపిఐ (ఎం) డిమాండ్




**ప్రజాపక్షం/హైదరాబాద్:** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన హామీ ప్రకారం కౌలు రైతులకు ఈ వానాకాలం నుండే రైతు భరోసా అమలు చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) డిమాండ్ చేసింది. సోమవారం సిపిఐ (ఎం) రాష్ట్ర కార్యాలయంలో జరిగిన కార్యవర్గ సమావేశంలో ఈ మేరకు ప్రభుత్వానికి పలు సూచనలు చేశారు. రాష్ట్రంలో 20లక్షల మందికి పైగా కౌలు రైతులు 30 శాతానికి పైగా వ్యవసాయం చేస్తున్నారని, రైతుల ఆత్మహత్యల్లో సగం మంది కౌలు రైతులేని గుర్తు చేశారు. గత రెండు సంవత్సరాలుగా రాష్ట్రంలో పంటల బీమా సౌకర్యం లేదని, ప్రీమియం మొత్తం ప్రభుత్వమే చెల్లించే విధంగా పంటల బీమా అమలు చేయాలని సమావేశం అభిప్రాయపడింది. ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం రు.2లక్షల వరకు రుణాన్ని ఏకకాలంలో మాఫీ చేయాలని, రుణమాఫీ వెంటనే అమలుచేయగలిగితే వానాకాలం సాగు పెట్టుబడికి రైతులకు ఉపయోగం జరుగుతుందన్నారు. లేనిఎడల రైతులు ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల దగ్గర అధిక వడ్డీలకు అప్పులు తెచ్చుకోవాల్సి వస్తుందని కార్యవర్గం ఆందోళన వ్యక్తం చేసింది. రాష్ట్రంలో విద్యార్థుల ఫీజు రీయంబర్స్మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని, గత బకాయిలు విడుదల చేయకపోవడంతో విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఉద్యోగుల సప్లిమెంటరీ బిల్లులు, గ్రాట్యుటీ, ప్రభుత్వ జీవిత బీమా, జిపిఎఫ్, సరెండర్ లీవ్స్, కమ్యూషన్ వంటి బిల్లులు దీర్ఘకాలంగా పెండిరగ్లో ఉన్నాయని ఈ విషయంపై కూడా ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు. గ్రామపంచాయితీ కార్మికులకు 6 నుండి 9నెలల వేతనం, మున్సిపల్ కార్మికులకు 3 నెలలు, ప్రభుత్వ హాస్పిటల్స్లో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు 5 నెలల బకాయిలు, వైద్య రంగంలో 104 ఉద్యోగులకు 8 నెలల బకాయిలు ఉన్నాయని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గం ప్రభుత్వాన్ని సూచించింది. సిపిఐ (ఎం) జ్యోతి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పోలిట్బ్యూరో సభ్యులు ఎ విజయరాఘవన్, బివి రాఘవులు పాల్గొన్నారు.

## హెచ్‌యుజె కృషితో జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీ

హైదరాబాద్ జిల్లా విద్యా శాఖాధికారి ఉత్తర్వులు జారీ



**ప్రజాపక్షం / హైదరాబాద్ :** హైదరాబాద్ జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల్లో 202425 విద్యా సంవత్సరానికి గాను, జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీ ఇస్తూ హైదరాబాద్ జిల్లా విద్యా శాఖాధికారి ఉత్తర్వులు జారీ చేశారు. ఆర్థిక ఇబ్బందుల మధ్య జీవనం కొనసాగిస్తున్న జర్నలిస్టులకు, ప్రైవేట్ పాఠశాలల్లో పిల్లల చదువు మోయలేని భారంగా మారిందని, ఇందుకు గాను అన్ని ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల్లో రాయితీ ఇచ్చే విధంగా ఆదేశాలు జారీచేయాలని హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (హెచ్‌యుజె తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం జిల్లా విభాగం) జిల్లా అధ్యక్షులు శిగ శంకర్ గౌడ్, కార్యదర్శి ఖాజా అబ్దుల్ హమీద్, టియుడబ్ల్యుజె రాష్ట్ర నాయకులు ఏ. రాజేష్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం చేసిన వినతికి హైదరాబాద్ జిల్లా విద్యా శాఖాధికారులు స్పందించారు. ఫీజుల్లో రాయితీ కల్పించాలని ప్రైవేట్ పాఠశాలలకు ఆదేశాలు జారీ చేస్తూ హైదరాబాద్ జిల్లా విద్యాశాఖ అధికారి సర్క్యులర్ జారీ చేశారు. దీనికి సంబంధించిన సర్క్యులర్ పత్రాన్ని హైదరాబాద్ జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్.రోహిణి సోమవారం హెచ్‌యుజే అధ్యక్షుడు శిగ శంకర్ గౌడ్ , కార్యదర్శి ఖాజా అబ్దుల్ హమీద్, ఏ.రాజేష్‌లకు అందచేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు శిగ శంకర్, కార్యదర్శి ఖాజా అబ్దుల్ హమీద్ లు మాట్లాడుతూ హైదరాబాద్ జిల్లాలోని అర్హులైన పాత్రికేయులు జిల్లా విద్యా శాఖాధికారులు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. తమ వినతిని మన్నించి సర్క్యులర్ జారీచేసిన విద్యా శాఖాధికారులకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

## వానాకాలంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి : మంత్రి సీతక్క

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వర్ష కాలం ప్రారంభం కావడంతో అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని పంచాయితీ రాజ్ గ్రామీణాభివృద్ధి మరియు మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క అదేశించారు. వర్షకాలం నేపథ్యంలో వర్షాలు, వరదల పరిస్థితిపై మంత్రి సీతక్క అధికారులతో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సచివాలయంలో ముందస్తు జాగ్రత్తలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వర్షాలు, వరదల సంభవిస్తే తీసుకోవాల్సిన రక్షణ చర్యలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. మిషన్ బగీరథ పథకంలో భాగంగా నాలాల కొత్త, పాత కనెక్షన్ పై సమిక్షించారు. వర్షాల కారణంగా ఏలాంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండ ముందస్తుగానే పాత గృహాలను గుర్తించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశాలిచ్చారు. కుంటలు, చెరువులు, డ్యాంలు, రిజర్వాయర్లకు వస్తున్న వరదపై ఎప్పటికప్పుడు వివరాలు తెలుసుకొని, చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. వర్షాల వల్ల పారిశుద్ధ్య లోపం, కలుషిత నీరు వలన అంటు వ్యాధులు ప్రబలే అవకాశము ఉన్నందున అవసరమైన చోట తక్షణ చర్యలను తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. హోటళ్ళు, మార్కెట్లు, దుకాణాలలో నిల్వ యుంచే వస్తువులపై నిఘా ఉండాలని అన్నారు. వ్యాధులు ప్రబలే అవకాశం ఉంటే వాటిని తాత్కాలికంగా మూసివేయాలని, కోళ్ళ ఫారముల యాజమాన్యంతో పారిశుద్ధ్యపై వారిని అప్రమత్తం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్ ప్రధాన కార్యదర్శి, సందీప్ కుమార్ సుల్తానియా, పంచాయతీ రాజ్ కమిషనర్, అనితా రామచంద్రన్, స్పెషల్ కమీషనర్, షఫ్పీయుద్దిన్, ఇంజనీర్ఇన్ చీఫ్ కృపాకర్ రెడ్డి, వివిధ శాఖల ఉన్నతాధికారులు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## 'నీట్'ను మరోసారి నిర్వహించాలి

- టిపిసిసి మీడియా కమిటీ చైర్మన్ చనగాని దయాకర్


ప్రజాపక్షం/హైదరాబాద్ : నీట్ పరీక్షను రద్దు చేసి, మళ్లి నిర్వహించాలని టిపిసిసి అధికార ప్రతినిధి చనగాని దయాకర్ అన్నారు. గాంధీ భవన్‌లో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ నీట్ ప్రశ్న పత్రం లీకేజీలో బిజెపి నేతల హస్తం ఉందని ఆరోపించారు. 557 నగరాల్లో పరీక్ష నిర్వహించారన్నారు. చింటింగ్ స్కామ్ జరిగిన నుండి బిజెపి నేతలు ఎందుకు విచారణ జరపాలని కోరడం లేదని ప్రశ్నించారు. గుజరాత్‌కు చెందిన పర్శరామ్ రాయ్, తుషార్‌లు కలసి ఇద్దరు 16 మంది దగ్గర రూ.10 లక్షలు తీసుకుని, పరీక్ష రాయించారని ఆరోపించారు. ఎన్‌టిఎ డైరెక్టర్ జనరల్ శుభోద్ కుమార్‌ను తక్షణం తొలగించాలని కేంద్ర ప్రభుత్వాన్ని దయాకర్ డిమాండ్ చేశారు. ఛత్తీస్‌గఢ్, ఢిల్లీ, హర్యానా, మహారాష్ట్ర లాంటి రాష్ట్రాల్లో గ్రేస్ మార్కులు ఇచ్చారని, దీనితో తెలుగు రాష్టాల విద్యార్థులకు తీరని అన్యాయం జరిగిందన్నారు. నీట్ పరీక్ష నిర్వహించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తి విఫలమైందని విమర్శించారు. ఆసిఫాబాద్ ఖగాజ్‌నగర్‌లో విద్యార్థులకు సెట్‌ను మార్చి ఇచ్చారన్నారు. కేంద్ర ప్రభుత్వం నీట్‌పై జరిగిన అవకతలకపై పూర్తి స్థాయి విచారణ చేపట్టాలన్నారు. ఒకే కేంద్రంలో 8 మంది విద్యార్థులకు గరిష్ట మార్కులు 720, 719, 718 రావడం అనుమానాలకు తావిస్తుందన్నారు. పక్క ప్రణాళిక ప్రకారంతోనే దరఖాస్తు చేసేటప్పుడు పైసలు తీసుకొని, ఒకే తరగతి గదిలో వచ్చేలా సెట్ చేశారని అన్నారు. ఎన్‌టిఎ నీట్ అప్లికేషన్ పలు మార్లు పొడగించడం అనేక అనుమానాలకు తావిస్తుందన్నారు. అనేక లోపాలతో నీట్ పరీక్షను నిర్వహించారన్నారు. దేశ వ్యాప్తంగా706 మెడికల్ కాలేజీల్లో 386 ప్రభుత్వ, ప్రైవేట్, 320 ప్రైవేట్ కాలేజీలు, 74 మంది బిజెపి నేతలకు మెడికల్ కాలేజీలు ఉన్నాయన్నారు. నీట్ విద్యార్థులకు న్యాయం జరిగే వరకూ కాంగ్రెస్ పోరాడుతుందన్నారు.

## బిఆర్‌ఎస్,బిజెపి కుమ్మక్కువల్లే కాంగ్రెస్‌కు సీట్లు తగ్గాయి

- టిపిసిసి ఇంటలెక్చువల్ సెల్ చైర్మన్ శ్యామ్ మోహన్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో బిఆర్‌ఎస్, బిజెపి పార్టీలు కుమ్మక్కుకావడం వల్లనే కాంగ్రెస్‌కు సీట్లు తగ్గాయని టిపిసిసి ఇంటలెక్చువల్ సెల్ చైర్మన్ ఆనంతుల శ్యామ్ మోహన్ పేర్కొన్నారు. గాంధీభవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో బిఆర్‌ఎస్, బిజెపి లు కలిసి కాంగ్రెస్ ను ఓడించాలని కుట్రకు పాల్పడ్డారన్నారు. అందుకే కాంగ్రెస్‌కు సీట్లు తగ్గాయి, లేదంటే కొన్ని సీట్లు పెరిగేవి అని తెలిపారు. ఇండియా కూటమికి 100సీట్లు కూడా రావు అని సర్వేలు చెప్పాయి, కానీ ప్రజలు 230 సీట్లలో గెలిపించారని అన్నారు. అందులో కాంగ్రెస్ కు 100 సీట్లు వచ్చాయన్నారు.

తెలంగాణ ప్రభుత్వం
మహిళా, శిశు, వికలాంగుల మరియు వయో వృద్ధుల సంక్షేమ శాఖ, సంగారెడ్డి జిల్లా.
ప్రకటన



Baby Abigail
Age: 1 Month 5 Yays
Gender: Female

ఇచ్చుట ప్రచురించబడిన ఫొటోలోని పాప జిల్లా సంక్షేమ అధికారిణి మహిళా, శిశు, వికలాంగుల మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ, సంగారెడ్డి జిల్లా అధ్వర్యంలో శిశుగృహ సంగారెడ్డి వారి సంరక్షణలో ఉంచబడినది.
పై పాపకు జన్మనిచ్చిన తల్లిదండ్రులు ప్రచురణ తేది నుండి 30 రోజుల లోగా తగిన సాక్షాధారాలతో సహా దిగువ సంతకందారుని సంప్రదించవచ్చును. లేని పక్షంలో ఈ పాపని అనాథగా ప్రకటించబడును మరియు ప్రభుత్వముచే నిర్దేశించిన నియమ నిబంధనల ప్రకారం దత్తతకు ఇవ్వబడును. దత్తత పట్ల ఆసక్తి గల వారు WWW.CARA.NIC.IN నందు రిజిష్టర్ చేసుకోవచ్చు.

సం/- జిల్లా సంక్షేమ అధికారిణి
మహిళా, శిశు, వికలాంగుల మరియు వయో వృద్ధుల సంక్షేమ శాఖ
సంగారెడ్డి జిల్లా
DIPR R.O. No. : 22-DP/CL/ADVT/1/2024-25 Date: 10-06-2024

దేవాదాయ ధర్మాదాయ శాఖ
శ్రీ కల్లప్ప సత్రం, టొబాకో బజారు, జనరల్ బజారు, సికింద్రాబాదు.
హైదరాబాదు జిల్లా, తెలంగాణా రాష్ట్రం.

లేఖ నెం. 09/SKC/2024 తేది : 10.06.2024

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియజేయుంది ఏమనగా శ్రీ కల్లప్ప సత్రం, టొబాకో బజారు, జనరల్ బజారు, సికింద్రాబాదు, హైదరాబాదు జిల్లా యొక్క కమర్షియల్ షాపులు అద్దెకు ఇచ్చుటకు బహిరంగ వేలము తేది: 21.06.2024, శుక్రవారము నాడు ఉ.11.00 గంటలకు శ్రీ కల్లప్ప సత్రం కార్యాలయము నందు బహిరంగ వేలము నిర్వహించుటకు నిర్ణహించడమైనది. అసక్తి గలవారు వేలము పాట షరతులకు లోబడి బహిరంగ వేలము నందు పాల్గొనవచును. **సంఖ్య:** 1. **షాపుల వివరములు:** Shop No. 3-4-149/B - (50ft X 40ft) in Second Floor, **కాల పరిమితి:** (3) Years, 1.7.2024 to 30.06.2027. **డిపాజిట్:** రూ.10000-00; **సంఖ్య:** 2. **షాపుల వివరములు:** Shop No. 3-4-149/B/8/4 -(10X15) in Second Floor, **కాల పరిమితి:** (3) Years, 1.7.2024 to 30.06.2027, **డిపాజిట్:** రూ.10000-00. ఇతర వివరలకు శ్రీ కల్లప్ప సత్రం కార్యాలయము నందు సంప్రదించగలరు . సెల్ నెంబరు 9010901099

DIPR R.O. No. : 332-PP/CL/ADVT/1/2024-25 Date: 10-06-2024 సం/- కార్యనిర్వాహణాధికారి

ప్రజాపక్షం
మంగళవారం, జూన్ 11

# మూడోసారి మోదీ సర్కార్

నరేంద్ర దామోదర్‌దాస్ మోదీ ప్రధానమంత్రిగా ఆయన మూడో మంత్రివర్గం ఆదివారం సాయంత్రం పదవీబాధ్యతలు స్వీకరించింది. రాష్ట్రపతి భవన్ ప్రాంగణంలో ఆరుబయట ఆహ్లాదకరమైన వాతావరణంలో, ప్రత్యేక ఆహ్వానితులైన ఏడుగురు ఇరుగు పొరుగు దేశాల అధినేతలు, దాదాపు 8 వేల మంది ఆహ్వానితులైన ప్రముఖుల సమక్షంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, మోదీ సహా 72 మంది మంత్రులచేత పదవీ స్వీకార ప్రమాణం చేయించారు. అయితే ఇది బిజెపి కాంక్షించిన సొంత ఏకపక్ష ఆధిపత్య ప్రభుత్వంకాదు. ఎ.బి.వాజ్‌పేయి ప్రధానమంత్రిత్వం కాలంలో ఏర్పడిన నేషనల్ డెమొక్రటిక్ అలయెన్స్ (ఎన్‌డిఎ) చతుర్ధ అంకం ఈ మోదీ మూడవ ప్రభుత్వం. తెలుగుదేశం పార్టీ, జనతాదళ్(యు) రెండు, మూడు స్థానాల్లో ఉండగా జెడి(ఎస్) (కర్నాటక), హెచ్.ఎ.ఎం (బిహార్), లోక్‌జనశక్తి (బిహార్), ఆర్‌ఎల్‌డి(యుపి), శివసేన షిండే(మహారాష్ట్ర), అప్నాదళ్ (యు.పి), ఆర్‌పిఐ (మహారాష్ట్ర), ఇంకా మంత్రివర్గంలో స్థానం దక్కని ఎన్‌సిపి(అజిత్), ఆల్ జార్ఖండ్ స్టూడెంట్స్ యూనియన్ ఈ సంకీర్ణంలో భాగస్వాములుగా ఉన్నారు. 30 పైబడిన పార్టీల్లో వీటిని మాత్రమే ఓటర్లు పార్లమెంటుకు పంపారు. వీరితో ఎన్‌డిఎ సంఖ్యాబలం మ్యాజిక్ సంఖ్య 272 దాటి 293కు చేరింది. 28 సీట్లతో టిడిపి, జెడి(యు) కీలక భాగస్వాములు. ఎన్‌డిఎలో ప్రవేశం –నిష్క్రమణల్లో వీరు సిద్ధహస్తులు. కాంగ్రెస్ 100 సీట్లుసహా 243 సీట్లతో ఐక్య ప్రతిపక్షం ('ఇండియా') ఎవరూ విస్మరించలేనంత మహాబలశాలిగా ఉంది. కాబట్టి మోదీ ప్రయాణం గతంలోలాగా నల్లేరుపై నడకకాదు. ఒంటెత్తు పెత్తందారీ ధోరణి, ఏకపక్షంగా బిజెపి–ఆర్‌ఎస్‌ఎస్ సొంత ఎజండా అమలు చేయటం సాధ్యం కాదు. ఈ కొత్త పరిస్థితికి నరేంద్రమోదీ, అమిత్ షా తదితరులు సర్దుబాటుకావటంపైన నూతన ప్రభుత్వం మనుగడ, సుస్థిరత ఆధారపడి ఉంటుంది. ఇది బిజెపి కోరుకున్న 'అబ్‌కీ బార్ మోదీ సర్కార్ –400 పార్' ప్రభుత్వం కాదు. ఓటర్లు సంకీర్ణ శకాన్ని పునరుద్ధరించారు. సొంతంగా 370 స్థానాలు కోరుకున్న బిజెపిని 2019 ఎన్నికలనాటి 303 నుండి 242కు కోతపెట్టారు. అంటే మోదీ నాయకత్వాన్ని, బిజెపి దురహంకార, తిరోగామి, విభజనవాద పరిపాలనను దేశప్రజలు తిరస్కరించారు. మోదీ మూడోసారి ప్రధానమంత్రి పదవిలోకి వచ్చినందుకు పరవశించే వారు సైతం ఈ వాస్తవం అరుచికరమైనా మింగక తప్పదు. మూడోసారి ప్రధానిగా ప్రమాణస్వీకారం చేసి మోదీ ప్రథమ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ సరసన చేరినట్లు పోల్చుకోవటం సాంకేతికంగా సరైందికావచ్చుగాని, నవభారత నిర్మాణ సారథి అయిన నెహ్రూతో మరే విషయంలోను పోల్చదగింది కాదు. నెహ్రూ వారసత్వాన్ని నిత్యం ఈసడించే వారిని ఆయనతో పోల్చటమే హాస్యాస్పదం.

అయితే బిజెపి బలం లోక్‌సభలో తగ్గినంత మాత్రాన దాని తిరోగమనం మొదలైందని అనుకుంటే పొరపాటు. అది ఇప్పటికీ అది పెద్దపార్టీ. కొన్ని రాష్ట్రాల్లో నష్టపోయినా కొత్త భూభాగాలకు విస్తరిస్తూనే ఉంది. ఉదాహరణకు ఒడిశా రాష్ట్రం కొత్తగా దాని ఏలుబడిలోకి వచ్చింది. దక్షిణాది రాష్ట్రాల్లోకి విస్తరించేందుకు దాని ప్రయత్నాలు పాక్షికంగా ఫలించాయి. కర్నాటకలో లోక్‌సభ సీట్లు గతంతో పోల్చితే తగ్గినా తెలంగాణలో ఓట్ల శాతంతోపాటు గెలిచిన సీట్లను రెట్టింపు (4నుండి8) చేసుకోగలిగింది. దాదాపు 45 అసెంబ్లీ సెగ్మెంట్లలో బిజెపికి మెజారిటీ ఓట్లు లభించాయి. దాని పర్యవసానమే కేంద్ర మంత్రివర్గంలో ఇద్దరికి చోటు. తమ తదుపరి టార్గెట్ తెలంగాణ అని బాహాటంగా చెబుతున్నారు. స్థానంలేని ఆంధ్రప్రదేశ్‌లో అక్కడి ప్రత్యేక రాజకీయ పరిస్థితులను అనుకూలంగా ఉపయోగించుకుని టిడిపిని ఎన్‌డిఎలోకి లాగి 3లోక్‌సభ సీట్లు గెలుచుకుంది. ఆర్‌ఎస్‌ఎస్ కుటుంబానికి చెందిన నర్సాపురం ఎంపి శ్రీనివాసవర్మకు కేంద్రంలో సహాయ మంత్రిపదవి కట్టబెట్టింది. భవిష్యత్‌లో పార్టీ విస్తరణకు భూమికను తయారుచేసుకుంటోంది. దాని కన్ను తీక్షణంగా చూస్తున్న వామపక్ష ఆధిక్య కేరళలో తొలిసారి త్రిస్సూర్ లోక్‌సభ సీటు గెలిచింది. ఆ ఎంపి సినీహీరో సురేశ్ గోపీతో పాటు సీనియర్‌నాయకుడు మురుగన్‌కు (కిస్టియన్) మంత్రిపదవి ఇచ్చింది. కేరళలో ద్విముఖ రాజకీయ విభజనను త్రిముఖం చేయటం దాని ఉద్దేశం. పశ్చిమ బెంగాల్, త్రిపురలవలే కేరళలో కమ్యూనిస్టులను దెబ్బతీయటం దాని ధ్యేయం. తమిళనాడులో ఎఐఎడిఎంకెతో తగవును సర్దుబాటు చేసుకుని పొత్తు పునరుద్ధరించుకోగలిగితే 2026 అసెంబ్లీ ఎన్నికల్లో గట్టి పోటీ ఇవ్వగలుగుతుంది. లోక్‌సభ ఎన్నికల్లోనే పొత్తు ఉంటే మంచి ఫలితాలు లభించేవని తమిళసై సౌందర్‌రాజన్ అన్నమాట గమనించదగింది. కాబట్టి వామపక్ష, ప్రజాతంత్ర, లౌకిక శక్తులు నిరంతర అప్రమత్తతతో బిజెపి – ఆర్‌ఎస్‌ఎస్‌లపై సాగించే సైద్ధాంతిక పోరాటం, ప్రజాపోరాటాలు మాత్రమే బిజెపి ఎదుగుదలను, తద్వారా దేశ లౌకిక, ప్రజాస్వామ్య రాజ్యాంగానికి తలెత్తే ముప్పును నిరోధించగలవు!

## చల్లని లావా?



లావా అంటే ఏమిటి? అగ్ని పర్వతాలు విస్ఫోటనం చెందినప్పుడు, భూమి నుంచి అపారమైన వేడి కారణంగా కరిగిపోయిన ఖనిజాల సమ్మేళనమన్నది అందరికీ తెలుసు. లావా వేడిని భరించడం అసాధ్యం. కానీ, చల్లని లావా కూడా ఉంటుందని ఫిలిప్పీన్స్‌లో కె. అన్లాన్ పర్వత విస్ఫోటనంతో మరోసారి తెలిసింది. ఈ పర్వతం నుంచి చల్లని లావా, బూడిద మేఘం సరిసర ప్రాంతాలను ముంచెత్తింది. ఈ కారణంగా వందలాది మంది ప్రజలను ఆయా ప్రాంతాల నుంచి అధికారులు దూరంగా తరలించారు. కొన్ని విమానాల సర్వీసులను రద్దు చేశారు. అంతకు ముందు, ఇండోనేషియాలోని సుమత్రా ద్వీపంలో ఉన్న మౌంట్ మరాపి వెదజల్లిన కోల్డ్ లావా కారణంగా 40 మంది మృతి చెందారు. వందల సంఖ్యలో గల్లంతయ్యారు. ఆ ఘటనతో, నేటి ప్రపంచానికి కోల్డ్ లావా లేదా చల్లని లావా గురించిన సమాచారం తెలిసింది. తాజాగా అన్లాన్ పర్వత విస్ఫోటనం దృశ్యాలు సోషల్ మీడియాలో రావడంతో, కోల్డ్ లావా ఉంటుందనేది చాలా మందికి తెలిసింది. ఇండోనేషియన్, తగలోగ్ భాషలలో ఈ కోల్డ్ లావాను 'లహర్' అని పిలుస్తారు. సాధారణ భాషలో చెప్పాలంటే, అగ్ని పర్వత బూడిద ద్రవరూపాన్ని సంతరించుకోవడాన్ని కోల్డ్ లావా అంటారు. నీరు లేదా కరిగిన మంచు ద్వారా ఇది ఏర్పడుతుంది. రాతి శకలాలు జారిపడినప్పుడు లేదా భారీ వర్షపాతాలు సమీపించినప్పుడు, అగ్నిపర్వతాల వాలుపై ఒక ప్రవాహం ఏర్పడుతుంది. చిన్నచిన్న గులకరాళ్లను, మట్టిని తనతో తీసుకెళుతుంది. బురదనీటి ప్రవాహం మాదిరి, బూడిదతో నిండిన మంచు, నీరు మిశ్రమం వ్యాపిస్తుంది. దీని ప్రభావంతో, ఆకాశంలో ఒక బూడిద మేఘం కూడా ఏర్పడుతుంది. అగ్నిపర్వత విస్ఫోటనాలు లేకుండానే లాహర్లు సంభవించవచ్చు. భూమి పొరల్లో జరిగే చోటు చేసుకునే మార్పులతో ఒక్కోసారి విస్ఫోటనాలు చోటు చేసుకుంటాయి. నీరు, మంచు కలిసిన దట్టమైన లావాను వెదజల్లుతాయి. కోల్డ్ లావాగా పేర్కొనే దీని గాఢత ఒక్కోసారి మనుషులను ఊబిలోకి నెట్టేస్తుంది. కొన్ని సమయాల్లో ప్రాణాలు పోవచ్చు. అందుకే, లాహర్లతో జాగ్రత్తగా ఉండాలని అంటారు.

# భారత ప్రజాస్వామ్య పునరుద్ధరణ: సవాళ్ళు

ఇటీవల పూర్తయిన లోక్‌సభ పద్దెనిమిదవ సార్వత్రిక ఎన్నికలు దేశంలో ఒక దశ మార్పును సూచిస్తున్నాయి. కీలకమైన ఎన్నికల్లో అధికార మార్పిడి అనేది ఒక కోణమైనప్పటికీ, తాజా ఎన్నికల ఫలితాలలో ప్రత్యామ్నాయ శక్తి అధికారంలోకి రాలేదు. భారతీయ జనతా పార్టీ తన మెజారిటీ కోల్పోయినప్పటికీ, సభలో అంకెలను కలిగి ఉంది. ఇది కొంత వరకు బాగానే కనపడుతున్నప్పటికీ, కొన్ని షరతులు కూడా వర్తిస్తాయి. ముఖ్యంగా పునఃప్రజాస్వామీకరణ ప్రక్రియ తార్కిక ముగింపు దిశగా సాగాల్సిన అవసరం ఉంది.

గత పదేళ్లుగా భారతదేశంలో ప్రజాస్వామ్యాన్ని క్షీణింపజేసే విధానాలు అనుసరించబడ్డాయి. కొందరి చేతుల్లోనే రాజకీయ, ఆర్థిక శక్తి కేంద్రీకృతమైంది. పార్లమెంటు, సమాఖ్య విధానం, అనేక ఇతర సంస్థలు రాజ్యంలోని అత్యున్నత స్థానంలో ఉన్న గుప్పెడు మంది పణంగా పెట్టి మిగతావారి కోసం నిర్ణయాలు తీసుకున్నారు. వ్యాపార ప్రపంచంలో పరిమిత సంఖ్యలోని ఆశ్రితులకు దేశ వనరులపై పట్టు రావడమే కాకుండా, వారికి ఆర్థికరంగంపై ఆధిపత్యం లభించింది. ఈ హయాంలో అసమానతలు పెరిగిపోయినప్పటికీ మతం, ఇతర అంశాల పేరు మీద సంపన్నుల అనుకూల ప్రభుత్వానికే పేదలు మద్దతును కొనసాగించారు. మైనారిటీలను పణంగా పెట్టి వర్తమాన సామాజిక అంశాలలో అస్థిత్వ రాజకీయాలు, మతతత్వ విభజన జరిగింది.

పైన పేర్కొన్న రంగాలలో నూతన అధికార సమతుల్యత, వృత్తాంత మార్పు కారణంగా గణనీయమైన మార్పులు వస్తాయని ఆశిస్తున్నాం. కాని ఇది కార్యరూపం దాల్చుతుందా?

మార్పు కాదు... దిశ మారింది


బిజెపి ప్రధాన పార్టీగానే కొనసాగుతుండటంతో అధికార సమతుల్యతలో మార్పు రాలేదు, కానీ దిశ మారినట్లు కనిపించింది. కానీ, నరేంద్ర మోదీ తన రాజకీయ జీవితంలో మొదటిసారిగా సంకీర్ణ క్రీడను నడపాల్సి వస్తుంది. అధికారం బలహీనపడడంతో వ్యవస్థలు వెన్ను బలంగా నిలిపే శక్తి తిరిగి పొందేందుకు అవకాశం ఉంది. నేటి యేలికలు మునపటిలాగా బలవంతులుగా లేరని, రేపు కూడా వారు ప్రస్తుతం లాగే ఉండబోరని భారత ఎన్నికల కమిషన్ సహా, అధికార యంత్రాంగం గ్రహించాలి. దీనికి దగ్గట్టుగా వారు వ్యవహరిస్తారా అనేది వేచిచూడాలి. ఇదే విషయం న్యాయవ్యవస్థ, మీడియాకు కూడా వర్తిస్తుంది. గత పదేళ్ళలో ఆమోదం పొందిన స్వేచ్ఛాహననం చేసే చట్టాలను ఈ వ్యవస్థలు నిరోధిస్తాయా? మనం 1977లో లేనందున భావ ప్రకటనా స్వేచ్ఛ, వ్యక్తిగత హక్కులను నిరోధించే నిరంకుశ చట్టాలను వెనక్కి తీసుకోలేరా? అందుకు మెజారిటీ లేదా?

ప్రభుత్వ అధికారం సాపేక్షికంగా తగ్గిపోవడంతో పాటు, ఈ ప్రభుత్వానికి సాంప్రదాయకంగా రాష్ట్రాల స్వయం ప్రతిపత్తిని రక్షిస్తున్న తెలుగుదేశం పార్టీ, జనతాదళ్ (యు) తదితర రెండు, మూడు ప్రాంతీయ పార్టీల మద్దతు అవసరం కాబట్టి సమాఖ్యవాదానికి పునరుత్తేజం కల్పించాలి.

అటల్ బిహారీ వాజ్‌పేయి, మన్మోహన్ సింగ్ హయాంలో కనిపించిన వికేంద్రీకరణ మనం ఇటీవల చూడకపోయినప్పటికీ, సంకీర్ణ రాజకీయాలలో ముఖ్యమంత్రులకు గొప్ప గుర్తింపు ఉండేది. 2016లో నోట్ల రద్దుకు ముందు, 2020లో కొవిడ్ – 19 లాక్‌డౌన్‌కు ముందు వారిని సంప్రదించలేదనే విషయాన్ని మనం గుర్తుంచుకోవాలి.

అధికార సంబంధాలే కాకుండా, వృత్తాంతం కూడా మారాలి. జాతీయ ప్రజాదరణ గల నాయకుల మాదిరిగానే మోదీ సైతం తానే దేశం అని ముద్ర వేశారు. అనేక మంది రాజకీయ నాయకులు, కుహనా మేధావులు, జర్నలిస్టులు ఈ ప్రచారానికి మద్దతిచ్చారు. ఫలితంగా భారతీయత, హిందూతత్వ సమీకరణలను తీసుకువచ్చి, మైనారిటీలను, ప్రత్యేకించి ముస్లింలను పక్కకునెట్టారు. ఈ తరహా అస్థిత్వ రాజకీయాలు ఇప్పుడు ఆత్మరక్షణలో ఉండొచ్చు, సామాజిక సమానత్వం అనే మరొక సైద్ధాంతిక అజెండాకు ప్రాధాన్యత లభించవచ్చు. 1990లో వి.పి.సింగ్ మండల్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలని నిర్ణయించినప్పటికీ నుండి అనేక మార్లు జరిగినట్లుగానే, రెండు వైపుల పోటీ ప్రచారాలు జరగవచ్చు. సామాన్యుల ఎదుగులను అడ్డుకునేందుకు 1990లో జాతి–మత అస్థిత్వాన్ని ముందుకు తెచ్చిన సంఘ పరివార్ ఒకవైపు, దానికి ప్రతిఘటనగా సామాజిక న్యాయాన్ని ప్రోత్సహించేందుకు కులగణన, ఇతర సామాజిక అంశాలకు అనుకూలంగా మద్దతుదారులను సమీకరించేందుకు కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ, రాష్ట్రీయ జనతాదళ్ మరొక వైపు ఉండనుంది.

మీడియా కవరేజీ కనిష్ఠంగా ఉన్నప్పటికీ ఈ కార్యక్రమాన్ని రాహుల్‌గాంధీ తాను చేపట్టిన రెండు యాత్రలు – భారత్ జోడో, భారత్ జోడో న్యాయ్ యాత్రల ద్వారా స్పష్టంగా జనంలోకి తీసుకెళ్ళడంతో ప్రజాదరణ పొందిన నాయకుడిగా ఆవిర్భవించారు. ఈ మార్పు ఎన్నికల ఫలితాల తరువాత మరింత ప్రస్ఫుటమైంది. ఇకపై ఆయనను ఎవరూ 'పప్పు' అని పిలవబోరు. ఇది కేవలం యాత్రల ద్వారానే కాకుండా ఆయన భారత రాజ్యాంగాన్ని పరిరక్షించిన తీరు, ఇండియా కూటమి పేరుతో అనేక పార్టీల కూటమిని నిర్మించిన తీరు కూడా కారణమైంది. అంతే కాకుండా ఆకర్షణీయమైన సామాజిక అంశాలను చర్చలోకి తీసుకువచ్చిన విధానం కూడా ఉపకరించింది.



## విభిన్న దృశ్యాలు

నితీశ్ కుమార్ ఆధ్వర్యంలో కుల గణన నిర్వహించిన మొదటి రాష్ట్రంగా బిహార్ నిలిచింది. తాను చేసిన పనిని అనుసరించాలని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఇప్పుడు ఎన్‌డిఏను ఒప్పించగలరా? లేదా ఈ అంశాన్ని ముందుకు తీసుకెళ్ళకుండా తప్పించుకుంటారా? మరింత మామూలుగా చెప్పుకోవాలంటే జెడి (యు), టిడిపి, ఇతరులు ఎంత వరకు వారి స్వంత ఎజెండా, ప్రయోజనాలను ముందుకు తీసుకెళ్ళేందుకు ప్రయత్నిస్తారు? భిన్న దృశ్యాలు సాక్షాత్కరించేందుకు ఇదొక కీలక అంశం.

టిడిపి, జెడి(యు)లతో పాటు మరికొందరు చేసే డిమాండ్‌లపై వచ్చే వారాలు, నెలలలో మోదీ ప్రభుత్వం ఇచ్చే తాత్కాలిక ఉపశమనం ఏ విధంగా ఉండబోతుంది. ఏ మేరకు ఆమోదయోగ్యత ఉండబోతుందో అనేది ఒక దృశ్యం. అన్నిటి కంటే ఎక్కువగా ఇది జరిగే అవకాశం ఉంది.

మరో దృశ్యం విషయానికి వస్తే, రిజర్వేషన్‌ల పరిమితి 49 శాతానికి మించి పెంపు, ప్రైవేటు రంగంలో రిజర్వేషన్ వంటి డిమాండ్‌లను టిడిపి, జెడి(యు)లు లేవనెత్తితే, అధికార పంపిణీలో తకరారు తలెత్తితే మోదీ అత్యంత క్లిష్టమైన పరిస్థితిలో ఉంటారు. ఎందుకంటే ఇది బిజెపి పార్టీ పునాదిపై ప్రభావం చూపుతుంది. మరికొన్నిట్లో చర్యలు తీసుకోవాల్సి వస్తే ప్రభుత్వం తన మిత్రుల కళ్ళలోకి కూడా చూడలేరు. (ఉదాహరణకు గౌతం ఆదానీ కార్యకలాపాలపై దర్యాప్తు వంటి అంశం). జెడి(యు), టిడిపిల బేరసారాల శక్తి ప్రబలమైనది. రాజకీయ క్షేత్రంలో ఆ రెండు పార్టీలు ఒక వైపు నుండి మరో వైపు మారడం ద్వారా ప్రభుత్వాన్ని పడిపోయేట్టు చేయడమే కాకుండా ఇండియా కూటమి అధికారం చేపట్టేందుకు అవకాశం కల్పించగలవు.

ఈ రెండు దృశ్యాలను పరస్పరం వేరుగా చూడలేము. రెండవ దృశ్యాన్ని కొన్ని నెలలు లేదా ఒకటి రెండు సంవత్సరాల తరువాత చూడవచ్చు. ప్రత్యేకించి మోదీ ప్రభుత్వం మరిన్ని ఎన్నికల ఎదురుదెబ్బలతో బలహీనమైన తరువాత (ఈ నేపథ్యంలో మహారాష్ట్ర, హర్యానా ఎన్నికలను ఈ కోణంలో నిశితంగా గమనించాలి). ఒకవేళ టిడిపి, జెడి(యు)తో కూడిన అధికార సంకీర్ణానికి ఇతర ప్రాంతీయ పార్టీలు, కాంగ్రెస్ నుండి ఒత్తిడి ఎదురవుతే కూడా అది సాధ్యమే. రక్తం రుచి చూసిన ప్రతిపక్షం తమ బలాన్ని గుర్తించింది. వీధుల్లో నిరంతరం బలాన్ని పెంచుకోవడం, తమ ఐక్యతను శక్తివంతం చేసుకోవడం, మరిన్ని భాగస్వాములను చేర్చుకోవడం ద్వారా అది సాధ్యమవుతుంది. నూతన మార్పులతో అధికార పార్టీ పట్ల ప్రత్యర్థి వైఖరితో మాయావతి నిర్భీతిగా తన బహుజన పార్టీని పునరుజ్జీవింపజేసుకోవచ్చు.

ఈ పరిస్థితులలో ఎన్‌డిఏను ఐక్యంగా ఉంచే పరిస్థితులలో మోదీ ఉండబోరు. ఎందుకంటే తన భాగస్వాములు అతిగా ఆశించడం లేదా ఎప్పటికప్పుడు సంకీర్ణ భాగస్వాములకు రాయితీలు కల్పించడం ద్వారా ఉద్రిక్తతలను తగ్గించే సంకీర్ణ నిపుణుడిగా ఆయనకు గతంలో అలవాటు లేదు. అలాంటి పరిస్థితుల్లో రాష్ట్రీయ స్వయం సేవక్ (ఆర్‌ఎస్‌ఎస్) ఆయన స్థానంలో గతంలో అనేక సందర్భాలలో తాము మద్దతిచ్చిన నితిన్ గడ్కరీని తీసుకురావొచ్చు. 2014లో మోదీ తప్పనిసరై ఆర్‌ఎస్‌ఎస్ అభ్యర్థి అయ్యారు. సంఘ్‌లోని ఉన్నత స్థాయి నాయకులతో ఆయన సంబంధాలు మెరుగుపడలేదు.

కానీ, మోదీ(అమిత్‌షా) అధికారాన్ని అంత తేలిగ్గా వదులుకోబోరు. లోపల అనేకం దాగి ఉన్నాయి. తన పదవిని కాపాడుకునేందుకు మోదీ అవలంభించే పద్ధతులను ఎవరూ ఊహించలేరు. కాలం అనేది చాలా ముఖ్యమైనది. గడిచిన పదేళ్ళలో కుంచించుకుపోయిన భారత గణతంత్రంలోని వ్యవస్థలు తిరిగి పుంజుకున్నట్లయితే రాజకీయ సంక్షోభాలు మునుపటి ప్రభావాన్ని చూపలేవు.అయినప్పటికీ, రాజకీయ పాత్రధారులే కాకుండా పునరుజ్జీవం పొందిన భారత ప్రజాస్వామ్యంలో పౌర సమాజం కూడా కీలక పాత్ర పోషించాల్సి వస్తుంది. తాజా ఎన్నికలు నూతన దిశగా పరివర్తన సూచిస్తే, ప్రత్యేకించి ఆర్‌ఎస్‌ఎస్ సంబంధిత పటిష్టమైన యంత్రాంగాన్ని ఎదుర్కొనేందుకు అధికార మార్పిడి ఒక్కటే భారత పునః ప్రజాస్వామీకరణకు సరిపోదు.(ది హిందూ సౌజన్యంతో..)

**క్రిస్టోఫ్ జాఫర్‌లాట్**
లండన్ కింగ్స్ కాలేజ్‌లో ఇండియన్ పాలిటిక్స్, సోషియాలజీ ప్రొఫెసర్

# 'ఇడియట్ సిండ్రోమ్' అనర్ధదాయకం

ఇంటర్‌నెట్ అందుబాటులోకి వచ్చాక మానవాళికి ఎంత లబ్ధి జరిగిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఏ చిన్న సమస్యకైనా క్షణాల్లోనే ఒక్క క్లిక్‌తో పరిష్కారం కనుక్కొంటున్నారు. ఈ మధ్య కాలంలో ముఖ్యంగా కరోనా తర్వాత చాలా మంది ఏదైనా ఆరోగ్య సమస్య వస్తే.. దానికి సంబంధించిన ట్రీట్‌మెంట్ గురించి అంతర్జాలం, యూట్యూబ్‌లో సెర్చ్ చేస్తూ ఎవరికి వారే డాక్టర్లు అయిపోతున్నారు.మీరూ అదే విధంగా చేస్తున్నారా? అయితే, అలర్ట్ కావాల్సిందే అంటున్నారు నిపుణులు. ఎందుకంటే.. మీరు ఇడియట్ సిండ్రోమ్ బారిన పడే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. అసలేంటి ఈ ఇడియట్ సిండ్రోమ్? దీని లక్షణాలేంటి? ఎలాంటి పరిణామాలుంటాయి? ఎలా బయటపడాలి? ఈ అంశాలపట్ల ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. ఆరోగ్యంపై ఆందోళనతో అనవసరంగా ఆన్‌లైన్‌లో, యూట్యూబ్‌లో పదే పదే సెర్చ్ చేయడాన్ని 'ఇడియట్ సిండ్రోమ్'గా పిలుస్తున్నారు. నిపుణులు. ఇడియట్ సిండ్రోమ్ అంటే.. 'ఇంటర్నెట్ డెరైవ్డ్ ఇన్ఫర్మేషన్ అబ్‌స్ట్రక్షన్ ట్రీట్మెంట్' సిండ్రోమ్. దీన్నే వైద్య పరిభాషలో 'సైబర్‌కాండ్రియా' అని కూడా పిలుస్తారు. ఇటీవల కాలంలో చాలా మంది తమకున్న లక్షణాల ఆధారంగా ఆన్‌లైన్‌లో సెర్చ్ చేసి జబ్బు ఏంటో నిర్ధారించుకుని డాక్టర్‌ను సంప్రదించకుండానే ట్రీట్‌మెంట్ చేసుకుంటున్నారు. వైద్యం కోసం ఇలా గూగుల్ పై ఆధారపడే వారు తమకు తాము మేలుకన్నా కీడే ఎక్కువగా చేసుకుంటున్నారని ఆ అధ్యయనం వెల్లడించింది. ఈ లక్షణాలు ఉన్న రోగులు ఆన్ లైన్ లో అందుబాటులో ఉన్న వైద్య సమాచారంతో స్వీయ చికిత్సలు చేసుకుంటున్నారని పేర్కొంది. కొందరేమో డాక్టర్లు ప్రిస్క్రిప్షన్ లో సూచించిన వైద్యాన్ని కూడా పక్కన పెడుతున్నారని వివరించింది. ఇది అత్యంత ప్రమాదకరమని తెలిపింది. నమ్మదగ్గ వైద్య వెబ్ సైట్ల ద్వారా రోగులు విశ్వసనీయమైన సమాచారం పొందడం వరకు మంచిదేనని.. కానీ అర్హతగల వైద్య నిపుణుడి వ్యాధి నిర్ధారణ సామర్థ్యానికి అది ఏమాత్రం సమానం కాదని స్పష్టం చేసింది. నేషనల్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ కు చెందిన క్యూరియస్ లో ఇందుకు సంబంధించిన వివరాలు ప్రచురితమయ్యాయి. ఈ సిండ్రోమ్‌తో బాధపడేవారు తీవ్ర ఆందోళనలో ఉండటం, చిన్నపాటి లక్షణాలకే తీవ్రమైన హెల్త్ ప్రాబ్లమ్ ఉన్నట్లు ఆందోళన చెందడం, అనవసరంగా గంటల తరబడి వైద్య సమాచారం కోసం ఆన్‌లైన్‌లో సెర్చ్ చేయడం. ఇంటర్నెట్‌లో లభించిన సమాచారం ఆధారంగా దిగులు చెందడం, గుండె వేగంగా కొట్టుకోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఇప్పటికే ఉన్న వ్యాధుల పట్ల విపరీత నిర్ణయాలు తీసుకోవడం. వైద్యులు ఇచ్చే సమాచారాన్ని నమ్మకపోవడం వంటి లక్షణాలు ఉంటాయి. ఒక అధ్యయనం ప్రకారం.. ఇడియట్ సిండ్రోమ్‌తో బాధపడుతున్న వారిలో ఆందోళన, నిరాశ స్థాయిలు మిగతావారికంటే ఎక్కువగా కనిపిస్తున్నట్లు పరిశోధకులు చెబుతున్నారు. చిన్నపాటి లక్షణాలు ఉన్నంత మాత్రాన కొంతమంది వారికి వారే ఏదో పెద్ద అనారోగ్యం ఉన్నట్లు కుంగిపోతుంటారు. ఈ నేపథ్యంలో వైద్యులు ధ్రువీకరించకుండా ఎలాంటి మందులు వాడకూడదు. ఆందోళన నుండి బయటికి రావడానికి కొన్ని రిలాక్సేషన్ టెక్నిక్ లను పాటించవచ్చునని వైద్యులు సూచిస్తున్నారు ముఖ్యంగా దీర్ఘశ్వాస,ధ్యానం, కండరాలను వదులుచేసే వ్యాయామాలు వంటి వాటివల్ల ఉపశమనం కలుగుతుంది. ఇంటర్నెట్ లో ఉన్న సమాచారం అంతా నిజం కాదనే వాస్తవాన్ని గుర్తుంచుకోవాలి. ఒకవేళ ఎంత ప్రయత్నించినా ఆందోళన నుంచి బయటకు రాకపోతే వెంటనే వైద్యున్ని సంప్రదించాలి. ఆన్‌లైన్‌లో ఆరోగ్య సమాచారాన్ని గుడ్డిగా నమ్మితే ఎదురయ్యే సమస్యలను గూర్చి ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. ముఖ్యంగా యువతకు సాఫ్ట్ వేర్ ఆధారిత సంస్థలలో పనిచేసే ఉద్యోగులకు సైకాలజిస్టుల ద్వారా అవగాహనను కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**సుధాకర్ ఎ.వి, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి**
**స్టేట్ టీచర్స్ యూనియన్ తెలంగాణ, 9000674747**

# గిఫ్టులు కాదు.. నమ్మకం కలిగించాలి

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మహిళలతో స్కీమ్‌లకు శ్రీకారం చుడితే, కొందరు ఆర్టీసి అధికారులు గిఫ్ట్ స్కీమ్‌ల వైపు మొగ్గు చూపుతున్నారు. అక్కడ ప్రభుత్వం, ఇక్కడ ఆర్టీసి అధికారులు మహిళలనే టార్గెట్‌గా ఎంచుకున్నారు. ''బస్సెక్కండి ఉచితంగా చీర పొందండి'' అనే స్కీమ్ మిర్యాలగూడ, విజయవాడ రూట్‌లో ప్రవేశపెట్టినట్లు పేపర్లో చదివాము. తమ డిపోకు ఆదాయ వనరులు పెంచుకోవడానికో లేక ఆక్యుపెన్సీ రేషియో పెంచుకోవడానికో వారు ఈ మార్గాన్ని ఎన్నుకున్నట్లున్నారు. కాని ఈ మార్గం సరైంది కాదు. ఆర్టీసి అధికారులు కలెక్టివ్ కాన్సెప్ట్ మరిచిపోయి చాలాకాలం అయింది. డిపో మేనేజర్, డిప్యూటీ సిపిఎం, రీజనల్ మేనేజర్ వీరందరూ కూడా ఫీల్డ్ మేనేజర్స్. క్షేత్ర స్థాయిలో వాస్తవాలను దర్శించేవారు. వారు అనునిత్యం రోడ్లమీద తిరుగుతూ ప్రయాణీకులకు, ప్రజలకు దగ్గరగా ఉంటూ ట్రాఫిక్ నీడ్ పరిశీలిస్తూ డిమాండ్ అండ్ సప్లై చూడాలి. ఉచిత స్కీమ్‌లు, గిఫ్ట్ స్కీమ్‌లు గురించి ఆలోచించే బదులు ఒక ట్రాఫిక్ పాయింట్‌లో ఉండి ఎంతమంది ప్రయాణీకులు ఆర్టీసికి దూరమై ఆటో, క్యాబ్, జీప్, లారీ, ట్రాక్టర్, ప్రైవేట్ బస్సులలో వెళుతున్నారో గణాంకాలు తీసుకుని దిద్దుబాటు చర్యలు తీసుకుంటే బాగుంటుంది. డిమాండ్ ఉన్నచోట సప్లై ఉండాలి. అలాగే సమయపాలన ఉండాలి. సమయానికి బస్సు వస్తుంది అనే నమ్మకం ప్రయాణీకుడికి కలిగించాలి. అప్పుడు ఆటోమేటిక్‌గా ఈపికె, ఒఆర్ పెరుగుతాయి. గిఫ్టల ద్వారా పెంచుకోవాలనుకుంటే అది వాపు అవుతుందే కాని, బలం కాదు. ఓఆర్, ఆదాయం పెరగటమే అధికారుల కాన్సెప్ట్ అయితే ఇంతకంటే అనేకమైన మంచి గిఫ్ట్ స్కీమ్‌లు పెట్టుకోవచ్చు. ''బస్సు ఎక్కు పబ్బు ఫ్రీ'', ''బస్సు ఎక్కు బారు ఫ్రీ'' అంటే అనేకమంది మందు బాబులు క్యూలో నిలబడి మరీ బస్సులు ఎక్కుతారు. ఓఆర్ కళకళ లాడుతుంది. ఇంకా వీరికి సర్వీసు కోసం ఆర్టీసి కొంతమంది సిబ్బందిని రిక్రూట్‌మెంట్ చేసుకుని స్టేజిలలో వేడి వేడిగా చీకులు కాల్చి ఇస్తే వ్యాపారం ఇంకా బాగుంటుంది. కాని ఇది అనైతికం. ఉచితాలు, గిఫ్టలనేవి అవినీతి కారకాలు. సుప్రీంకోర్టు అనేక సందర్భాల్లో ఇంటిగ్రిటీ ఆఫ్ డెమోక్రసీ గురించి చెప్తూ వస్తోంది. అది రాజకీయ నాయకులకు అర్థమైందో లేదో కాని, ప్రస్తుతం బ్యూరోక్రాట్స్ కూడా ఆ దారినే అనుసరిస్తున్నారు. ఇది చాలా విచారకరం. ఆర్టీసి రెగ్యులేషన్స్ ప్రకారం గిఫ్టలు తీసుకోకూడదు. వ్యాపారం చేయకూడదు. అటువంటిది ప్రజారవాణా సంస్థలో పనిచేసే అధికారులే నియమ నిబంధనలకు నీళ్ళు వదిలి నేల విడిచి సాము చేస్తే ఆర్టీసికి నష్టాలు రాక లాభాలు ఎలా వస్తాయి? ఎయిర్‌కండిషన్ గదులలో కూర్చుని డ్రైవర్, కండక్టర్, గ్యారేజి సిబ్బందిని ఎలా శిక్షించాలా అని అధికారులు ఆలోచిస్తున్నారే తప్ప క్షేత్ర స్థాయిలో వాస్తవాలను అర్థం చేసుకుని ఆపరేషన్స్ ప్లానింగ్ చేయకపోవడం దురదృష్టకరం.




**ఎస్.బాబు**
**టిఎస్‌ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు**

## ఇంటర్నెట్ షట్‌డౌన్స్‌లో

# మనదే అగ్రస్థానం



ఎంత చెత్తదైనా... ఎంతటి పనికిమాలినదైనా.. రికార్డు రికార్డే అంటూ గొప్పలు చెప్పుకొనే వారికి ఇది ముమ్మాటికీ గొప్పవార్తే. అయితే, మిగతా వారు మాత్రం సిగ్గుతో తలదించుకోవాలి. ఎందుకంటే, అంతర్జాతీయ స్థాయిలోనే ఇంటర్నెట్ షట్‌డౌన్స్‌లో మన దేశం అగ్రస్థానంలో ఉంది. సాంకేతిక కారణాల వల్ల షట్‌డౌన్‌లు ఉండడం కొత్తకాదు. కానీ, మన దేశంలో, ప్రభుత్వాలే, ఉద్దేశపూర్వకంగా ఇంటర్నెట్ వినియోగంపై ఆంక్షలు విధిస్తూ, ఆనందం పొందుతున్నాయి. వరుసగా ఆరో సంవత్సరం కూడా మన ప్రపంచ షట్‌డౌన్స్ జాబితాలో మొదటి స్థానంలో ఉన్నామంటే, పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. కీప్ ఇట్ నివేదికను అనుసరించి, మన దేశంలో ఉద్దేశపూర్వకంగా ఇంటర్నెట్‌ను డిస్కనెక్ట్ చేసిన సంఘటనలు 116 నమోదయ్యాయి. అనధికారికంగా షట్‌డౌన్ చేసిన సందర్భాలు ఇంకెన్నో! జాతి విద్వేషాలు తలెత్తి, అంతర్యుద్ధం కొనసాగుతున్నప్పుడు లేదా విదేశాలతో యుద్ధాలు మొదలైనప్పుడు కీలకమైన సమాచారం బయట పొక్కకుండా జాగ్రత్త పడేందుకు ఇంటర్నెట్ సేవలను అపేస్తారు. అది సహజం. కానీ, మన దేశంలో, ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ఎప్పుడు చర్చ మొదలైనా, ఇంటర్నెట్ షట్‌డౌన్ అనేది ఆనవాయితీగా మారింది. ప్రమాదకర సమయాల్లో తప్పుడు సమాచారం వ్యాప్తి చెందకుండా నిరోధించడానికి లేదా పరీక్షల్లో మోసం చేయకుండా నిరోధించడానికి ఉపయోగించాల్సిన ఈ పద్ధతిని రాజకీయ ప్రయోజనాలకు వాడుకోవడం దురదృష్టకరం. నిజానికి ఇంటర్నెట్ షట్‌డౌన్స్ వల్ల వాస్తవాలు ప్రజల వరకూ చేరవు. ఈశాన్య రాష్ట్రమైన మణిపూర్‌లో జరిగిన, జరుగుతున్న హత్యలు, మహిళలపై హింస, కాల్పులు వంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. తీవ్రమైన మానవ హక్కుల ఉల్లంఘన జరుగుతున్నదని ప్రతిపక్షాలు విరుచుకుపడుతున్నాయి. అయితే, అక్కడ ఎక్కువ సమయం ఇంటర్నెట్‌ను నిలిపివేయడం వల్ల, వాస్తవాలను రికార్డు చేయడం, నివేదించడం అసాధ్యంగా మారిందని సామాజిక కార్యకర్తలు వాపోతున్నారు. ఇలాంటి షట్‌డౌన్ల వల్ల తమ వ్యాపార లావాదేవీలు దెబ్బతింటున్నాయని వివిధ కాంపెనీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. షట్‌డౌన్లు పెద్ద ప్రాంతాల్లో తీవ్ర ప్రభావం చూపుతాయి. 2023లో ఒకే రాష్ట్రం లేదా ప్రాంతంలోని అనేక జిల్లాల్లో 64 షట్‌డౌన్ ఘటనలు చోటు చేసుకున్నాయి. ముఖ్యంగా జాత్యహంకార హింస కారణంగా మణిపూర్‌లో 47 పర్యాయాలు ఇంటర్నెట్ సేవలను నిలిపివేశారు. పంజాబ్‌లో ఖలిస్థాన్ అనుకూల ఉద్యమకారుడు అమృత్‌పాల్ సింగ్ కోసం గాలింపు చర్యలు జరుగుతున్నప్పుడు, రాష్ట్రం మొత్తం మీద ఇంటర్నెట్ వినియోగానికి అనుమతించలేదు. దీని వల్ల ఇంటర్నెట్ ఆధారిత కార్యాలయాలు, వ్యాపార సంస్థలు, ఇతరత్రా వ్యాపార కేంద్రాలు భారీగా నష్టపోయాయి. ఇంటర్నెట్ బ్లాక్‌లు జిడిపి వృద్ధిని తగ్గిస్తాయి. 2015–2016 మధ్య ఇంటర్నెట్ క్షీణించినప్పుడు, ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు 2.4 బిలియన్ల డాలర్ల మేర నష్టం వాటిల్లిందని బ్రూకింగ్స్ ఇన్‌స్టిట్యూషన్ ఒక నివేదికలో పేర్కొంది. షట్‌డౌన్స్ కారణంగా చిన్న కంపెనీలు మార్కెట్లు, ఇతర ముఖ్యమైన సేవలకు అంతరాయం ఏర్పడుతుంది. ఇటీవల కాలంలో ఆర్డర్లను పెట్టడం నుంచి బిల్లులు చెల్లించడం వరకూ, ఎన్నో రకాలుగా ఇంటర్నెట్ సేవలపైన ఆధారపడడం పెరిగింది. చివరికి, బయటకు వెళ్లేందుకు వాహనాన్ని బుక్ చేసుకోవాలన్నా, ఇంటర్నెట్ ఉండి తీరాల్సిందే. గంటలకు గంటలు... కొన్ని సందర్భాల్లో, రోజులు.. వారాలు.. నెలల తరబడి కూడా ఇంటర్నెట్ సేవలను రద్దు చేయడం మన దేశంలో సాధారణంగా మారిందన్న విమర్శలున్నాయి. ఈ షట్‌డౌన్స్ కారణంగానే రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ (ఆర్ అండ్ డి) కుంటుపడుతుంది. కొత్త ఆలోచనలపై ఎక్కువగా ఆధారపడే రంగాల్లో డిజిటల్ ఇన్నోవేషన్ ప్రవాహాన్ని ఇలాంటి అంతరాయాలు ఇబ్బంది పెడతాయి. సాంకేతిక పురోగతిని దెబ్బతీస్తాయి. ఇలాంటి పరిస్థితులు సహజంగానే అంతర్జాతీయ సేవా విపణిలో ప్రతిబంధకాలను సృష్టిస్తాయి. అంతేగాక, పెట్టుబడిదారులు విశ్వాసాన్ని కోల్పోతారు. ప్రత్యేకించి విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు వెనకడుగు వేస్తారు. మదుపరులు ఎవరైనా తమతమ పెట్టుబడులు సురక్షితంగా ఉండాలని, ఎక్కువ లాభాలు ఆర్జించాలని కోరుకుంటారు. ఇంటర్నెట్ షట్‌డౌన్స్ ఎక్కువగా ఉంటే, ఆయా పరిశ్రమలు లేదా రంగాలు ప్రపంచ సంస్థలతో పోటీ అవకాశం తగ్గుతుంది. వ్యాపారాలు సజావుగా సాగవు. నాణ్యతలేని సేవలను ఎవరూ అంగీకరించరు. ఈ పరిస్థితుల్లో, సిబ్బందిని తగ్గించడం లేదా కంపెనీని పూర్తిగా మూసివేయడం మినహా యాజమాన్యాలకు వేరే మార్గం ఉండదు. ఈ పరిస్థితి నిరుద్యోగ సమస్య పెరగడానికి కారణమవుతుంది. ఏదిఏమైనా, రాజకీయ ప్రయోజనాలను ఆశించి లేదా వాస్తవాలు బయటపడకుండా ఉండాలన్న ఆలోచనతో ఇంటర్నెట్ షట్‌డౌన్‌కు పాల్పడడం మంచిది కాదు. దేశ భవిష్యత్తుకు ప్రమాదకరం కూడా.

## 14, 15 తేదీలలో సిపిఐ శిక్షణా తరగతులు

### సిపిఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్



**ప్రజాపక్షం/ఖమ్మం :** కార్యకర్తల్లో సైద్ధాంతిక రాజకీయ అవగాహన కలిగించేందుకు జూన్ 14, 15 తేదీలలో రాజకీయ శిక్షణా తరగతులను నిర్వహించనున్నట్లు సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ తెలిపారు. స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో 14వ తేదీ ఉదయం తొమ్మిది గంటలకు శిక్షణా తరగతులు ప్రారంభమవుతాయని ఆయన తెలిపారు. నూతన లేబర్ కోడ్స్, కార్మిక వర్గంపై ప్రభావం అనే అంశాన్ని ఎండి యూసఫ్ బోధిస్తారని తెలిపారు. 11.30 నుండి భారత కమ్యూనిస్టు పార్టీ చరిత్రను నాగపూర్ యూనివర్సిటీ ప్రో॥ యుగల్ రాయులు బోధిస్తారని ఆయన తెలిపారు. సాయంత్రం కులం, మతం వర్గ పోరాటాలు అనే అంశాన్ని ప్రో॥ కాశీం ప్రస్తుత రాజకీయ పరిస్థితులు సోషల్ మీడియా అనే అంశాన్ని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు బోధిస్తారన్నారు. 15వ తేదీ ఉదయం నూతన సవాళ్లు పార్టీ నిర్మాణం అనే అంశాన్ని బాగం హేమంతరావు బోధిస్తారని ప్రసాద్ తెలిపారు. 15వ తేదీ మధ్యాహ్నం మూడు గంటల నుంచి ఐదు గంటల వరకు జిల్లా కౌన్సిల్ సమావేశం జరుగుతుందని తెలిపారు. ఈ శిక్షణా తరగతులు ఖమ్మం సిపిఐ కార్యాలయం గిరిప్రసాద్ భవన్‌లో జరగనున్నాయన్నారు. ఈ శిక్షణా తరగతులకు ఎంపికైన ప్రతినిధులు సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు.

## బిఆర్ఎస్ కార్యకర్తలకు పార్టీ అండ

### ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి



**ప్రజాపక్షం/సూర్యాపేట రూరల్:** బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో ప్రమాదవశాత్తు మరణించిన ముగ్గురు బిఆర్ఎస్ కుటుంబాలకు రెండు లక్షల చొప్పున చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గులాబీ సైనికులకు రక్షణ కవచంగా బిఆర్ఎస్ బీమా ఉంటుందన్నారు. కష్టాల్లో ఉన్న ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ పెరుమాళ్ళ అన్నపూర్ణ, వైస్ చైర్మన్ పుట్ట కిషోర్, ఎంపిపి నెమ్మాది భిక్షం, నాయకులు లవకుశ, రఫీ, కరుణశ్రీ, నెమ్మాది నగేష్, ముదిరెడ్డి అనిల్ రెడ్డి, ఎలక హరీష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ శ్లోక విద్యాసంస్థ ప్రారంభం



**ప్రజాపక్షం/హాలియా :** హాలియా పట్టణంలో కొత్తగా ఏర్పాటు చేసిన శ్రీ శ్లోక విద్యాసంస్థను నాగార్జునసాగర్ ఎంఎల్‌ఎ కుందూరు జయవీర్ రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలో మంచి టెక్నాలజీతో విద్యను అందించడానికి ముందుకు వచ్చిన శ్రీ శ్లోక యజమాన్యాన్ని అభినందించారు. విలువలతో కూడిన విద్యను అందిస్తూ భవిష్యత్తులో పేద విద్యార్థులను ఆదుకోవాలన్నారు. విద్యతో పాటు క్రీడలలో కూడా రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అనుపమ నరేందర్ రెడ్డి ,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శేఖర్ రెడ్డి ,మండల్ పార్టీ అధ్యక్షులు కుందూరు వెంకటరెడ్డి, ఫ్లోర్ లీడర్ చింతల చంద్ర రెడ్డి , యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రాజా రమేష్, పాఠశాల చైర్మన్ కుకుడాల ఆంజనేయులు, డైరెక్టర్స్ గుజ్జరి నవీన్ , కుకుడాల సంతోష్, చెరుకు నవీన్ కుమార్, కుకుడాల నరేష్, ప్రిన్సిపల్ సిద్ధికి తదితరులు పాల్గొన్నారు.

## మోత్కూరు మండలాన్ని రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలి



**ప్రజాపక్షం/మోత్కూర్:** మోత్కూరు మండలాన్ని రెవిన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని, బీసీ రిజర్వేషన్ సాధన సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు బుర్ర శ్రీనివాస్ గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం ఈ మేరకు మోత్కూరుకు ఓ ప్రైవేట్ కార్యక్రమానికి వచ్చిన యాదాద్రి భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డికి బీసీ రిజర్వేషన్ సాధన సమితి ఆధ్వర్యంలో మోత్కూరులో రెవిన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని కోరుతూ వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ఉమ్మడి నల్లగొండ జిల్లాలో అంత్యంత వెనుక బడిన మోత్కూరు మండలం అభివృద్ధి అమడదూరంలో ఉందన్నారు. ఇక్కడ రెవిన్యూ డివిజన్ లేక జిల్లా కేంద్రమైన భువనగిరి వెళ్లాలంటే 42 కి.మీ. వెళ్ళవలసి ఉందని తద్వారా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దశాబ్దకాల ఈ ప్రాంత చిరకాల రెవిన్యూ డివిజన్ అనేక సమస్యలు ముడిపడి ఉన్నాయన్నారు. ఇక్కడ రెవిన్యూ డివిజన్ లేకపోవడం వల్ల మారుమూల గ్రామీణ ప్రాంతాల ప్రజలు సుమారుగా 70 కి.మీ ప్రయాణించవల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. గతంలో తాలూకా కేంద్రంగా కొనసాగిన మోత్కూరు మండలాన్ని రెవిన్యూ డివిజన్ ఏర్పాటు చేసినట్లయితే మోత్కూరు ఆత్మకూరు (ఎం) గుండాల, అడ్డగూడూరు, మోటకొండూరుతో పాటు అవసరమైతే నూతనంగా ఏర్పాటు కానున్న వేములకొండ మండలాన్ని కలిపి ఏర్పాటు కృషి చేయాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. సానుకూలంగా స్పందించి, రెవిన్యూ డివిజన్‌కై నా వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు సూధగాని పాండు, పల్లెపంగ నర్సింహ్మా, రమేష్ ,రామనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ విత్తనాలు అమ్మితే కఠినచర్యలు



**ప్రజాపక్షం/తుర్కపల్లి:** సీడ్ ఆక్ట్ ప్రకారమే విత్తన అమ్మకాలు జరగాలని, నిబంధనలు అతిక్రమిస్తే సంబంధిత ఫర్టిలైజర్ షాపులకు కఠిన చర్యలు తప్పవని జిల్లా అగ్రికల్చర్ అధికారి ఎడిఎ దేవ్ సింగ్ హెచ్చరించారు. విత్తన స్కోయర్డ్ టీమ్ ఆకస్మిక తనిఖీల్లో భాగంగా తుర్కపల్లి, ఇబ్రాహింపురం, దత్తాయపల్లి, మాదాపూర్ గ్రామాల్లో, తుర్కపల్లి, వలిగొండ, పోచంపల్లి మండల వ్యవసాయ అధికారుల ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. అందులో భాగంగా విత్తన కొనుగోలు ఎంఎస్‌పి ధర మించకూడదని,కొనుగోలు చేసిన రైతుకు బిల్లు తప్పనిసరిగా అందచేయాలని విత్తన డీలర్లను ఆదేశించారు. రైతులకు కల్తీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# ప్రతి అర్జీని సత్వరమే పరిష్కరించాలి

### కలెక్టర్ దాసరి చందన





**ప్రజాపక్షం/నల్లగొండ :** ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దాసరి చందన జిల్లా అధికారులను ఆదేశించారు. పార్లమెంటు ఎన్నికలు, నల్లగొండ, ఖమ్మం, వరంగల్ శాసన మండలి పట్టభద్రుల ఉప ఎన్నికల అనంతరం తిరిగి సోమవారం ప్రారంభమైన ప్రజావాణి కార్యక్రమంలో ఆమె ప్రజల వద్ద నుండి వారి సమస్యలపై దరఖాస్తులను స్వీకరించారు. రెండున్నర నెలల తర్వాత తిరిగి నిర్వహించిన ఈ ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా కలెక్టరేట్‌కు పెద్దఎత్తున దరఖాస్తుదారులు వచ్చి వారి సమస్యలపై జిల్లా కలెక్టర్‌కు, అధికారులకు దరఖాస్తులు సమర్పించారు. ఈ సందర్భంగా ఫిర్యాదులను స్వీకరిస్తూ జిల్లా కలెక్టర్ జిల్లా అధికారులతో మాట్లాడుతూ కొన్ని ఫిర్యాదులకు అక్కడికక్కడే అధికారులను తన వద్దకు పిలిపించుకొని పరిష్కార మార్గం చేయగా, మరికొన్ని పరిశీలించి విచారణ చేసి పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లా కేంద్రంతో పాటు, డివిజన్, మండల స్థాయిలో వచ్చే దరఖాస్తులను సైతం ఇలాగే పరిష్కరించాలని, ఆ విధంగా అన్ని స్థాయిలలో అధికారులు పనిచేయాలని కోరారు. దరఖాస్తుదారులు సమర్పించిన ఫిర్యాదుల పరిష్కారం గురించి ఫిర్యాదుదారులకు తెలియజేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ టి.పూర్ణచంద్ర, డిఆర్‌ఓ రాజ్యలక్ష్మి తో పాటు, జిల్లా అధికారులు ప్రజల వద్ద నుండి ఫిర్యాదులను స్వీకరించారు.

**దరఖాస్తులను జాగ్రత్తగా పరిశీలించాలి : వెంకట్రావ్**

**సూర్యాపేట కలెక్టరేట్:** గ్రీవెన్స్‌లో స్వీకరించిన ప్రతి అర్జీని పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్ వెంకట్రావ్ అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావాణిలో ప్రజల నుండి స్వీకరించిన ప్రతి దరఖాస్తును అధికారులు జాగ్రత్తగా పరిశీలించి వాటిని సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. సూర్యాపేట పట్టణం లో ని ఇందిరమ్మ మూడవ విడత, కేసారంలోని డబుల్ బెడ్ రూం ఇండ్ల పట్టాలు పొందిన లబ్దిదారులకు ఇళ్లను అ ప్పగించేందుకు 10టీంలను ఏర్పాటు చేసి అప్పగించాల ని సూర్యాపేట ఆర్‌డిఓ వేణుమాధవ్‌ను సూచించారు. 12న పాఠశాలలు పునఃప్రారంభం సందర్భంగా పనులు పూర్తి అయిన అమ్మ ఆదర్శ పాఠశాలలను స్థానిక ఎమ్మెల్యేలచే ప్రారంభోత్సవాలు చేసి విద్యార్థులకు ఏకరూప దుస్తులు, పుస్తకాలు పంపిణీ చేయాలన్నారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిలో అన్ని శాఖల అధికారు లు తప్పకుండా హాజరు కావాలని ఆదేశించారు. ప్రజావాణిలో ఎక్కువగా భూ సమస్యలకు సంబంధించి 36 దరఖాస్తులు రాగా ఇతర శాఖల నుండి 32 వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎఫ్‌ఓ సతీష్ కుమార్, జెడ్‌పి సిఇఓ అప్పారావు, డిఆర్‌డిఓ మధుసూదన్ రాజు, జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్, డిపిఓ సురేష్ కుమార్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీధర్ రెడ్డి, డిఎంహెచ్‌ఓ కోటాచలం, డిటిడిఓ శంకర్, డిడ్ల్యూఓ వెంకట రమణ, ఏఓ సుదర్శన్ రెడ్డి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## శాంతిభద్రతలు కాపాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

### ఎస్‌పి రాహుల్ హెగ్డే



**ప్రజాపక్షం/సూర్యాపేట:** జిల్లాలో శాంతి భద్రతలను కాపాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి పోలీస్ అధికారులు కృషి చేయాలని జిల్లా ఎస్‌పి రాహుల్ హెగ్డే అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదారుల నుండి 12 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావాణిలో స్వీకరించిన ఫిర్యాదులపై ఆయా పోలీస్ స్టేషన్‌ల అధికారులతో మాట్లాడి వాటిని సత్వరమే పరిష్కరించి బాధితులకు భరోసా కల్పించాలన్నారు. పోలీసు పరిధిలోని ప్రతి అంశాన్ని చట్ట పరిధిలో పరిష్కరించడంతో పాటు బాధితులకు న్యాయం చేయడంలో వేగంగా చర్యలు తీసుకోవాలన్నారు. తమకు ఆన్‌లైన్ ద్వారా బహుమతులు వచ్చాయని అపరిచిత వ్యక్తుల నుండి ఫోన్‌కాల్ వస్తే తమ వ్యక్తిగత వివరాలను చెప్పవద్దన్నారు. సైబర్ నేరగాళ్ల మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఫోన్‌కు వచ్చే ఓటిపి, పిన్ నెంబర్లను అపరిచిత వ్యక్తులకు చెప్పి ఆర్థికంగా నష్టపోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మెప్మా ఆర్పీల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తా



ఎమ్మెల్యే నలమాద పద్మావతిరెడ్డి



**ప్రజాపక్షం/కోదాడ:** మెప్మా ఆర్పీ సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకవెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సమక్షంలో మున్సిపాలిటి పరిధిలోని మెప్మా ఆర్పీలు కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘం ఐఎన్‌టియూసిలో చేరిన సందర్భంగా ఆమె స్పందించి మాట్లాడారు. సమస్యలు తన దృష్టికి తేవాలని, ఐఎన్‌యూసి సంఘ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో టిపిసిసి ప్రతినిధి చింతకుంట్ల లక్ష్మీ నారాయణరెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ సామినేని ప్రమీలరమేష్, వైస్ చైర్మన్ కందుల కోటేశ్వరరావు, మాజీ సర్పంచ్ పార సీతయ్య, వార్డు కౌన్సిలర్ గంధం యాదగిరి, స్వామి నాయక్, సైదానాయక్, సంఘ అధ్యక్షురాలు షేక్ పర్వీన్; ఉపాధ్యక్షురాలు పొక్కుల నాగమణి,కార్యదర్శి ఎగ్గడి మాధవి, సహాయ కార్యదర్శి షేక్ హసీనసూరి, కోశాధికారి తేజావత్ ధనలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

**కోదాడ వాసులు సినీరంగంలో రాణించడం అభినందనీయం**

సందేశాత్మక చిత్రాలతో కోదాడ వాసులు సినీరంగంలో రాణించడం అభినందనీయమని ఎమ్మెల్యే నలమాద పద్మావతిరెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని శ్రీ రాఘవేంద్రస్వామి ఆర్ట్ క్రియేషన్ బ్యానర్‌పై నిర్మాతలు బుడిగం నరేష్, రుద్దనేని శ్రీనివాస్‌లు సర్కార్‌శివ టైటిల్‌తో నిర్మిస్తున్న చిత్రం షూటింగ్‌ను క్లాప్ కొట్టి ప్రారంభించారు. నిర్మాతగా, నటుడిగా బుడిగం నరేష్ మంచి చిత్రాలతో సినీరంగంలో పేరు తెచ్చుకోవాలని కోరారు. కోదాడ నుండి సినీ రంగంలో రాణించడానికి కృషిచేస్తున్న నిర్మాతలు, దర్శకులు, నటులు, కళాకారులకు తనవంతు సహకారం అందిస్తామన్నారు. సర్కార్ శివ చిత్రం విశేష ప్రేక్షక ఆదరణ పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో దర్శకుడు కాసాని శివ,నటీనటులు బుడిగం నరేష్,ప్రభాకర్ రావు,ఓరుగంటి శ్రీనివాస్‌రెడ్డి, హీరోయిన్ శృతి, సైదులు, కమతం వెంకటయ్య,చిత్రం యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.

## చట్టబద్ధతకు ఆర్‌ఎంపిల నిరసన



**ప్రజాపక్షం/ శాలిగౌరారం :** గ్రామీణ ప్రాంతాలలోని ప్రజల కు నిరంతరం అందుబాటులో ఉండి వైద్య సేవలు అందిస్తున్న ఆర్‌ఎంపిలకు ప్రభుత్వ పరంగా చట్టబద్ధత కల్పించాలని శాలిగౌరారం మండల కేంద్రంలో గ్రామీణ వైద్యులు నిరసన వ్య క్తం చేశారు.ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ చట్టబద్ధత కల్పించకుండా ప్ర భుత్వపరంగా తమపై జరుగుతున్న దాడులను ఆపేసి ప్రభుత్వ గుర్తింపునివ్వాలని, రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఆర్‌ఎంపిలకు ప్యారామెడిక ల్ శిక్షణ ఇప్పించి చట్టబద్ధత కలిపించే సమయంలో రాజశేఖ ర్‌రెడ్డి మరణించడం దురదృష్టకరమని ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభు త్వం గ్రామీణ వైద్యుల పట్ల సానుకూలంగా వ్యవహరించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం సుశ్రుత గ్రామీణ వైద్యుల జిల్లా కమిటీ పిలుపు మేరకు శాలిగౌరారం మండల గ్రామీణ వైద్యులు నల్లగొండ జిల్లా వైద్యుల భవన్ బయలుదేరి అ క్కడి నుండి కలెక్టరేట్ ముట్టడికీ బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ వైద్యుల జిల్లా కమిటీ సభ్యుడు వీపూరి పరాంకుశం, గౌరవ అధ్యక్షుడు దునక వెం కన్న , బండారు ధనుంజయ, మాదు వెంకన్న, అశోకా చారి, దామెర్ల శ్రీనివాస్, జెబ్బార్, దొనకొండ అంజయ్య, స్వామి, వీరాచారి,అశోక్ పాల్గొన్నారు.

## డిసిసిబి చైర్మన్ గొంగిడిపై అవిశ్వాసం

### క్యాంపుకెళ్లిన 14 మంది డైరెక్టర్లు



**ప్రజాపక్షం/నల్లగొండ ప్రతినిధి :** డిసిసిబి చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డిపై అవిశ్వాసం.. క్యాంపుకెళ్లిన 14 మంది డైరెక్టర్లు.. బిఆర్ఎస్‌లో గెలిచి కాంగ్రెస్‌లోకి వెళ్లినవారంతా మహేందర్‌రెడ్డికి వ్యతిరేకంగా సంతకాలు.. నల్లగొండ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డిపై అవిశ్వాస తీర్మాణానికి డైరెక్టర్లు తెరలేపి జిల్లా సహకార శాఖ అధికారి కిరణ్‌కు అవిశ్వాసం లేఖను అందజేశారు. డిసిసిబి డైరెక్టర్ మునుగోడు పిఎసిఎస్ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి నేతృత్వంలో ఉపాధ్యక్షులు ఏసిరెడ్డి దయాకర్‌రెడ్డి మినహా మిగతా 14 మంది డైరెక్టర్లు చైర్మన్ మహేందర్‌రెడ్డికి వ్యతిరేకంగా అవిశ్వాసానికి మద్దతు పలికారు. అయితే గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో డిసిసిబి చైర్మన్‌గా మ హేందర్‌రెడ్డి తన పార్టీ డైరెక్టర్లతో కలిసి బాధ్యతలు చేపట్టారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బిఆర్ఎస్ ప్రభుత్వం పడిపోవడం కాంగ్రెస్ పార్టీ గెలువడంతో బిఆర్ఎస్‌కు చెందిన పిఎసిఎస్ చైర్మ న్లు, డైరెక్టర్లు చాలామంది బిఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. అయితే గత కొంత కాలంగా డిసిసిబి చైర్మన్ స్థానాన్ని కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోవాలనే ఆలోచనతో ప్రస్తుతం చైర్మన్‌గా ఉన్న మహేందర్‌రెడ్డిపై అవిశ్వాసానికి తెరలేపారు. మహేందర్‌రెడ్డిపై డైరెక్టర్లు ఇచ్చిన అవిశ్వాస తీర్మాణంపై ఈ నెల 12న జనరల్ బాడీ సమావేశం నిర్వహించి అవిశ్వాసాన్ని నిర్వహించేందుకు జిల్లా సహకార శాఖ అధికారి గడవు ఇవ్వడం జరిగింది. అవిశ్వాసం తీర్మాణం చేసినవారిలో డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డితో పాటు గుడిపాటి సైదులు, ధనావత్ జయరామ్, కోడి సుష్మ, పాశం సంపత్ రెడ్డి, అందెల లింగం యాదవ్, ఇరిగినేని అంజయ్య, బొంత శ్రీనివాస్, కొండ సైదయ్య, ఎస్.అనురాధ, జూలూరి శ్రీనివాస్, కె.వీరస్వామి, కొమ్ము కరుణ, యం.రాంచంద్రయ్యలున్నారు.

## శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తీసుకోండి

### దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్



**ప్రజాపక్షం/దేవరకొండ :** దేవరకొండ నియోజకవర్గంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని శాంతిని నెలకొల్పాలని దేవరకొండ ఎంఎల్‌ఏ నేనావత్ బాలునాయక్ పోలీసులకు సూచించారు. సోమవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో పోలీస్ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. పట్టణంలో దొంగతనాలను అరికట్టుటకు యువత గంజాయి, ఇతర మత్తు మాదక ద్రవ్యాలను సరఫరా, వాటిని వినియోగించే వారిపై ఉక్కుపాదం మోపాలని సూచించారు. నేరస్తుల పట్ల కఠినంగా ఉంటూ, సాధారణ ప్రజలకు అందుబాటులో ఉండి న్యాయం జరిగేలా చూడాలని పోలీసు అధికారులకు ఎంఎల్‌ఏ సూచించారు. సమావేశంలో డిఎస్పి గిరిబాబు, డిండి, దేవరకొండ, మల్లేపల్లి సర్కిల్ సిఐలు నర్సింహులు, సురేష్, ధనుంజయ్, ఎస్‌ఐలు సైదులు, యాదయ్య, సతీష్, రాజు, సైదులు, రామ్మూర్తి లు పాల్గొన్నారు.

## నూతన చట్టాలపై పోలీస్ సిబ్బందికి శిక్షణ




**ప్రజాపక్షం/సూర్యాపేట:** నూతన చట్టాలపై ప్రతి పోలీస్ అధికారి, సిబ్బంది అవగాహన కలిగి ఉం డాలని జిల్లా ఎస్‌పి రాహుల్ హెగ్డే అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నూతన చ ట్టాలపై పోలీస్ సిబ్బందికి గత వారం రోజులుగా సీనియర్ హైకోర్టు అడ్వకేట్, టిఎస్ పోలీస్ అకాడ మి అధ్యాపకులు డాక్టర్ సాంబమూర్తిచే విడతల వారిగా శిక్షణ ఇస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన చట్టాలు అమలు చేయడానికి ప్రతి అంశంపై సిబ్బందికి అవగాహన, నైపుణ్యం ఉన్నప్పుడే చట్టాలను అమలు చేయగలుగుతారన్నారు. ఈ శిక్షణను పోలీస్ అధికారులు, సిబ్బంది షెడ్యూల్ ప్రకారం హాజరై సద్వినియో గం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అదన పు ఎస్‌పి నాగేశ్వర్ రావు, పోలీస్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆరంతస్తులకు అనుమతి ఏదీ?

### పట్టింపులేని టౌన్‌ప్లానింగ్ అధికారులు
### లక్షల్లో ప్రభుత్వ ఆదాయానికి గండి




**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** అది కరీంనగర్ నుంచి సిరిసిల్ల వెళ్లే ప్రధాన రహదారి..కరీంనగర్ శివారు పద్మనగర్‌లో హంగు ఆర్భాటాలతో ఓ పేరున్న ఆరంతస్తుల పాఠశాల దర్శనమిస్తుంది. అంత పేరున్న ఆ పాఠశాల భవనానికి అసలు అనుమతులే లేవట!. అట్టి ఇంటి నెంబర్ 262/3/2 లో 999 చదరపు అడుగుల గృహ నిర్మాణానికి అనుమతులు పొందారు. కాగా సుమారు లక్ష చదరపు అడుగుల ఆరు అంతస్తుల భవన సముదాయం అక్కడ దర్శనమిస్తుంది. ఇవన్నీ తెలిసి చర్యలు తీసుకోవాల్సిన కరీంనగర్ టౌన్‌ప్లానింగ్ అధికారులు అటు వైపు కన్నెత్తి చూడకపోవడం విడ్డూరం. ఈ భవనానికి సరైన అనుమతులు లేవని సమాచార హక్కు చట్టం ద్వారా వెలుగులోకి రావడం, ఈ విషయంపై ఫిర్యాదుతో కలెక్టర్ స్పందించి చర్యలు తీసుకోవాలని టౌన్‌ప్లానింగ్ అధికారులకు ఆదేశాలు జారీ చేసినప్పటికీ సంబంధిత అధికారులు గత సంవత్సరం కాలంగా వారి ఆదేశాలను బేఖాతరు చేస్తున్నారు. ప్రభుత్వ ఆదాయానికి లక్షల్లో గండిపడుతున్నా ఇప్పటి వరకు కనీస చర్యలు తీసుకోకుండా మీనమేషాలు లెక్కిస్తుండడంపై అధికారుల చిత్తశుద్ధిని శంకిస్తోంది.

కరీంనగర్ జిల్లా కేంద్ర శివారు పద్మనగర్‌లో ఆరంతస్తుల భవనంలో ఓ పేరున్న పాఠశాల స్టేట్ సిలబస్, సిబిఎస్‌ఈ సిలబస్‌తో నిర్వహణ కొనసాగిస్తున్నారు. పాఠశాల నిర్వహణకు ఒకటి నుంచి పదవ తరగతి వరకు ప్రభుత్వ అనుమతి పొందాలంటే సుమారుగా 20 గదులు ఉండాలి. అదనపు సెక్షన్లు ఉంటే సంఖ్య పెరుగుతూ ఉంటుంది. అంటే సుమారుగా 20 వేల చదరపు అడుగుల పైచిలుకు భవన సదుపాయం అవసరముంటుంది. సిబిఎస్‌ఈకి సైతం మరో 20 వేల అడుగుల పైచిలుకు భవన సదుపాయం కలిగి ఉండాలి. అయితే ఈ పేరున్న పాఠశాల నిర్వహణకు కొనసాగిస్తున్న ఇంటి నెం. 261/3/2 లో నగరపాలక సంస్థ ఆస్తిపన్ను విభాగంలో కేవలం 999 చదరపు అడుగుల భవన నిర్మాణానికి పన్ను చెల్లిస్తున్నట్లుగా అనుమతి పొందడం విశేషం. అందులోనూ పాఠశాల నిర్వహణకు కాకుండా గృహావసరానికి పన్ను చెల్లిస్తుండం కొసమెరుపు.

**కలెక్టర్ ఆదేశాలు బేఖాతరు**

పద్మనగర్‌లోని ఆరు అంతస్తుల భవనానికి సరైన అనుమతులు లేవని సమాచార హక్కు చట్టం ద్వారా యువజన సమితి రాష్ట్ర కార్యదర్శి మోరె గణేష్ సమాచారాన్ని సేకరించి ప్రజావాణిలో గత జిల్లా కలెక్టర్ గోపికి ఫిర్యాదు చేశారు. పూర్తి ఆధారాలతో ఫిర్యాదు చేయగా కలెక్టర్ స్పందించి చర్యలు తీసుకోవాలని కరీంనగర్ టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. కానీ ఈ విషయంలో సంబంధిత అధికారులు చర్యలు తీసుకోకుండా దాటవేస్తున్నారు. సంబంధిత ఆరంతస్తుల భవనానికి షోకాజ్ జారీ చేస్తున్నట్లు చెబుతూనే చర్యలకు వెనుకడుగు వేస్తున్నారు. సంబంధిత యజమాని హియరింగ్‌కు రావాల్సి ఉన్నా హాజరు కాలేదు. షోకాజ్ జారీ చేసిన ఏడు రోజుల్లో చర్యలు తీసుకోవాల్సిన అధికారులు యేడాదికాలంగా చర్యలు తీసుకోకపోవడం వెనుక మర్మమేమిటనేది అంతుపట్టని ప్రశ్నగా మిగిలింది. పాఠశాల నిర్వహణ కోసం భవన సముదాయానికి యేడాదికి లక్షల్లో పన్ను చెల్లించాల్సి ఉండగా అందుకు విరుద్ధంగా కేవలం సంవత్సరానికి రూ. 33312 పన్ను చెల్లిస్తుండడంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది.

**ప్రజావాణిలో ఫిర్యాదులపై స్పందనేదీ?**

ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణిలో సత్వర పరిష్కారం లభిస్తుందని ప్రజలు సుదూర ప్రాంతాల నుంచి వచ్చి తమ గోడు వెల్లబోసుకుంటున్నారు. గత సంవత్సర కాలంగా ఆరంతస్తుల భవనానికి సరైన అనుమతులు లేవని ఆరు పర్యాయాలుగా ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్నా జిల్లా కలెక్టర్, అడిషినల్ కలెక్టర్‌లు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశిస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో అవి కాగితాలకే పరిమితమవుండడం టౌన్ ప్లానింగ్ అధికారుల నిబద్ధతను ప్రశ్నిస్తోంది. ఇదే టౌన్ ప్లానింగ్ అధికారులు సామాన్యుల విషయంలో ఫిర్యాదుల లేకున్నప్పటికీ తమ విచక్షణ అధికారాలను ఉపయోగించి నిర్మాణంలోనే ఉండగా ఇండ్లను కూలగొట్టిన సంధర్భాలున్నాయి. అయితే షోకాజ్ నోటీసు ఇచ్చామని చెబుతున్న టౌన్‌ప్లానింగ్ అధికారులను అట్టి వివరాలు అడిగితే ప్రస్తుతానికి ఫైలు అందుబాటులో లేదని చెప్పడం కొసమెరుపు.

**చర్యలు తీసుకుంటాం : రాజ్‌కుమార్, టౌన్‌ప్లానింగ్(టిపిఎస్)**

కరీంనగర్‌లోని పద్మనగర్‌లో ఇంటి నెం. 261/3/2 లోని ఆరు అంతస్తుల భవనానికి సరైన అనుమతి లేదంటూ వచ్చిన ఫిర్యాదుపై నాలుగు నెలల క్రితం షోకాజ్ నోటీసు జారీ చేయడం జరిగింది. హియరింగ్ పిలిస్తే సదరు యజమాని హాజరు కాలేదు. తప్పకుండా చర్యలు తీసుకుంటాం.

**ఆరు సార్లు ఫిర్యాదు చేశా.. : మోరె గణేష్, యువజన సమితి రాష్ట్ర కార్యదర్శి**

కరీంనగర్‌లోని పద్మనగర్‌లో ఇంటి నెం. 261/3/2 లోని ఆరు అంతస్తుల భవనానికి సరైన అనుమతి లేదని సమాచార హక్కు చట్టం ద్వారా తెలుసుకొని గత సంవత్సర కాలంగా ప్రజావాణిలో ఫిర్యాదులు చేస్తున్నా పట్టించుకోవడం లేదు. బిల్డింగ్ యాజమాన్యానికి మున్సిపల్ అధికారులు వత్తాసు పలుకుతూ నిర్లక్ష్యంగా వ్యవరించి ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు.

## నీట్ లీకేజీపై స్పందించరేమి?

**ప్రజాపక్షం/ వరంగల్ ప్రతినిధి :** దేశ వ్యాప్తగా ప్రభుత్వ మెడికల్ కళాశాలలో చదవడానికి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించిన నిట్ పరీక్ష ఫలితాలపై అనేక అనుమానాలు వెలువడుతున్న తరుణంలో పరీక్ష నిర్వహించిన తీరుపై కేంద్ర ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) జిల్లా ప్రధాన కార్యదర్శి లాద్యాల శరత్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దాదాపు దేశ వ్యాప్తంగా 24లక్షల మంది విద్యార్థులు పరీక్షను రాశారని, ప్రకటించిన ఫలితాల్లో అనేక అవకతవకలు జరిగాయని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారన్నారు.వారి అనుమానాలకు ప్రత్యక్ష సాక్షం ఆరుగురు విద్యార్థులకు 720మార్కులు రావడం, మరల వారి పరీక్ష కేంద్రం ఒకటే కావడం వలన వారి అనుమానాలు బలాన్నిస్తుందన్నారు. కావున తక్షణమే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ విడుదల చేసిన ఫలితాలపై కేంద్ర ప్రభుత్వం స్పందించి పరీక్ష రాసిన మెడికల్ విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత విద్యా సంవత్సరం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ విడుదల చేసిన ఫలితాలపై, పేపర్ లీకేజీలపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జిచే విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

## వైద్యుల నిర్లక్ష్యంపై ఆగ్రహం



**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి/స్టేషన్‌ఘనపూర్:** స్టేషన్‌ఘనపూర్ నియోజకవర్గ కేంద్రంలోని ప్రభుత్వ ఏరియా హాస్పటల్‌ను మాజీ ఉప ముఖ్యమంత్రి, ఎంఎల్ఎ కడియం శ్రీహరి సోమవారం అకస్మికంగా తనికీ చేశారు. ఎనిమిది మంది వైద్యులకు గాను ఐదుగురు మాత్రమే విధుల్లో ఉండడంతో డ్యూటి రిజిస్టర్‌ను పరిశీలించిన కడియం అగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాష షేక్‌తో ఫోన్‌లో మాట్లాడి విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన డాక్టర్లనై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. డిఎంహెచ్‌ఓకు సైతం ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. కడియం శ్రీహరి మాట్లాడుతూ వేతనాలు ఎక్కువైనా వైద్యుల్ని నియమించి సేవలు అందిస్తుంటే సమయ పాలన లేకుండా విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరియైంది కాదన్నారు. స్టేషన్‌ఘనపూర్ హాస్పటల్‌లో ఇప్పటికే డయాలసిస్ సెంటర్ లేదని, ప్రసూతి మహిళలకు ప్రత్యేక వార్డు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. 100 పండలక హాస్పటల్‌గా అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

## వైద్యులు అందుబాటులో ఉండాలి




**ప్రజాపక్షం/దుబ్బాక:** ప్రభుత్వ ఆస్పత్రికివచ్చే రోగులకు వైద్యాధికారులు అందుబాటులో ఉండి మెరుగైన వైద్యం అందించాలని దుబ్బాక ఎంఎల్‌ఎ కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం దుబ్బాకలోని వందపడకల ఆసుపత్రిలో రివ్యూ మీటింగ్‌కు ఎంఎల్ఎ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వచ్చే వర్షాకాలం కాబట్టి సీజనల్ వ్యాధులు రాకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఆసుపత్రిలో నిరంతరం వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలని సూచించారు. ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్పోరేట్ తరహాలో మంచి వైద్యాన్ని అందిస్తున్న డాక్టర్ హేమరాజ్ సింగ్ , సిబ్బందికి ఎమ్మెల్యే అభినందించారు. డిఎంహెచ్‌వో శ్రీనివాస్, డాక్టర్ కాశినాథ్, దుబ్బాక మున్సిపాలిటి చైర్ పర్సన్ గన్నె వనితభూంరెడ్డి, ఎంపీపీ కొత్త పుష్పలత, జడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

## బల్దియాలో 58 దరఖాస్తులు

**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** ప్రజావాణి కార్యక్రమాన్ని పురస్కరించుకొని సోమవారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అదనపు కమిషనర్ అనిసుర్ రషీద్‌తో పాటు బల్దియాకు చెందిన వివిధ విభాగాల ఉన్నతాధికారులు హాజరై ప్రజల నుండి వినతులను స్వీకరించి పరిష్కార నిమిత్తం ఆయా విభాగాలకు చెందిన అధికారులకు అందజేశారు. ఫిర్యాదుల వివరాలు విభాగాల వారిగా ఇంజనీరింగ్ 22, హెల్త్, సానిటేషన్ 6, ప్రాపర్టీ ట్యాక్స్ 2, టౌన్ ప్లానింగ్ 28, మొత్తం 58 దరఖాస్తులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో ఎస్ఈ కృష్ణారావు, సిఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్, బయాలజిస్ట్ మాధవరెడ్డి, హెచ్ఓ రమేష్, డిప్యూటీ కమిషనర్ కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరి



**ప్రజాపక్షం/ములుగు జిల్లా ప్రతినిధి:** అమ్మ ఆదర్శ పాఠశాల అభివృద్ధి పనులను జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు పి శ్రీజ క్షేత్రస్థాయిలో పరిశీలించి నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ పూర్తి చేయాలన్నారు. సోమవారం జిల్లా అదనపు కలెక్టర్ తాడ్వాయి మండలం ఇందిరానగర్, కామారం పిటి, రెడ్డిగూడెం గ్రామాలలోని ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న అమ్మ ఆదర్శ పాఠశాల అభివృద్ధి పనులనుపరిశీలించారు.అదనపు కలెక్టర్ మాట్లాడుతూ విద్యా సంవత్సరంలో తరగతులు పునః ప్రారంభం అయ్యేలోపు నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ పనులుపూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లా విద్యాశాఖ అధికారి పాణిని, మండల ప్రత్యేకాధికారి అలెం అప్పయ్య, సమగ్ర శిక్షణ అభియాన్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు వేగవంతం

**ప్రజాపక్షం/ములుగు జిల్లా ప్రతినిధి:** సిఎంఆర్ ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ హహేందర్ జి, సివిల్ సప్లయి మేనేజర్ బి రాంపతిలతో కలిసి జిల్లాలోని మిల్లర్ల యజమానులతో సమావేశాన్ని నిర్వహించారు. జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ సిఎంఆర్ ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని మిల్లర్ల యజమానులకు సూచించారు. ధాన్యం కొనుగోలు విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చివరి గింజ వరకు కొనుగోలు చేయాలని, మిల్లర్లు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు ఖాయమని హెచ్చరించారు.

## గిరిజన విద్యార్థులకు ర్యాంకులు

**ప్రజాపక్షం/ములుగు జిల్లా ప్రతినిధి:** నీట్‌లో ములుగు జిల్లా అన్నంపల్లి గ్రామంలోని ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు గిరిజన విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చాటారు. పోరిక సభాపతి సౌరబ్ అభయనంద్ 498 మార్కులు జాతీయ కేటగిరి ర్యాంక్ 3033, పోరిక సూరజ్ 473 మార్కులు, జాతీయ క్యాటగిరిలో 4174 ర్యాంకులు సాధించారు. పోరిక సభపతి సౌరభ్, అభయనంద్ తండ్రి పోరిక జయరాం ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా, అలాగే పోరిక సూరజ్ తండ్రి కోర్టు ఉద్యోగం చేస్తున్నారు. వీరిద్దరు అన్నదమ్ములు కావడం విశేషం.

# రైల్వే కోసం భూసేకరణ

### సిద్దిపేట జిల్లా కలెక్టర్ మనుచౌదరి



**ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి :** రైల్వే నిర్మాణానికి అవసరమైన భూసేకరణ త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ మనుచౌదరి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో మిని కాన్ఫరెన్స్‌హాల్‌లో రెవెన్యూ, రైల్వేశాఖ అధికారులతో సమావేశం నిర్వహించి మనోహరబాద్ కొత్తపల్లి రైల్వేలైన్ నిర్మాణంలో భాగంగా చిన్నకోదురు, నారాయణరావుపేట మండలాల్లో పెండింగ్‌లో ఉన్న భూసేకరణపై సమీక్షించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ చిన్నకోదురు మండలంలో పెద్దకోదురు,చిన్నకోదురు,మాచాపూర్,గంగాపూర్,వితలాపూర్ గ్రామాలు,నారాయణరావుపేటమండలంలో జక్కాపూర్ గ్రామా ల్లో 25 ఎకరాల 30 గుంటల భూమి ఇంకారైల్వే నిర్మాణానికి సేకరించాల్సి ఉన్నందున అయా మండల తహశీల్దార్లు, సిద్దిపేట ఆర్డీఓ ప్రత్యేక శ్రద్ద చూపి త్వరగా భూసేకరణ చేసి రైల్వే అధికారులకు, రైల్వే నిర్మాణం కోసం అందించాలని ఆదేశించారు. జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీఓ సదానందం, రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజనీర్ జనార్దన్, సిద్దిపేట అర్బన్, నారాయణరావుపేట, చిన్నకోదూరు తహశీల్దార్లు పాల్గొన్నారు.

**శిశుమరణాలు నియంత్రణకు కృషి**

జిల్లాలో శిశుమరణాలు సంభవించకుండ అంకిత భావంతో విధులు నిర్వహించాలని కలెక్టర్ మనుచౌదరి ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత కలెక్టరేట్‌లో చైల్డ్ డెత్ రివ్యూ కమిటి సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో జనవరి2024 నుండి మార్చి 2024 వరకు మూడు నెలల్లో 33 మంది శిశుమరణాలు సంభవించటంపై కలెక్టర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఇకనుండి జిల్లాలో శిశు మరణాలు సంభవించకుండ వైద్యాధికారులు అప్రమత్తంగా ఉండి అంకితభావంతో విధులు నిర్వహించాలన్నారు. ప్రోగ్రాం ఆఫీసర్ పిఓ సిహెచ్ఐ డాక్టర్ విజయరాణి, జిల్లా ఆసుపత్రి పిడియాట్రిక్ వేణు, వైద్యులు అంజలి, శ్రీనివాస్, ప్రభాకర్, రజని తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల సంఖ్య పెంచండి

### జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు

**ప్రజాపక్షం/ సంగారెడ్డిప్రతినిధిః** పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచేందుకే బడి బాట చేపట్టామని కలెక్టర్ క్రాంతి వల్లూరు అన్నారు. బడిబాటలో హాస్టల్ గడ్డ ప్రాథమిక పాఠశాల ఉర్దూ మీడియం పాఠశాల ఇస్మాయిల్‌ఖాన్‌పేట ,ఉన్నత పాఠశాల తనిఖీ సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి ప్రభుత్వం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహస్తున్నదని, ఉపాద్యాయులు అధికారులు ప్రజాప్రతినిధులు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. సోమవారం సంగారెడ్డిలోని హస్టల్ గడ్డ ప్రాథమిక పాఠశాల ఉర్దూ ప్రాథమిక పాఠశాలను చింతల పల్లి ప్రాథమిక పాఠశాలను ,ఇస్మాయిల్ ఖాన్ పేటట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను పరిశీలించారు. ఇస్మాయిల్ ఖాన్ పేట జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో కలెక్టర్ మాట్లాడుతూ పిల్లలకు అందించేది అన్నిటి కంటే ముఖ్యమైనది చదువేనన్నారు.తల్లులకే పిల్లల చదువుపై మక్కువ ఉంటుందన్నారు. ఇంతకు ముందు ఇదే పాఠశాలల్లో చదివిన పిల్లల తల్లిదండ్రులను కలిసి టీచర్స్ కమిటీ సభ్యులు కలిసి ఇంటింటికి తిరిగ బడి ఈడు పిల్లలను చేర్పించాలన్నారు.

## పలు సమస్యలపై 21 దరఖాస్తులు



**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి :** వివిధ సమస్యలపై ప్రజావాణిలో వచ్చే ఆర్జీలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదేశించారు. ఎన్నికల సందర్భంగా ప్రజావాణి నిలిపివేయగా సోమవారం మళ్లీ ప్రారంభించారు. వివిధ సమస్యలపై 21 ధరఖాస్తులు రాగా వాటిని పరిశీలించారు. అడవికేశ్వాపూర్ గ్రామానికి చెందిన బి అరున్‌కుమార్ నకిలీ ధృవ పత్రం జారీ చేసిన దానిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరగా కలెక్టర్ విచారణకు ఆదేశించారు.స్టేషన్‌ఘనపూర్ మండలం రాఘవాపూర్ గ్రామానికి చెందిన సింగపురంరాజు తన తండ్రి పేరిట ఉన్న భూమి రికార్డుల్లో నమోదు చేయడం గురించి ధరఖాస్తు చేయగా పరిశీలిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. జఫర్‌గడ్ మండలం ఉప్పులగల్లు గ్రామానికి చెందిన వెన్న కళావతి తన ఇంటి స్థలం విషయమై విజ్ఞప్తి చేశారు. డిప్యూటి కలెక్టర్ సుహాసిని, డిఈఓ రాము, జిల్లా పౌరసంబందాల అధికారి రోజారాణి, డిడబ్ల్యూజయంతి, ఏడిఎ వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

**తాత్కాలికంగా ఇసుక తీత నిలిపివేత**

జనగామ జిల్లా దేవరప్పుల మండలంలోని వాగులోని నుండి అక్రమ ఇసుక రవాణాపై ఆ మండల రైతులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దేవాదుల ఎత్తిపోతల పథకం పాలకుర్తి రిజర్వాయర్ నిర్మాణం పేరుతో అక్రమంగా ఇసుక రవాణా జరుగుతుందని తెలపడంతో తాత్కాలికంగా ఇసుక తీతను నిలిపివేయాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ మాట్లాడుతూ భూగర్భ జలాలు పడిపోకుండా పంటలకు నష్టం వాటిల్లకుండా ఉండేందుకు అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్, ఆర్‌డిఓ కొరయ్య, వ్యవసాయ శాఖ అధికారి వినోద్‌కుమార్ నీటిపారుదల, భూగర్భ జలవనరుల శాఖ పర్యటించి నివేధిక అందజేస్తాయన్నారు. అప్పటి వరకు ఇసుక తరలింపు నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

## భూసర్వే, రికార్డులపై వినతుల వెల్లువ



**ప్రజాపక్షం/హన్మకొండ ప్రతినిధి :** ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి వచ్చిన సమస్యలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి త్వరిత గతిన పరిష్కారం చూపాలని హన్మకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులను ఆదేశించారు. సోమవారం హన్మకొండ కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోనివివిధ ప్రాంతాలకు చెందిన ప్రజల దరఖాస్తులను స్వీకరించారు. మొత్తం 111 దరఖాస్తులు స్వీకరించగా మున్సిపల్ శాఖకు 17, భూ సర్వే 2, డీఈఓ 5, మెడికల్ 2, జిల్లా పంచాయతీ రాజ్ 3, ఎస్సీ అభివృద్ధి 01, ఆర్‌డీఓ 06, ఎంజీఎం 03,ధర్మసాగర్, కాజీపేట తహశీల్దార్ చెరో 05, రెసిడెన్షియల్ ఆర్‌సిఒ 02 దరఖాస్తులు రాగా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, డిఆర్ఓ వైవి గణేష్, డిఆర్‌డిఓ పిడి పద్మజతో కలిసి కలెక్టర్ ధరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా హన్మకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారుముఖ్యంగా మున్సిపల్, భూ సర్వే, ల్యాండ్ రికార్డులు, మెడికల్, హెల్త్ పరిధిలో వచ్చిన అన్ని సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని, వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఓ నాగ పద్మజ, జిల్లా వైద్యాధికారి సాంబశివ రావు,జడ్పీ సీఈఓ వేదావతి, పరిశ్రమల ఎండి హరి ప్రసాద్, సివిల్ సప్లై ఇంచార్జ్ నర్సింహారావు, ఐ అండ్ పిఆర్ డీఈ భూపాల్ రెడ్డి, ఎడ్యుకేషన్ సూపరింటెంట్ శ్రీనివాస్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## కార్మిక వెల్ఫేర్‌బోర్డు చైర్మన్‌ను నియమించరూ..



**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి :** భవన నిర్మాణ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఛైర్మన్ నియమించడంతో పాటు పాటు వృద్ధులకు పెన్షన్ ఏర్పాటు చేయాలని, బోగస్ కార్డులు రద్దు చేయాలని, భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం జనగామ జిల్లా అధ్యక్షులు వాతాల యాదగిరి, ప్రధాన కార్యదర్శి కొమ్మగల్ల కృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మీ సేవా సభ్యత్వం రద్దు చేయాలి, వేల్పేర్ బోర్డు నుండి బోగస్ కార్డులను రద్దు చేయాలి, వెల్పేర్ బోర్డు ఛైర్మన్‌ను నియమించాలి, వృద్ధులకు 5వేల పెన్షన్ ఇవ్వాలి, అవసరమైన వారికి 10లక్షల ద్విచక్రవాహనాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సోమవారం సంఘం కార్యాలయం నుండి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వయించారు. కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వయించి నిరసన తెలిపారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు వాతాల యాదగిరి, ప్రధాన కార్యదర్శి కొమ్మగళ్ల కృష్ణ మాట్లాడుతూ 2009 నుండి 14 వరకు లేబర్ డిపార్ట్‌మెంట్ నుండి సభ్యతాలు ఇవ్వడం ద్వారా కార్మికుల న్యాయం జరిగింది కానీ మీ సేవా సెంట్ల ద్వారా భవన నిర్మాణ కార్మికులు కాని వారికి సైతం ఇవ్వడం వలన నష్టం జరుగుతుందన్నారు. కొంత మంది బ్రోకర్లుగా మారి గ్రామాల్లో తెల్లరేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరి వద్ద డబ్బులు తీసుకొని ధరఖాస్తు చూస్తూ కార్డులు జారీ చేయిస్తున్నారన్నారు. దీని వలన అసలైన భవన నిర్మాణ కార్మికులకు నష్టం వాటిల్లుతుందన్నారు. సభత్యం పొందిన ఇతర వ్యక్తులు వందల కోట్ల రూపాయల లబ్ధి పొందారన్నారు. దీనికి ప్రధాన కారణం వేల్పేర్ బోర్డుకు ఛైర్మన్ లేకపోవడమే అన్నారు. అందుకే వెంటనే ఛైర్మన్ నియమించాలని కోరారు. చిన్నప్పటి నుండి వృద్ధులయ్యే వరకు భవన నిర్మాణ కార్మికులుగానే బతుకు బండిలాగిస్తున్నకార్మికులకు 60ఏండ్లు పైబడిన పెన్షన్లు రావడం లేదన్నారు. కోశాధికారి తూడి అంజయ్య, ఉపాధ్యక్షులు రామస్వామి, అనిల్‌కుమార్, ఎద్దు నాగయ్య, బిక్షపతి, నాగిళ్ల రాజు, గోడిశాల ఐలేష్, నల్ల లక్ష్మ య్య, బొమ్మెర్లయాకయ్య,రత్నం,కుంటిభీమయ్య పసుల వెంకటస్వామి, చింత శ్రీనివాస్, పిట్టల బాలక్రిష్ణ ఉన్నారు.

## గ్రీవెన్స్‌కు అపూర్వ స్పందన

### జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్

**ప్రజాపక్షం/మహబూబాబాద్ :** సోమవారం ప్రజల నుండి స్వీకరించిన గ్రీవెన్స్ దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ లోని ఐడిఓసి సమావేశ మందిరంలో నిర్వహించిన గ్రీవెన్స్ లో జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ తో పాటు అదనపు కలెక్టర్ లోకల్ బాడీ లెనిన్ వత్సల్ టోప్పో, అదనపు కలెక్టర్ రెవెన్యూ డేవిడ్ ల పాల్గొని ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించారు. ఈ రోజు నిర్వహించిన గ్రీవెన్స్ లో (113) దరఖాస్తులు వివిధ సమస్యల పైన వచ్చాయి. వచ్చిన దరఖాస్తులను పరిశీలించి సంబంధిత శాఖల అధికారులకు ఎండర్స్ చేసి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత జిల్లా అధికారులను ఆదేశించారు. ఈ గ్రీవెన్స్ లో సీఈఓ నర్మద, జిల్లా అధికారులు, మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పారదర్శకంగా ఇంటింటి సర్వే

### వరంగల్ జిల్లా కలెక్టర్ ప్రావిణ్య




**ప్రజాపక్షం/ వరంగల్ ప్రతినిధి :** జిల్లాలోని మిషన్‌భగీరథ నల్లా కనెక్షన్‌లపై ఇంటింటి సర్వే పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ప్రావిణ్య అన్నారు. సోమవారం ఎన్ఐటి దర్గా రోడ్డులోని డిఆర్‌డిఏ సమావేశ మందరింలో ఏర్పాటుచేసిన మోబైల్ అప్లికేషన్ శిక్షణ కార్యక్రమాన్ని ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. కలెక్టర్ ప్రావిణ్య మాట్లాడుతూ జల జీవన్ మిషన్‌ద్వారా సర్వే నిర్వహించడం జరుగుతుందని, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల అవసరాల మేరకు తాగునీటిని అందించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు తయారుచేస్తుందని, ప్రస్తుతం అందిస్తున్న మిషన్‌భగీరథ ద్వారా తాగునీరు సరిపోతుందా....? అధికంగా అవసరమవుతందా..? అనే విషయాలు తెలుసుకునేందుకు సర్వే చేపడుతున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాలలో ఎంపిడిఓలు, ఏపిఓలు, ఏపిఎంలు, టెక్నికల్ అసిస్టెంట్లు, పంచాయతీ సెక్రటరీ, ఈజీఎస్, సిసి ఐకేపిలను సర్వే అధికారులుగా నియమించడం జరిగిందన్నారు. జిల్లాలో మొత్తం 625 మంది సిబ్బందికి శిక్షణ ఇచ్చామని, 323 జిపిలు, సుమారు 123894 ఈ సర్వే ద్వారా జిల్లాలో మిషన్ భగీరథ నల్లా కనెక్షన్లు ఎన్ని, నీరు వస్తుందా లేదా వివరాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించాలని, సిబ్బంది ప్రతి ఇంటింటికి వెళ్లి నల్లా కనెక్షన్లు ఎన్ని, నీరు వస్తుందా... లేదా అనే వివరాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించాలన్నారు. సిబ్బంది డిఆర్‌డిఓ కౌసల్యదేవి, జడ్పిసిఈఓ, ఇన్‌చార్జీ డిపిఓ రామిరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ వెంకటరమణ, ఎంపిఓలు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

**బడిబాటను విజయవంతం చేయాలి**

**వరంగల్ ప్రతినిధి :**బడిఈడు పిల్లలందరిని బడిలో చేర్పించాలనే సంకల్పంతో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని ఈనెల 6 నుండి 19 వరకు నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వరంగల్ జిల్లా కలెక్టర్ ప్రావిణ్య తెలిపారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో విద్యాశాఖ ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమ గోడ పత్రికలను ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా బాల కార్మికులు, బడిఈడు పిల్లలు పాఠశాలల్లో ఉండే విధంగా కార్యచరణ రూపొందించాలని తెలిపారు.చదువుకు దూరమైన పిల్లలను తిరిగి పాఠశాలల్లో చేర్పించడమే ప్రభుత్వ ఉద్దేశమన్నారు.

## రెడ్‌జోన్ ప్రాంతాలపై ప్రత్యేకదృష్టి



### జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

**ప్రజాపక్షం/ములుగు జిల్లా ప్రతినిధిః** ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి వచ్చిన సమస్యలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి త్వరితగతిన పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజల సమస్యలు రెవెన్యూ శాఖకు సంబంధించిన 20, ఉద్యోగాలకు సంబంధించినవి 9, పెన్షన్‌కు సంబంధించినవి 9, ఇతర శాఖలకు సంబంధించినవి 17, మొత్తం 55 దరఖాస్తులను కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు పి శ్రీజ, ఆర్‌డిఓ సత్యపాల్‌రెడ్డిలతో కలిసి స్వీకరించారు. వర్షాకాలం మూడు నెలలు జిల్లా అధికారులు నోడల్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. ఆర్అండ్‌బి, ఇరిగేషన్, పంచాయతీరాజ్ శాఖల అధికారులు వెంటనే మరమ్మత్తు పనులు ప్రారంభించాలని, వర్షాల నేపథ్యంలో రెడ్‌జోన్‌లో ఉండే ప్రాంతాలపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని తమ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకోవాలని తెలిపారు. డిఆర్‌డిఓ శ్రీనివాస్‌కుమార్, డిఎంహెచ్ఓ అప్పయ్య, ఎస్‌సి కార్పొరేషన్ ఈడి తుల రవి, జిల్లా పశు వైద్యాధికారి జె రవికుమార్, డిఈఈ టిజి ఎన్‌పిడిసిఎల్ పి నాగేశ్వరరావు, డిఐఓ ఇరిగేషన్ డి అప్పల నాయకుడు, డిఈఓ పాణిని, తదితరులున్నారు.

## శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఊరుకోం

### జిల్లా ఎస్‌పి కిరణ్ ఖరే



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి** పోలీస్ స్టేషన్ కు వచ్చే ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించి, విచారణ జరిపి, కేసులు నమోదు చేయడంలో పాటు ప్రజలకు న్యాయం చేయాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పి కిరణ్ ఖరే అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజాదివాస్ కార్యక్రమం నిర్వహించి, 16 మంది బాధితుల నుంచి ఎస్పి పిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ బాధితులకు న్యాయం అందించే విషయంలో పటిష్టంగా పని చేయాలని అన్నారు. చట్టాలను అతిక్రమించే వారు, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులను సహించబోమని హెచ్చరించారు.భూ తగాదాల విషయంలో నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలని, కోర్టు కేసులలో ఉన్న భూ తగాదాల విషయంలో కోర్టుల ఆదేశాలకు అనుగుణంగా నడుచుకోవాలని సూచించిన ఎస్పి, బాధితుల సమస్యలను త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు.

## వందశాతం అక్షరాస్యత లక్ష్యం దిశగా కదలండి

### మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్




**ప్రజాపక్షం/మెదక్ ప్రతినిధి :** మెదక్ జిల్లాలో వందశాతం అక్షరాస్యత లక్ష్యంగా అధికారులు పని చేయాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ సూచించారు. స్థానిక కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో త్వరలో ప్రారంభం కానున్న న్యూ ఇండియా లిటరసీ కార్యక్రమంపై సమీక్షించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, మెదక్ జిల్లాలో వంద శాతం అక్షరాస్యతలో నిలపడంలో అధికారులు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. జిల్లాలో ప్రతి ఒక్కరికి 15 సంవత్సరాల వయసు నిండిన వారి నుండి ప్రతి ఒక్కరికి చదవడం, రాయడం రావాలన్నారు. మెదక్ జిల్లాలో గతంలో ఉన్న అక్షరాస కంటే మెరుగైన అక్షరాస్యత నమోదు చేసి రాష్ట్రంలో అక్షరాస్యతలో మొదటి స్థానంలో నిలపాలన్నారు.

**పరిశుభ్రంగా ఉంచాలి**

ఈ నెల 12 తారీఖున పాఠశాలలు పున: ప్రారంభంనాటికి పాఠశాల పరిశుభ్రంగా ఉంచాలని, పాఠశాలలో అన్ని పనులు పూర్తి చేయాలని, పాఠశాలలో ఉన్న స్టాక్ ను చెక్ చేసుకోవాలని పాడైపోయినటువంటి స్టాక్ లు ఏమైనా ఉంటే తీసేయాలన్నారు. మధ్యా హ్నభోజనకార్యక్రమానికి ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఏక రూప దుస్తులు కుట్టడం పూర్తిచేయాలని ,12వ తారీకు రోజున పాఠశాల విద్యార్థులకు అందించాలన్నారు.

## ప్రజావాణికి అధిక ప్రాధాన్యం



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** ప్రజావాణి కార్యక్రమంలో సమస్య పరిష్కారం కోరుతూ ప్రజలు అందచేసిన దరఖాస్తులు పరిష్కారానికి ప్రాధాన్యత ఇచ్చి సత్వర పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా తెలిపారు. సోమవారం జయశంకర్ భూపాలపల్లి కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజల సమస్యలకు సంబంధించిన 52 దరఖాస్తులను ఆయన స్వీకరించారు. ప్రజల నుండి అందిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని సంబంధిత శాఖలకు ఆయన ఎండార్స్మెంట్ చేశామని ఆయన పేర్కొన్నారు. శాఖల వారిగా పెండింగ్ లో ఉన్న సమస్యలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరించాలని సంబంధిత అధికారులకు జిల్లా కలెక్టర్ సూచించారు. జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఐఐటిలో 368వ ర్యాంకు

**ప్రజాపక్షం/వాజేడుః** మారుమూల ఏజెన్సీ ప్రాంతమైన ములుగు జిల్లా వాజేడు మండల పరిధిలోని గుమ్మడిదొడ్డి గ్రామానికి చెందిన పాయం సాయి వెంకటకృష్ణ ఐఐటిలో ఆల్ ఇండియా ఎస్‌టి కోటాలో 368 ర్యాంకు సాధించారు. సాయి వెంకటకృష్ణ తండ్రి పాయం ప్రసాద్ కరోనా సమయంలో మరణించారు. తల్లి పోస్టు ఆఫీస్‌లో బిపిఎంగా పనిచేస్తున్నారు. చిన్నప్పటి నుండి కష్టాలను చవి చూసిన సాయి వెంకటకృష్ణ ఐఐటిలో మంచి ర్యాంకు సాధించడంతో ఆయనను అభినందించారు.

## రేషన్‌కార్డుల కోసం వినతులు



**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్:** ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాలనుండి వచ్చిన ప్రజల అర్జీలను ఆయన స్వీకరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.ప్రజాల సమస్యలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని అధికారులకు సూచించారు.ఇప్పటి వరకు శాఖల వారిగా పెండింగ్ లో ఉన్న ప్రజావాణి,దరఖాస్తుల పరిశీలన చేపట్టి ప్రక్రియను వేగంగా పూర్తిచేయాలని ఆదేశించారు. ధరణి, రెవెన్యూ, వ్యవసాయం, కొత్త రేషన్ కార్డులు, ఫించన్లు,డబుల్ బెడ రూమ్ ఇండ్లు, భూ సమస్యల వంటి అంశాలపై ఫిర్యాదులు అధికంగా వచ్చాయని సంబంధిత శాఖల అధికారులు దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్,కిషోర్ కుమార్,డీ.ఆర్ ఓ భుజంగ్ రావు, ఆర్డీఓ రత్నాకళ్యాణి, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఖాళీల భర్తీకి దరఖాస్తు

**ప్రజాపక్షం/బోథ్ :** బోథ్ మండల కేంద్రంలోని బిసి బాలుర కళాశాలలో ఖాళీగా ఉన్న 83 సీట్లకు దరఖాస్తు చేసుకోవాలని హాస్టల్ వార్డెన్ చిన్నయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు గాను బిసి, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉందని తెలిపారు.ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 960601162 నెంబరుకు సంప్రదించాలని కోరారు. అదే విధంగా కౌఠ(బి) గ్రామంలోని బిసి బాలుర వసతి గృహంలో మూడవ తరగతి నుంచి పదవ తరగతి వరకు చదువుకునే విద్యార్తులకు 45 సీట్లు ఉన్నాయని ఆన్‌లైన్ లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

## ర్యాంకరుకు సన్మానం



**ప్రజాపక్షం/ వాంకిడి :**వాంకిడి మండల కేంద్రంలోని నిరుపేద కుటుంబానికి చెందిన దుర్గం అర్జున్ జెఇఇ అడ్వాన్స్‌డ్ లో ఆల్ ఇండియా 1782 ర్యాంక్ సాధించాడు. మండలానికి చెందిన విద్యార్థి జెఇఇలో ర్యాంకు సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ అంబేద్కర్ సంఘం, భారతీయ బౌద్ధ మహాసభ ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధ విహార్‌లో విద్యార్థిని ఘనంగా సన్మానించారు. భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షుడు మహాప్రబ్ అశోక్ మహుల్కార్ మాట్లాడుతూ నిరుపేద కుటుంబానికి చెందిన దుర్గం అర్జున్ తండ్రి ఏడు నెలల క్రితం మరణించాడని, పట్టుదలతో చదువుకొని కోచింగ్ లేకుండా జెఇఇ అడాన్స్‌డ్ ర్యాంక్ సాధించి యువతరానికి ఆదర్శంగా నిలిచాడని కొనియాడారు. బిఎస్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు వినీష్ ఉప్రే, అంబేద్కర్ సంఘం ఉపాధ్యక్షుడు దుర్గం సునీల్, కార్యదర్శి రోషన్, విజయ్ ఉప్రే, దుర్గం శ్యామ్ రావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గుర్నులే నారాయణ, యువజన విభాగం అధ్యక్షుడు దుర్గం ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## గల్లంతైన విద్యార్థి మృతదేహం లభ్యం

**ప్రజాపక్షం/బైంసా:** బైంసా పట్టణంలోని గడ్డన్న వాగు ప్రాజెక్టులో గల్లంతైన విద్యార్థి మృతదేహం సోమవారం లభ్యమైంది.పోలీసులు తెలిపిన కథనం ప్రకారం ఇలా ఉన్నాయి.బైంసా పట్టణం పిప్రి కాలానికి చెందిన సోలంకె పవన్(18) ఆదివారం స్నేహితులతో కలిసి సెల్ఫీ కోసం వెళ్లి ప్రమాద వశాత్తు కాలు జారీ ప్రాజెక్టులో పడిపోయాడు ఈత రాకపోవడంతో గల్లంతయ్యాడు,స్థానికులు కుటుంబ సభ్యులకు పోలీసులకు సమాచారం ఇచ్చారు.ఆదివారం రాత్రి వరకు గాలించినప్పటికీ మృతదేహం లభ్యమవ్వలేదు.సోమవారం తెల్లవారు గజ ఇతగాలతో గాలించగా మృతదేహం లభ్యమైంది.కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి,దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## గిరి పుత్రుడికి 743వ ర్యాంక్

**ప్రజాపక్షం/నర్సాపూర్ జి:** మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన ఆదివాసీ నాయకపోడు తెగకు చెందిన భీమన్న దేవాయి దంపతుల కుమారుడు సార్ల సాయికృష్ణ జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో ప్రతిభ చాటాడు.ఎస్టీ విభాగంలో జాతీయ స్థాయి 743 ర్యాంకు సాధించాడు.దీంతో తల్లిదండ్రులు,ఉపాధ్యాయులు,గ్రామస్థులు ఆయనను అభినందించారు.

## బడిబాట ఓ నూతన ఒరవడి



**ప్రజాపక్షం/రామగిరి :** రామగిరి మండలంలోని కల్వచర్ల గ్రామంలో ఐసిడిఎస్ ప్రాజెక్టు మంథని ఆధ్వర్యంలో అంగన్ వాడి కేంద్రాల టీచర్లు బడిబాటకార్యక్రమంనిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్వైజర్ శారద మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రాల్లో చిన్నారులకు సమతుల్యమైన పౌష్టికాహారం అందించనున్నట్లు పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ తీశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు వి.రజిత, జీ. అనసూర్య, డి.రమాదేవి పిల్లల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## మంథని విద్యార్థుల ప్రతిభ

**ప్రజాపక్షం/మంథని:**కరీంనగర్‌లో ఆదివారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో మంథని విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. పెద్దపల్లి జిల్లా మంథనికి చెందిన జపాన్ కరాటే అసోసియేషన్, షోటోకాన్ కరాటే మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఇన్‌స్ట్రక్టర్ కోంఢ్ర నాగరాజు ఆధ్వర్యంలో 17మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొని అత్యంత ప్రతిభ కనబర్చి ఓవరాల్ ఛాంపియన్ షిప్‌ను కైవసం చేసుకున్నారు. బ్లాక్ బెల్ట్ విభాగంలో బొడ్డెల్ల ఇంద్రాణి గోల్డ్ మెడల్, బేర ఆదిత్య తేజ సిల్వర్, వడ్లకొండ శ్రీవిన్య బ్రాంజ్ మోడల్స్ సాధించగా, ఆల్ కలర్ బెల్ట్ కటా,కుమితే విభాగంలో గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ మోడల్స్ సాధించినట్లు కోంఢ్ర నాగరాజు తెలిపారు. ఈరాష్ట్ర స్థాయిలో పోటీల్లో గెలుపొందిన విద్యార్థులను జే కె ఏ సౌత్ జోన్ ఇంచార్జి రాపోలు సుదర్శన్, షోటోకాన్ కరాటే రాష్ట్ర ఉపాధ్యక్షులు నూకల బానయ్య, సీనియర్ కరాటే మాస్టర్లు పర్శ బక్కయ్య అభినందించారు.

## పాఠశాలల్లో నాణ్యమైన విద్య

**ప్రజాపక్షం/చందుర్తి:** ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అందిస్తున్నామని చందుర్తి ఎంఈఓ శ్రీనివాస్ దీక్షితులు అన్నారు. సోమవారం చందుర్తి మండల కేంద్రంలో బడిబాట నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 19వ తారీఖు వరకు బడిబాట నిర్వహించనున్నట్లు తెలిపారు. వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని తెలిపారు.

# వేతన బకాయి ఇవ్వరేమి?

### ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్



**ప్రజాపక్షం/ ఆసిఫాబాద్ ప్రతినిధి :** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని గ్రామ పంచాయితీల్లో సుమారుగా 6 నెలల నుండి వేతనాలు లేక కార్మికులు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పెండింగులో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలని లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేస్తామని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ హెచ్చరించారు. సోమవారం కొమురం భీం జిల్లా గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) ఆధ్వర్యంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ దీపక్ తివారికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 2023 జులై, ఆగస్టు నెలలో కార్మికుల వేతనాలు, ఇతర సమస్యల పరిష్కారం కోసం 34 రోజుల పాటు నిరవధిక సమ్మె చేయటం జరిగిందని, అప్పటి రాష్ట్ర ప్రభుత్వం కార్మిక సంఘాలన్నింటిని చర్చలకు పిలిచి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇవ్వటంతో సమ్మె విరమించటం జరిగిందని అన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయడంలో అప్పటి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, హామీ ఇచ్చి ఏడాది గడుస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కారం కాలేదని, ఇప్పటికైన అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామ పంచాయితీ కార్మికుల సమస్యలు పరిష్కరించి పెండింగ్‌లో ఉన్న వేతనాలు అందించాలనిడిమాండ్ చేశారు.గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) జిల్లా కార్యదర్శి దుర్గం వెంకటేష్, ఎఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆత్మకూరి చిరంజీవి, కార్మికులు ధర్మయ్య, మల్లయ్య, లక్ష్మ ణ్, వెంకటేష్, సంతోష్, శంకర, గోపాల్, అంజయ్య తోపాటు తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలల్లో మౌలిక వసతులు తప్పనిసరి

### జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా

**ప్రజాపక్షం / జగిత్యాల జిల్లా ప్రతినిధి :** పాఠశాలల పునఃప్రారంభం కానున్న దృష్ట్యా తరగతి గదులు శుభ్రపరచడం మౌలిక సదుపాయాలు కల్పించడం జరగాలని జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ సమావేశ మందిరంలో ప్రజావాణి అనంతరం పాఠశాలల పునః ప్రారంభం అవుతున్న నేపథ్యంలో విద్యార్థులకు కనీస సదుపాయాలు కల్పించడం, పాఠ్య, నోటు పుస్తకాలు ఏకరూప దుస్తులు అందించడం జరగలని అన్నారు. అదే విధంగా వసతి గృహాల్లో కూడా అన్ని శుభ్రం చేయించాలని, గత సంవత్సరం పాఠశాలల ముగింపు సమయంలో మిగిలిపోయిన బియ్యం తదితర సామాగ్రి ఈ సంవత్సరం వాడకుండా కొత్తగా ఇండెంటు సమర్పించి సరుకులు తీసుకోవాలని, ఎస్సీ, బిసి, ఎస్టీ, మైనార్టీ తదితర విద్యాసంస్థల జిల్లా అధికారులకు సూచించారు. పాఠశాలలు, విద్యాసంస్థలు, వసతి గృహాల్లో ఎలాంటి పిర్యాదులు రాకుండా ముందస్తు సరుకు తీసుకునేలా ఏర్పాట్లు చేయాలని అన్నారు. ఈ విద్యాసంవత్సరంలో విద్యార్థులకు ఏక రూప దుస్తులను ఆయా మండలాల వారీగా పాఠశాలల వారీగా పాఠశాలలు ప్రారంభించే నాటికి పంపించాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారులను ఆదేశించారు. అందరూ సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు దివాకర, పి. రాంబాబు, ఆర్డీవోలు పి. మధుసూధన్, శ్రీనివాస్, జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మంచిర్యాల జిల్లాలో రైతు హల్‌చల్!

### పురుగుల మందు డబ్బాతో నిరసన



**ప్రజాపక్షం/ నెన్నెల/ బెల్లంపల్లి :**ప్రజావాణిలో ఓ రైతు పరుగుల మందు డబ్బాతో ఆందోళనకు దిగాడు. తన సమస్యను పట్టించుకోవడం లేదని ప్రజావాణిలో అధికారులకు ఫిర్యాదు చేశాడు. వివరాల్లోకి వెళితే.. నెన్నెల మండలంలో నిర్వహించిన ప్రజావాణిలో జనార్ధన్ అనే రైతు పురుగుల మందు డబ్బాతో వచ్చాడు. కిష్టాపూర్ ఐకెపి కేంద్రం ఆధ్వర్యంలో జనార్ధన్ తన మామిడి కాయలు అమ్మకం చేయగా వాటికి సంబంధించి దాదాపు రూ.1 లక్ష 50 వేలు రావాల్సి ఉంది. డబ్బుల కోసం నెల రోజుల నుండి సంబంధిత అధికారుల చుట్టూ తిరిగిన పట్టించుకోవడం లేదని, అధికారుల చుట్టూ ఎన్ని సార్లు తిరిగిన కనీసం పట్టించుకోకపోవడంతో ఆవేదన చెందిన జనార్ధన్ పు రుగుల మందు డబ్బా పట్టుకుని వచ్చి నిరసన వ్యక్తం చేశాడు. తనకు రావాల్సిన డబ్బులను ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని,వ్యవసాయపైఆధారపడి కుటుంబాన్ని పోషించుకుంటున్న తనకు న్యాయం చేయాలని వేడుకున్నాడు.

## భీమారంలో నకిలీ విత్తనాల పట్టివేత



**ప్రజాపక్షం/ భీమారం/ మంచిర్యాల క్రైం :** భీమారం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆవడం ఎక్స్ రోడ్ వద్ద సోమవారం రూ. 3. 20 లక్షలు విలువ చేసే 107 కిలోల నిషేధిత నకిలీ పత్తి విత్తనాలను టాస్క్ ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. టాస్క్ ఫోర్స్ సిఐ సంజయ్, ఎస్ఐ ఉపేందర్, భీమారం ఎస్ఐ రాములు, భీమారం వ్యవసాయ అధికారి మార్క్ గ్లాడ్ స్టన్‌లు మాట్లాడుతూ మంచిర్యాల జిల్లాలోని భీమారం పోలీస్ స్టేషన్ పరిధిలో గల ఆవడం ఎక్స్ రోడ్ వద్ద ఒక వ్యక్తి మూడు సంచులతో ఆటో కోసం ఎదురుచూస్తూ అనుమానాస్పదంగా కనిపించడంతో అతని వద్ద ఉన్న సంచులు తనిఖీ చేయగా ఒక క్వింటాలు ఏడు కిలోల నకిలీ పత్తి విత్తనాలు లభించాయని తెలిపారు. పట్టుబడిన నింధితున్ని విచారణ చేయగా అతని పేరు చుండు నాగేశ్వరరావు అని, భీమారంలో కౌలుకు వ్యవసాయం చేస్తానని, గుంటూరు జిల్లాకు చెందిన అతను కర్నూలులో గుర్తుతెలియని వ్యక్తి వద్ద నుంచి తక్కువ ధరకు నకిలీ పత్తి విత్తనాలు కొనుగోలు చేసి మంచిర్యాల ప్రాంతంలోని అమాయకపు రైతులకు ఎక్కువ ధరకు అమ్మట కొరకు తీసుకువచ్చినట్లు నింధితుడు వెల్లడించడం జరిగిందన్నారు. పట్టుబడిన విత్తనాలను, నింధితున్ని అదుపులోకి తీసుకుని తదుపరి విచారణ నిమిత్తం భీమారం పోలీస్‌లకు అప్పగించడం జరిగిందని తెలిపారు. నకిలీ విత్తనాలు, ఎరువులను నిర్మూలించడానికి నిరంతరం పోలీస్, వ్యవసాయ శాఖ కృషి చేస్తుందని తెలిపారు.

## వరదలపై ముందస్తు చర్యలు చేపట్టాం

**ప్రజాపక్షం/నిర్మల్‌టౌన్:** భారీవర్షాలు, వరదల వలన ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని రాష్ట్ర మంత్రి సీతక్క అన్నారు. సోమవారం అన్ని జిల్లాల కలెక్టర్లు,అదనపు కలెక్టర్లు సంబంధిత శాఖల అధికారులతో వర్షాకాలం నేపథ్యంలో తీసుకోవలసినచర్యలపైఆమెరాష్ట్ర ఉన్నత అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అదనపుకలెక్టర్ ఫైజాన్ అహ్మద్ మాట్లాడుతూ జిల్లాలో భారీ వర్షాలు,వరదల వలన ఆస్తి,ప్రాణ నష్టం జరుగకుండా అవసరమైన ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మిషన్ భగీరథ సర్వేను పకడ్బందీగా నిర్వహిస్తామని వివరించారు. జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్, జెడ్పీ సీఈవో గోవింద్, డీఆర్డీఓ విజయలక్ష్మి, మిషన్ భగీరథ ఈఈ సందీప్,ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## మానవతా దృక్పథంతో ప్రజలకు సహకరించండి

### జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



**ప్రజాపక్షం/పెద్దపల్లిప్రతినిధి :** ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత కల్పించాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే. అరుణ శ్రీతో కలిసిపాల్గొని ప్రజల అర్జీలను స్వీకరించారు.జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ ప్రజావాణి దరఖాస్తులకు ప్రాధాన్యత నిచ్చి ప్రజలు ఇచ్చిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి సమస్యలను సకాలంలో పరిష్కరించాలనికలెక్టర్ ఆదేశించారు. ఈ రోజు మొత్తం (42) దరఖాస్తులు రాగా, అందులో రెవెన్యూ(12), ఇతర శాఖలకు చెందినవి (30) ఉన్నాయని తెలిపారు. గోదావరిఖని పవర్ హౌస్ కాలనీకి చెందిన చల్లా బక్కరెడ్డి గోదావరిఖని లోని జనగామ శివారు సర్వే నెంబర్ 728/బి లో 007 గుంటల తమ భూమిలో ఉన్న ప్రహరీ గోడను కూలగొట్టిన వ్యక్తులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు సమర్పించగా, గోదావరిఖని ఏసీపీకి రాస్తూ విచారణ చేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కోరారు. మంథని మండలం సిరిపురం గ్రామానికి చెందిన దాసరి చంద్ర మోహన్ అనే రైతు మంథని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్, సీఈవోలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిన్న, సన్నకారు రైతులకు అందించే ప్రోత్సాహకాలను పెట్టుబడి దారులకు, రాజకీయ పలుకుబడిదారులకు రుణాలు అందించి డబ్బులు పోగేసుకుంటున్నారని వీరిపై చర్యలు తీసుకుని మామూలు రైతులకు రుణాలు అందించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా జిల్లా సహకార అధికారికి రాస్తూ సంపూర్ణ నివేదిక సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. కమాన్ పూర్ కు చెందిన జి.శశిరేఖ తన భర్త జి.రామరాజు పంచాయతీ కార్యదర్శిగా పదవి విరమణ పొందిన తరువాత మరణించారని, ఆయన సర్వీస్ కాలంలో సస్పెన్షన్ ఉన్న కాలానికి సంబంధించి ఇంక్రిమెంట్, హాఫ్ పే లీవ్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, జిల్లా పంచాయతీ అధికారికి రాస్తూ మానవతా దృక్పథంతో నిబంధనలు ప్రకారం సానుకూలంగా స్పందించి త్వరితగతిన సమస్య పరిష్కరించాలని సూచించారు. అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎఐటియుసి వల్లే వయోపరిమితి పెంపు



### ఎఐటియుసి అధ్యక్ష, కార్యదర్శులు సీతారామయ్య, రాజ్‌కుమార్

**ప్రజాపక్షం/జయశంకర్‌భూపాలపల్లి ప్రతినిధి :** గత కొంతకాలం సింగరేణిలో ఉద్యోగుల పిల్లలకు వయోపరిమితి 35 నుండి 40 పెంచటం ఏఐటియుసి పోరాట ఫలితమేనని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష,ప్రధానకార్యదర్శి లు వాసిరెడ్డి సీతారామయ్య, కొరిమి రాజ్ కుమార్ అన్నారు. సోమవారం సింగరేణిలో పని చేస్తున్న కార్మికుల పిల్లల వయోపరిమితి 35 నుండి 40 సంవత్సరాలకు పెంచినట్లు సింగరేణి సంస్థ సర్క్యులర్ జారీ చేశామన్నారు. వారు మాట్లాడుతూ..భారత కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ముఖ్యమంత్రితో మాట్లాడి ఈ విషయం పై పార్టీతో పాటు సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ కృషి,పోరాట ఫలితంగా ఇది సాధ్యమైంద న్నారు. సింగరేణిలో అన్‌ఫిట్ ద్వారా డిపెండెంట్‌ఉద్యాగాలవయస్సు విషయంలో అనేకసార్లుసింగరేణి యాజమాన్యం దృష్టికి తీసుకెల్లడం జరిగిందన్నారు. సింగరేణిలో 35 సంవత్సరాలు దాటిన కార్మికుల పిల్లలకు ఉద్యోగాలు నిరాకరించారని తెలిపారు. ఏఐటియుసిసింగరేణికాలరీస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు,సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ కృషివల్లనే సాధ్యమైందని హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడొద్దు

**ప్రజాపక్షం / నస్పూర్ :** భావితరాల భవిష్యత్తు నిర్ణయించే విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటే సహించేది లేదని, నీట్ పరీక్ష పేపర్ లీకేజీ పై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని అఖిల భారత యువజన సమాఖ్య అధ్యక్ష కార్యదర్శులు ముత్తునూరి మహేష్, అచ్చ హరీష్ డిమాండ్‌చేశారు. సోమవారం తీగల్పహాడ్ ఏరియా కమిటీసమావేశంలోవారుమాట్లాడుతూ నీట్ పరీక్ష నిర్వహించిన తీరుపై కేంద్ర ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించాలన్నారు. మే 4న పరీక్ష జరిగిందని, 24 లక్షల మంది విద్యార్థులు పరీక్షను రాశారని తెలిపారు. ఫలితాలపైవిద్యార్థులు, విద్యార్థి తల్లిదండ్రులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారని ఆరోపించారు. తక్షణమే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ విడుదల చేసిన ఫలితాలపై కేంద్ర ప్రభుత్వం స్పందించి పరీక్ష రాసిన మెడికల్ విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.ఏరియా నాయకులు మొగిలి లక్ష్మ ణ్, గరిగే విజయ్, కనుకుంట్ల కిన్ను, ఎం. సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కేంద్రమంత్రులకు కేటాయించిన శాఖలివే....

**న్యూఢిల్లీ :** మోదీ 3.0 కేబినెట్‌లో మంత్రులకు శాఖల కేటాయింపు పూర్తయింది. మంత్రులకు కేటాయించిన శాఖల వివరాలతో రాష్ట్రపతి భవన్ సోమవారం రాత్రి జాబితాను విడుదల చేసింది. ప్రధాని మోదీతో పాటు ఆదివారం 71 మంది మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసిన విషయం తెలిసిందే. ఇందులో 30 మంది కేబినెట్ మంత్రులు కాగా.. 36 మంది సహాయ మంత్రులు, ఐదుగురు స్వతంత్ర మంత్రులు ఉన్నారు.

### ప్రధాని మోదీ వద్దనున్న శాఖలు:

సిబ్బంది వ్యవహారాలు, పింఛన్లు, పబ్లిక్ గ్రీవెన్స్, అణు శక్తి, అంతరిక్షం, కీలక విధాన సంబంధిత అంశాలతోపాటు ఇతర మంత్రులకు కేటాయించని శాఖలు.

### ఇతర మంత్రులకే కేటాయించిన శాఖలు

1. రాజ్‌నాథ్ సింగ్ (బిజెపి) రక్షణ శాఖ
2. అమిత్ షా (బిజెపి) హోం మంత్రిత్వ, సహకార శాఖ
3. నితిన్ గడ్కరీ (బిజెపి) రోడ్లు, జాతీయ రహదారులు
4. జగత్ ప్రకాశ్ నడ్డా (బిజెపి) ఆరోగ్య, సంక్షేమం; రసాయనాలు, ఎరువులు
5. శివరాజ్ సింగ్ చౌహాన్ (కొత్త) (బిజెపి) వ్యవసాయం, రైతు సంక్షేమం; గ్రామీణాభివృద్ధి
6. నిర్మలా సీతారామన్ (బిజెపి) ఆర్థికం; కార్పొరేట్ వ్యవహారాలు
7. సుబ్రహ్మణ్యం జైశంకర్ (బిజెపి) విదేశీ వ్యవహారాలు
8. మనోహర్ లాల్ ఖట్టర్ (కొత్త) (బిజెపి) గృహనిర్మాణ, పట్టణభివృద్ధి; విద్యుత్తు
9. హెచ్.డి. కుమారస్వామి (కొత్త) (జెడిఎస్) భారీ పరిశ్రమలు, ఉక్కు
10. పీయూష్ వేద్ ప్రకాశ్ గోయల్ (బిజెపి) వాణిజ్య, పరిశ్రమలు
11. ధర్మేంద్ర ప్రధాన్ (బిజెపి) విద్య
12. జీతన్ రామ్ మాంఝి (కొత్త) (హెచ్‌ఎఎం) సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు
13. రాజీవ్ రంజన్ (లలన్)సింగ్ (కొత్త) (జెడియు) పంచాయతీరాజ్; మత్స్య, పశుసంవర్ధక, డెయిరీ
14. సర్బానంద్ సోనోవాల్ (బిజెపి) షిప్పింగ్, పోర్టులు, వాటర్ వేస్
15. వీరేంద్ర కుమార్ (బిజెపి) సామాజిక న్యాయం, సాధికారత
16. కింజరాపు రామ్మోహన్ నాయుడు (కొత్త) (టిడిపి) పౌర విమానయానం
17. ప్రహ్లాద్ వెంకటేష్ జోషి (బిజెపి) వినియోగదారుల వ్యవహారాలు; ఆహార, ప్రజాపంపిణీ; నూతన, పునరుత్పాదక ఇంధనం
18. జుయెల్ ఓరం (కొత్త) (బిజెపి) గిరిజన వ్యవహారాలు
19. గిరిరాజ్ సింగ్ (బిజెపి) జౌళి పరిశ్రమ
20. అశ్వినీ వైష్ణవ్ (బిజెపి) రైల్వే, సమాచార ప్రసారాలు, ఐటీ, ఎలక్ట్రానిక్స్
21. జ్యోతిరాదిత్య సింధియా (బిజెపి) కమ్యూనికేషన్స్, ఈశాన్య ప్రాంత అభివృద్ధి
22. భూపేంద్ర యాదవ్ (బిజెపి) పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పులు
23. గజేంద్రసింగ్ షెకావత్ (బిజెపి) పర్యటక, సాంస్కృతికం
24. అన్నపూర్ణాదేవి (కొత్త) (బిజెపి) మహిళా, శిశు సంక్షేమాభివృద్ధి
25. కిరణ్ రిజిజు (బిజెపి) పార్లమెంటరీ వ్యవహారాలు, మైనారిటీ వ్యవహారాలు
26. హర్దీప్ సింగ్ పూరి (బిజెపి) పెట్రోలియం, సహజవాయువులు
27. మనస్సుఖ్ ఎల్. మాండవీయ (బిజెపి) కార్మిక, ఉపాధి కల్పన, క్రీడలు యువజన వ్యవహారాలు
28. గంగాపురం కిషన్ రెడ్డి (బిజెపి) బొగ్గు, గనులు
29. చిరాగ్ పాసవాన్ (కొత్త) (ఎల్‌జెపి పాసవాన్) ఆహార శుద్ధి పరిశ్రమలు
30. సి.ఆర్.పాటిల్ (కొత్త) (బిజెపి) జల్ శక్తి

### సహాయ మంత్రులు (స్వతంత్ర హోదా)..

31. రావ్ ఇంద్రజిత్ సింగ్ (బిజెపి) గణాంకాలు, కార్యక్రమాల అమలు, సాంస్కృతిక
32. జితేంద్రసింగ్ (బిజెపి) శాస్త్ర సాంకేతిక,, భౌగోళిక శాస్త్ర, ప్రధానమంత్రి కార్యాలయం, సిబ్బంది వ్యహారాలు, పించన్లు, అణు ఇంధనం, అంతరిక్షం
33. అర్జున్ రామ్ మేఘ్ వాల్ (బిజెపి) న్యాయం, పార్లమెంటరీ వ్యవహారాలు
34. ప్రతాప్ రావ్ గణపత్‌రావ్ జాదవ్ (కొత్త) (శివసేన) ఆయుష్, ఆరోగ్య కుటుంబ సంక్షేమం
35. జయంత్ చౌధరి (కొత్త) (ఆర్ఎల్‌డి) నైపుణ్యాభివృద్ధి, ఆంత్రపెన్యూర్, విద్య

### సహాయ మంత్రులు

36. జితిన్ ప్రసాద (కొత్త) (బిజెపి) వాణిజ్య, పరిశ్రమలు, ఐటీ, ఎలక్ట్రానిక్స్
37. శ్రీపాద్ యశో నాయక్ (బిజెపి) విద్యుత్తు, కొత్త పునరుత్పాక ఇంధనం
38. పంకజ్ చౌధరి (బిజెపి) ఆర్థికం
39. క్రిషన్ పాల్ (బిజెపి) సహకారం
40. రామ్ దాస్ అథావలె (ఆర్ పిఐ) సామాజిక న్యాయం, సాధికారత
41. రామ్ నాథ్ ఠాకూర్ (కొత్త) (జెడియు) వ్యవసాయ, రైతు సంక్షేమం
42. నిత్యానందరాయ్ (బిజెపి) హోం
43. అనుప్రియ పటేల్ (అప్నాదళ్) ఆరోగ్య, కుటుంబ సంక్షేమం, ఎరువులు రసాయనాలు
44. వి.సోమన్న (కొత్త) (బిజెపి) జల్ శక్తి, రైల్వే
45. పెమ్మసాని చంద్రశేఖర్ (కొత్త) (టిడిపి) గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్
46. ఎస్.పి.సింగ్ బఘేల్ (బిజెపి) మత్స్య, పశుసంవర్ధక, డెయిరీ, పంచాయతీ రాజ్
47. శోభా కరంద్లాజే (బిజెపి) సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, కార్మిక, ఉపాధి
48. కీర్తివర్ధన్ సింగ్ (కొత్త) (బిజెపి) పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పులు, విదేశాంగ
49. బిఎల్ వర్మ (బిజెపి) వినియోగదారుల వ్యవహారాలు, ఆహార ప్రజా పంపిణీ, సామాజిక న్యాయం సాధికారత
50. శాంతనూ ఠాకూర్ (బిజెపి) పోర్టులు, షిప్పింగ్, వాటర్‌వేస్
51. సురేష్ గోపి (కొత్త) (బిజెపి) పెట్రోలియం, సహజవాయువులు, పర్యటకం
52. ఎల్.మురుగన్ (బిజెపి) సమాచార ప్రసారాలు, పార్లమెంటరీ వ్యవహారాలు
53. అజయ్ టమ్టా (బిజెపి) రోడ్డు రవాణా, హైవేలు
54. బండి సంజయ్ కుమార్ (కొత్త) (భాజపా) హోం
55. కమలేష్ పాశ్వాన్ (కొత్త) (బిజెపి) గ్రామీణాభివృద్ధి
56. భగీరథ్ చౌదరి (కొత్త) (బిజెపి) వ్యవసాయ, రైతు సంక్షేమం
57. సతీశ్ చంద్రదూబే (కొత్త) (బిజెపి) బొగ్గు, గనులు
58. సంజయ్ సేఠ్ (కొత్త) (బిజెపి) రక్షణ
59. రవ్‌నీత్ సింగ్ బిట్టూ (కొత్త) (బిజెపి) ఆహార శుద్ధి పరిశ్రమ, రైల్వేలు
60. దుర్గాదాస్ ఉయికె (కొత్త) (బిజెపి) గిరిజన వ్యవహారాలు
61. రక్షా నిఖిల్ ఖడ్సే (కొత్త) (బిజెపి) యువజన వ్యవహారాలు క్రీడలు
62. సుఖాంత మజుందార్ (కొత్త) (బిజెపి) విద్య, ఈశాన్య ప్రాంత అభివృద్ధి
63. సావిత్రి ఠాకుర్ (కొత్త) (బిజెపి) మహిళా, శిశు సంక్షేమాభివృద్ధి
64. టోకన్ సాహు (కొత్త) (బిజెపి) గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాలు
65. రాజ్ భూషణ్ చౌదరి (కొత్త) (బిజెపి) జల్ శక్తి
66. భూపతిరాజు శ్రీనివాస వర్మ (కొత్త) (బిజెపి) భారీ పరిశ్రమలు, ఉక్కు
67. హర్ష్ మల్హోత్రా (కొత్త) (బిజెపి) కార్పొరేట్ వ్యవహారాలు, రోడ్డు రవాణా హైవేలు
68. నిముబెన్ జయంతిభాయ్ బాంభణియా (కొత్త) (బిజెపి) వినియోగదారుల వ్యవహారాలు, ఆహార ప్రజా పంపిణీ
69. మురలీధర్ మొహోల్ (కొత్త) (బిజెపి) సహకార, పౌర విమానయానం
70. జార్జ్ కురియన్ (కొత్త) (బిజెపి) మైనారిటీ వ్యవహారాలు, మత్స్య పశుసంవర్ధక డెయిరీ
71. పవిత్ర మార్గరీటా (కొత్త) (బిజెపి) విదేశీ వ్యవహారాలు, టెక్స్‌టైల్స్

# నీట్ ఫలితాలపై సుప్రీంకోర్టు జడ్జితో విచారణ

## ఎఐవైఎఫ్ డిమాండ్
## రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన
## ఎన్‌టిఎ డైరెక్టర్ జనరల్ దిష్టిబొమ్మ దగ్ధం


హైదరాబాద్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వైద్య కళాశాలల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన నీట్ యుజి ఫలితాల అవకతవకలపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరిపి దోషులపై చర్యలు తీసుకోవాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) డిమాండ్ చేసింది. ఇంటర్మీడియట్ మార్కుల ఆధారితంగా వైద్య కళాశాలల్లో సీట్లను కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఎఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో హిమాయత్‌నగర్‌లోని సత్యనారాయణరెడ్డి భవన్ నుంచి వైజంక్షన్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించి, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ, నీట్ డైరెక్టర్ జనరల్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఎఐవైఎఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రస్తుతం ఎన్డీఏలో ప్రభుత్వంలో కీలకంగా ఉన్న చంద్రబాబునాయుడు రెండు తెలుగు రాష్ట్రాల్లో 1.40లక్షల మంది నీట్ పరీక్షను రాసి, ఉత్తీర్ణత పొందిన విద్యార్థుల పక్షాన నిలబడి, కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయాలని డిమాండ్ చేశారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఈ నెల 4వ తేదీన నీట్ 2024 ఫలితాలను ప్రకటించిందని, అయితే ఈ ఫలితాలలో 67 మంది విద్యార్థులు 720కి 720 మార్కులు పొందారని, ఇంత పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఎలా అగ్రస్థానంలో నిలిచారనే దానిపై వివాదం నెలకొందన్నారు. హర్యానాలోని ఓఒపరీక్షా కేంద్రంలో ఒకేగదిలో పరీక్ష రాసిన విద్యార్థుల్లో 8 మంది 720కి 720 మార్కులు రావడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. ఈ క్రమంలో అభ్యర్థులు హైకోర్టుల్లో పిటిషన్లు దాఖలు చేశారని, వారికి కలిగిన నష్టాన్ని భర్తీ చేయడం కోసం గ్రేస్ మార్కులు ఇవ్వడం జరిగిందని డైరెక్టర్ చెప్పడం సిగ్గుచేటన్నారు. మరోవైపు కేంద్ర ప్రభుత్వం విచ్చలవిడిగా మెడికల్ కాలేజీలకు పర్మిషన్లు ఇస్తుంది. దీని వలన తక్కువ ర్యాంక్ వచ్చినోళ్లకూ మెడిసిన్ సీట్లు వస్తున్నాయని వారు ఆరోపించారు. కార్యక్రమంలో ఎఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మహమూద్, రాష్ట్ర సమితి సభ్యులు, విద్యార్థి నాయకులు మాజీద్, కళ్యాణ్, అనీల్, షబీనా, పూజా, కిరణ్మయి, నేహా, ప్రమోద్, కిరణ్, తన్మయి, మురహరి తదితరులు పాల్గొన్నారు.



ఖమ్మం

**ఖమ్మం అర్బన్ :** నీట్ పరీక్షా ఫలితాలపై పలు అనుమానాలు వెలువడుతున్న నేపథ్యంలో పరీక్ష నిర్వహించిన తీరుపై కేంద్ర ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించాలని ఎఐఎస్‌ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఎఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో ఖమ్మం పట్టణంలో ర్యాలీ నిర్వహించి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఇటికాల మాట్లాడుతూ మే 25న పరీక్ష నిర్వహించడం జరిగిందని దేశ వ్యాప్తంగా 24 లక్షల మంది విద్యార్థులు పరీక్ష రాశారని ప్రకటించిన ఫలితాలలో అవకతవకలు జరిగాయని విద్యార్థులు, తల్లిదండ్రులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారన్నారు. వారి అనుమానాలకు సాక్ష్యంగా ఒకే సెంటర్‌లో పరీక్షలు రాసిన ఆరుగురు విద్యార్థులకు 720 మార్కులకు 720 రావడం వారి అనుమానాలకు బలాన్ని ఇస్తుందన్నారు. తక్షణమే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ విడుదల చేసిన ఫలితాలపై కేంద్ర ప్రభుత్వం స్పందించి సమగ్ర విచారణ జరిపించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శులు నాగులమీరా, శివనాయక్, వంశీ, హరికృష్ణ, బాలాజీ, శిరీష, మౌనిక, గౌతమి, శైలజ, పావని, సంధ్య తదితరులు ఉన్నారు.

**కరీంనగర్ ప్రతినిధి :** వైద్యకళాశాలల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన నీట్ యుజి ఫలితాల అవకతవకలపై సుప్రీం కోర్టు సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరిపి దోషులపై చర్యలు తీసుకోవాలని, ఇంటర్మీడియట్ మార్కుల ఆధారితంగా వైద్య కళాశాలలో సీట్లను కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఎఐవైఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ప్లకార్డులు పట్టుకుని బస్టాండ్ వద్ద నిరసన తెలిపారు. ఈ సంధర్భంగా ఎఐవైఎఫ్ కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి బ్రాహ్మణపల్లి యుగంధర్ మాట్లాడుతూ కొంతమంది విద్యార్థులకు గ్రేస్ ఇచ్చామని చెబుతున్న నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఏ ప్రాతిపదికన గ్రేస్ మార్కులు ఇచ్చారో చెప్పాలన్నారు. నీట్ యుజి పరీక్ష రాసిన విద్యార్థుల సందేహాలు ఎన్టిఏ నివృత్తి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎఐవైఎఫ్ నాయకులు రమేష్, రవీందర్, జోసెఫ్, అవినాష్, మురళి, ఫిరోజ్, భాస్కర్ తదితరులున్నారు.

**నేరేడుచర్ల :** వైద్య కళాశాలల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన నీట్ యూజీ ఫలితాల అవకతవకలపై సమగ్ర విచారణ జరిపి దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఇంటర్మియట్ ఆధారితంగా వైద్య కళాశాలల్లో సీట్లను కేటాయించాలని డిమాండ్ చేస్తూ సోమవారం పట్టణంలో ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో నీట్ డైరెక్టర్ సుబోధ్‌కుమార్ దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఎఐవైఎఫ్ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీను మాట్లాడుతూ ఈ వివాదంపై పరీక్ష రాసిన విద్యార్థుల సందేహాలు ఎన్టీఏ నివృత్తి చేయాలని అప్పుడే పరీక్ష పారదర్శకంగా జరిగినట్లు అందరూ భావిస్తారన్నారు. కార్యక్రమంలో నాయకులు బెల్లంకొండ గోవిందు, నాయకులు కొమరాజు వెంకట్, సొల్లేటి శివ, నందిపాటి పండు, చిలకరాజు జయంత్, వనపర్తి యశ్వంత్, రాహుల్, నరసింహా, వినయ్ తదితరులు పాల్గొన్నారు


హుజూర్‌నగర్



కరీంనగర్

# యువతే దేశభవిష్యత్తు

## సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు
## 500 మంది యువకులు సిపిఐలో చేరిక



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** దేశానికి దశా దిశ భవిష్యత్తును నిర్ణయించేది యువతేనని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. జనాభాలో సగానికి పైగా ఉన్న యువశక్తిని పాలకులు నిర్వీర్యం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. సోమవారం కొత్తగూడెం నియోజక వర్గ పరిధిలోని పాల్వంచలో కూనంనేని సాంబశివరావు, ఎస్‌కె సాబీర్‌పాషా సమక్షంలో 500 మంది యువకులు సిపిఐలో చేరారు. వారిని పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో కూనంనేని మాట్లాడుతూ ఇంతమంది యువకులు కమ్యూనిస్టు పార్టీలో చేరడం గొప్ప విషయమని, వారి ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా కమ్యూనిస్టు పార్టీ పని చేస్తుందన్నారు. కమ్యూనిస్టు పార్టీ పక్షాన ఉద్యోగ, ఉపాధి కల్పన కోసం పోరాడుతున్నామన్నారు. పెరిగిన యువతకు అనుగుణంగా ఉపాధి రంగాలను విస్తరించడంలో పాలకులు వైఫల్యం చెందారని ఆయన తెలిపారు. దేశంలో నిరుద్యోగుల సంఖ్య ప్రపంచ రికార్డుకు చేరువలో ఉందని, దీనితో యువతలో నిరాశ, నిస్పృహలు అలుముకుంటున్నాయన్నారు. యువశక్తి నిర్వీర్యమైతే దేశానికి అత్యంత ప్రమాదకరమని ఆయన తెలిపారు. పోరాటాల ద్వారానే ఉపాధి, ఉద్యోగాలను సాధించుకునేందుకు ప్రయత్నం చేయాలన్నారు. కమ్యూనిస్టు పార్టీ నేతృత్వంలో కొత్తగూడెం నియోజక వర్గంలో ప్రతి సమస్యకు పరిష్కారం చూపుతున్నామని ప్రజల సహకారంతో నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసుకోవాలని యువత క్రియాశీలక పాత్ర పోషించాలన్నారు. పార్టీలో చేరిన వారిలో అస్మత్ ఖాన్, అఫ్రోజ్, శివ, ఫహీమ్, ఫిరోజ్, కదీర్, ముజ్జు, రాజు, సాధిక్, శివ, గని తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు యూసఫ్, నర్సింహారావు, రమేష్, బత్తుల సురేష్, రామారావు, యాకూబ్, జహీర్, కె. శివ, శ్రీను తదితరులు ఉన్నారు.

# శ్రమదోపిడీ చేస్తున్న ఆర్‌టిసి యాజమాన్యం

## ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్



**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ ప్రతినిధి :** టిజి ఆర్‌టిసిలో పనిచేస్తున్న ప్రైవేట్ హైర్ బస్‌డ్రైవర్లు శ్రమదోపిడీకి గురవుతున్నారని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ అన్నారు. సోమవారం ఆర్‌టిసి డిపోలో పనిచేస్తున్న ప్రైవేట్ హైర్ బస్ డ్రైవర్ల వేతనాలు పెంచి ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ టిజి ఆర్‌టిసిలో పనిచేస్తున్న ప్రైవేట్ హైర్ బస్ డ్రైవర్ల సమస్యలను తక్షణమే పరిష్కారం చేయకుంటే ఈ నెల 14 తర్వాత ఏ రోజైన నిరవధిక సమ్మెలోకి వెళ్తామని హెచ్చరించారు. ఆసిఫాబాద్ డిపోలో 15 సంవత్సరాల నుంచి ప్రైవేట్ హైర్ బస్ డ్రైవర్లుగా పనిచేస్తూ చాలీచాలని వేతనాలు తీసుకుంటూ డిపో అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్నారని, అలాంటి కార్మికులను యాజమాన్యం పట్టించుకోవడం లేదని, కార్మిక చట్టాలు అమలు చేయకుండా శ్రమ దోపిడికి గురి చేస్తుందని ఆరోపించారు. ప్రైవేట్ హైర్ బస్ డ్రైవర్లకు నెలకు రూ.32 వేల వేతనం ఇవ్వాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కార్మికులందరికీ 8 గంటల పని విధానాన్ని అమలు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రతి నెల 5వ తేదీ లోపు బ్యాంకు ద్వారా వేతనాలు చెల్లించాలని కోరారు. కార్మిక కుటుంబ సభ్యులందరికీ ఉచితంగా కార్పొరేట్ వైద్య సదుపాయం కల్పించాలని, కార్మిక కుటుంబ సభ్యులకు రాష్ట్ర వ్యాప్తంగా ఫ్రీ బస్సు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షుడు పిడుగు శంకర్, ఆర్‌టిసి ప్రైవేట్ బస్ డ్రైవర్స్ యూనియన్ ఆసిఫాబాద్ డిపో అధ్యక్షుడు మధుసూదన్, ఉపాధ్యక్షుడు అయిల్లా భాస్కర్, జాయింట్ సెక్రటరీ తేజ, విజయ్, కోశాధికారి సాయి కృష్ణ, కార్మికులు ఆత్మకూరి సంతోష్, తిరుపతి, షకీర్, రషద్, దశరథ పాల్గొన్నారు.

# సిపిఐ సీనియర్ నాయకులు లింగారెడ్డి మృతి




**ప్రజాపక్షం/హన్మకొండ ప్రతినిధి :** సిపిఐ జిల్లా సీనియర్ నాయకులు, హసన్‌పర్తి మండలం ఎల్లాపూర్ గ్రామానికి చెందిన గంగిల్ల లింగారెడ్డి సోమవారం తెల్లవారు జామున కన్నుమూశారు. భారత కమ్యూనిస్టు పార్టీలో ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యవర్గ సభ్యులుగా, హసన్ పర్తి మండల కార్యదర్శిగా,వివిధ ప్రజా సంఘాలలో జిల్లా నాయకులుగా పని చేసిన లింగారెడ్డి 1972 నుండి పార్టీలో కొనసాగుతున్నారు. సుదీర్ఘ కాలం కమ్యూనిస్టు ఉద్యమంలో ఎన్ని ఆటు పోట్లు ఎదురైనా మొక్క వోని ధైర్యంతో పని చేస్తూ పార్టీని హన్మకొండ తాలూకాలో విస్తరింపజేసేందుకు అహర్నిశలు కృషి చేశారు. విషయం తెలుసుకున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, మాజీ ఎమ్మెల్యే పోతరాజు సారయ్య, జిల్లా మాజీ కార్యదర్శి సిరబోయిన కరుణాకర్, బీకేఎంయు జాతీయ నాయకులు మోతె లింగారెడ్డి, సీపీఐ జిల్లా నాయకులు ఆదరి శ్రీనివాస్, ఎన్.రాజమౌళి, మండల కార్యదర్శి మెట్టు శ్యామ్ సుందర్‌రెడ్డి, సాంబయ్య తదితరులు గంగిల్ల లింగారెడ్డి భౌతిక కాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

### పార్టీకి తీరని లోటు : శ్రీనివాసరావు

లింగారెడ్డి మృతి పార్టీకి తీరని లోటని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. తాను నమ్మిన సిద్దాంతం కోసం లింగారెడ్డి తుదికంటా నిలబడి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేశార న్నారు. లింగారెడ్డి ఆశయాలను నేటి తరం ముందుకు తీసుకువెళ్లాల్సిన అవసరం ఉందన్నారు.

### ప్రజాఉద్యమాలకు తీరనిలోటు : వెంకట్రాములు

లింగారెడ్డి మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటు అని సిపిఐ రాష్ట్ర నాయకులు తాటిపాముల వెంకట్రాములు సంతాపం తెలిపారు. లింగారెడ్డి ఉమ్మడి వరంగల్ జిల్లాలో రైతు కూలీల సమస్యలపై అనేక పోరాటాలు నిర్వహించారని, సమసమాజ నిర్మాణం కోసం పోరాడారని పేర్కొన్నారు.

# గ్రామ పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు ఇవ్వండి



**ప్రజాపక్షం/గుండాల :** గ్రామ పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలను తక్షణమే అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం మండల కేంద్రంలోని స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడివో దేవికకు గ్రామ పంచాయతీ కార్మికులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ యూనియన్ మండల ఉపాధ్యక్షులు ఇటికాల పరశురాములు మాట్లాడుతూ గత ఐదు ఆరు నెలలుగా గ్రామ పంచాయతీ కార్మికులకు వేతనాలు చెల్లించడం లేదని చాలిచాలని వేతనాలతో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు ఇచ్చే కొంచే వేతనం అయిన సమయానికి ఇవ్వకుండా వారి జీవితాలతో ప్రభుత్వం చెలగాటం ఆడుతుందని వాపోయారు. సమయానికి వేతనాలు రాకపోవడంతో జిపి కార్మికుల కుటుంబాలు పస్తులు ఉండే పరిస్థితి నెలకొందని గ్రామ పంచాయతీ కార్మికుల మల్టి పర్పస్ విధానం రద్దు చేసి పాత విధానాన్ని కొనసాగించాలని, పంచాయతీ కార్మికులకు పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించి పని భారం తగ్గించాలని అన్నారు. కార్యక్రమంలో అనపర్తి గిరిబాబు, అనంతుల ప్రభాకర్, రాజు, యాదయ్య, వెంకటేష్, యాదయ్య, మల్లయ్య, వెంకటమ్మ, స్వప్న, ఇందిర తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులకు బదిలీ, పదోన్నతులు

## ఎస్‌టియు రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ డిమాండ్



**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి:** రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న బదిలీలు, పదోన్నతులు రంగారెడ్డి జిల్లా ఉపాధ్యాయులకు లేకపోవడం అన్యాయమని ఎస్‌టియు టిఎస్ జిల్లా అధ్యక్షులు ప్రవీణ్ కుమార్ అన్నారు. సంఘ సంఘం 78వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఇబ్రహీంపట్నం ఎస్‌టియు భవన్ లో సంఘం పతకాన్ని ఆవిష్కరించి ఉపాధ్యాయులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. జిల్లా క్యాడర్ స్ట్రేంత్‌లో అధికారులు చేసిన తప్పిదానికి ఉపాధ్యాయులు బలి అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాడానికి మగ్దూం మొయినుద్దీన్ 1947 లో ఏర్పాటు చేసిన సంఘం స్టేట్ టీచర్స్ యూనియన్ అన్నారు. అప్పటినుండి నిరంతరం ఉపాధ్యాయుల హక్కులకోసం పోరాడుతుందన్నారు. మొదటగా పిఆర్‌సి, డిఎ, పెన్షన్‌లను సాధించి పెట్టిన సంఘం ఎస్‌టియు అని పేర్కొన్నారు. ప్రభుత్వ బడులను కాపాడుకోవాలని, ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండే విధంగా, భౌతికశాస్త్రం, ఇంగ్లీష్ స్కూల్ అసిస్టెంట్ ప్రతి ఉన్నత పాఠశాలలో ఉండాలని అని ఎస్‌టియు పోరాటాలు చేసి వాటిని సాధించడం జరిగిందన్నారు. ఉపాధ్యాయుల హక్కులు, సంక్షేమం ,పాఠశాలల బలోపేతం కోసం కృషి చేస్తూ, విద్యార్థులు ఉన్నతిని ఆకాంక్షించే సంఘం స్టేట్ టీచర్స్ యూనియన్ అన్నారు. ఎస్‌టియు ముందు తరం నాయకులైన కాళోజీ, ప్రొఫెసర్ జయశంకర్ సార్, పూర్వ ఎంఎల్‌సిలైన వాణి విజయరామారావు, రామమూర్తి, రాష్ట్ర, జిల్లా పూర్వ అధ్యక్ష కార్యదర్శులు బాటలో నడిచి సంఘ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి సత్తు పాండురంగారెడ్డి మాట్లాడుతూ పాఠశాలలో పారిశుధ్య కార్మికులను నియమించాలని, కనీస వసతులు కల్పించాలని కోరారు. రంగారెడ్డి జిల్లాకు అక్రమంగా వచ్చిన ఉపాధ్యాయులను తక్షణమే వెనుకకు పంపి, మిగతా జిల్లాలతో పాటు ఈ జిల్లా ఉపాధ్యాయులకు కూడా బదిలీ, పదోన్నతులు కల్పించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర నాయకులు ఎవి సుధాకర్, కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రావు, ఎఐఎస్‌టిఎఫ్ నాయకులు పరమేష్, భాస్కర్, జిల్లా నాయకులు రాజమల్లయ్య, జగన్మోహన్‌రెడ్డి, శ్రీకాంత్ వివిధ మండలాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

# దుర్గంచెరువు, గోల్కొండకోటలో యాక్సిస్‌బ్యాంక్ పరిశుభ్రత డ్రైవ్




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా యాక్సిస్ బ్యాంక్ గోల్కొండ కోట, దుర్గం చెరువులో 'ఓపెన్ ఫర్ ది ప్లానెట్ క్లీన్ థాన్' పేరిట పరిశుభ్రత డ్రైవ్ నిర్వహించింది. ప్రపంచ పర్యావరణ దినోత్సవం–2024 సందర్భంగా ఐక్యరాజ్య సమితి ప్రతిపాదించిన థీమ్‌కు అనుగుణంగా యాక్సిస్ బ్యాంక్ ఆధ్వర్యంలో పరిశుభ్రత డ్రైవ్ నిర్వహించింది. కార్యక్రమంలో బ్యాంకు బ్రాంచ్ ఉద్యోగులు, స్థానిక కమ్యూనిటీలు, పర్యావరణ వేత్తలు, స్థానిక అధికారులు, వాలంటీర్లు పరిశుభ్రత పాల్గొన్నారు. ఈ పర్యాటక ప్రదేశాల నుంచి వ్యర్థాలను సేకరించారు. పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రత ప్రాధాన్యత గురించి స్థానికులకు వాలంటీర్లు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా యాక్సిస్ బ్యాంక్ బ్యాకింగ్ విభాగం అధ్యక్షులు అర్నికా దీక్షిత్ మాట్లాడుతూ భవిష్యత్తును పరిరక్షించుకునేందుకు మన పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన అవసరాన్ని ఉందన్నారు.

# ఫీజులపై నియంత్రణేది?

(మొదటి పేజీ తరువాయి)

ఉందో అవగతమవుతుంది. దీనికి తోడు ఏసి క్యాంపస్ అయితే అదనపు ఫీజు వసూళ్లు చేస్తున్నారు. ప్రత్యేక కోర్సుల పేర్లు చెప్పి మరి కొంత పిండే ప్రయత్నం చేస్తున్నారు. ప్రైవేటు మోజులో ఉన్న తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలకు పంపించలేక ప్రైవేటు పాఠశాలల్లో చేర్చి ఆస్తులు అమ్ముకుని అప్పుల పాలవుతున్న దయనీయ స్థితి ఇది. ఖమ్మంలో పంట, లోయ అంటూ ఇంగ్లీష్‌లో రకరకాల పేర్లుపెట్టి అత్యధిక ఫీజులు వసూలు చేస్తున్న ఓ సంస్థలో విద్యాసంస్థలు పాటించాల్సిన కనీస నియమాలను పాటించడం లేదు. అత్యధిక ఫీజులు వసూలు చేస్తున్న సంస్థ అందులో పనిచేస్తున్న వారికి ఇచ్చే వేతనాలు, ఇతర విద్యా సంస్థల కంటే తక్కువగా ఉన్నాయన్న ఆరోపణలు వినవస్తున్నాయి. విద్యార్థుల తల్లిదండ్రులను దోపిడీ చేయడమే కాకుండా సిబ్బందిని సైతం శ్రమదోపిడీ చేస్తున్నారు. పైకి మాత్రం ప్రమాణాల గురించి, సమాజం పట్ల బాధ్యత గురించి పెద్ద పెద్ద ఉపన్యాసాలు చెప్పే విద్యా సంస్థల యజమాని దోపిడీపై మాత్రం ఎవరు నోరు మెదపడం లేదు. ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి కోట్లాది రూపాయల భవనాలను నిర్మించినా పట్టించుకున్న నాధుడే లేడు. సామాన్యుడు బతకడానికి చిన్న గుడిసె వేసుకుంటే నానా హైరానా చేసే రెవెన్యూ అధికారులు కోట్లకు పడగలెత్తిన విద్యా సంస్థల యజమానికి ఎలా ధారాదత్తం చేశారో అర్థం కాని పరిస్థితి. తన వెనక ఇంత దోపిడీ ఉన్న తగుదునమ్మ అంటూ సామాజిక సంస్థలో తన భద్రత కోసం ముందు పీఠినా కూర్చోవడం గమనార్హం. ఇంత జరుగుతున్నా ఉన్నతాధికారులు కాని విద్యా శాఖాధికారులు కాని కనీసం పట్టించుకోవడం లేదు. బహిరంగంగానే ఫీజులు డిమాండ్ చేస్తున్నా.. ఆ డిమాండ్‌కు తగినట్లుగా కనీస వసతులు ఉన్నాయా బహుళ అంతస్తుల భవనంలో, ఇరుకు గదుల్లో పాఠశాలల నిర్వహణకు ఎలా అనుమతి ఇస్తున్నారన్న దానిపై విద్యాశాఖ నుంచి స్పందన లేదు. విద్యా సంస్థలకు ఆట స్థలాలు లేవు. అర్హత కలిగిన బోధనాసిబ్బంది లేరు. కొన్ని పాఠశాలల్లో అర్హత కలిగిన వారిపేర్లు ఉంటాయి కాని బోధించే వారు మాత్రం ఇతరులు ఉన్నా విద్యాశాఖ స్పందించడం లేదు. అర్హతలేని వారితో బోధన జరుగుతుంది.

**అచేతనంగా విద్యాశాఖ :** రాష్ట్రవ్యాప్తంగా విద్యాశాఖ అచేతనంగా ఉంటుంది. కార్యాలయాల్లో ఉండి అనుమతులు ఇవ్వడానికి పరిమితమవుతున్నారు తప్ప కనీస పరిశీలన చేయడం లేదు. మౌళిక వసతులు, బోధనా సిబ్బంది ఇతర వనరుల గురించి పట్టించుకున్న పాపాన పోవడం లేదు. ఖమ్మంజిల్లాలో ఒక పాఠశాల కింద షాపింగ్ కాంప్లెక్స్, పై అంతస్తులో పాఠశాల నిర్వహణ జరుగుతున్నా విద్యాశాఖాధికారులు ఆ వైపు కన్నెత్తి చూడడం లేదంటే ఆశ్చర్యం కలుగక మానదు. మన దగ్గరకు పైలు వచ్చిందా దానితో పాటు ఇంకేమైనా వచ్చాయా చూసి సంతకాలు చేయడం మినహా అనుమతులు ఇచ్చే ముందు పరిశీలన చేసిన దాఖలాలు లేవు. ఒక పేరు పొందిన విద్యాసంస్థ ఒకచోట అనుమతి తీసుకుని మూడు చోట్ల పాఠశాలలు నిర్వహిస్తున్న పట్టించుకున్న దాఖలాలు లేవు. విద్యాశాఖాధికారుల నిర్లక్ష్యం ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల్లో విద్యనభ్యసిస్తున్న వారికి శాపంగా మారింది. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల పనితీరు, సమయపాలనను పట్టించుకోకపోవడం ప్రైవేటు విద్యా సంస్థలు నియమ, నిబంధనలు, ఫీజులు, వసతులను పట్టించుకోకపోవడంతో విద్యావ్యవస్థ తీవ్రఇబ్బందులను ఎదుర్కొంటుంది. విద్యా వ్యవస్థలో మార్పులు తీసుకు రావాలంటే ప్రభుత్వ విద్యపై గౌరవం పెరగాలన్న, ప్రైవేటులో ఫీజుల నియంత్రణతో పాటు నిబంధనలు పాటించాలన్న ముందుగా విద్యా శాఖాధికారుల తీరుపై సమీక్షించి విద్యాశాఖను ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉంది. ఆ దిశగా ప్రభుత్వం అడుగులు వేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఫీజుల దోపిడీకి సంబంధించి తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# కాన్వాయ్‌పై ఉగ్రదాడి

(మొదటి పేజీ తరువాయి)

సిఎం అడ్వాన్స్‌డ్ సెక్యూరిటీ కాన్వాయ్‌పై సోమవారం ఉదయం 10:30 గంటలకు జాతీయ రహదారి 53 కోట్లెన్ గ్రామ సమీపంలో దాడి జరిగింది. మిలిటెంట్లు కాన్వాయ్‌పై పలుమార్లు కాల్పులు జరిపారు. అయితే భద్రతా బలగాలు కూడా తిరిగి ఎదురు కాల్పులు జరిపారు. ఈ దాడిలో డ్రైవర్ కుడి భుజంపై బుల్లెట్ తగిలిందని, చికిత్స కోసం ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఇప్పటికే ఈ ప్రాంతానికి భద్రతా దళాలు చేరుకున్నాయి. ముష్కరులను పట్టుకోవడానికి సెర్చ్ ఆపరేషన్ ప్రారంభించాయి. కాగా, ఈ దాడిని సిఎం బిరేన్ సింగ్ ఖండించారు. 'ముఖ్యమంత్రి కాన్వాయ్‌పై దాడి జరగడం చాలా దురదృష్టకరం. సిఎంపై దాడి అంటే నేరుగా రాష్ట్ర ప్రజలపై జరిగినట్టే. ఈ దాడి చేసిన వారిపై చర్యలు తీసుకుంటాం' అని బిరేన్ సింగ్ స్పందించారు. జిరిబామ్ ప్రాంతంలో జరిగిన హింసాత్మక ఘటనల వల్ల సరిహద్దు ప్రాంతాల్లో భద్రతను పెంచామని ఎస్‌పి నమల్ మహత్తా తెలిపారు. 'ఈ ప్రాంతంలో భద్రతా సిబ్బందిని, ప్రత్యేక కమాండో బలగాలను మోహరించాం. అన్ని సరిహద్దు ప్రాంతాల్లో బలగాలు గస్తీలో ఉన్నారు. ఇప్పటికే జిరబామ్ ప్రాంతం నుంచి దాదాపు 600 మంది అసోం వెళ్లి అక్కడ ఆశ్రయం పొందుతున్నారు. ప్రస్తుత పరిస్థితిని పర్యవేక్షిస్తున్నాం. ఈ ప్రాంతంలో దాడులు చేస్తున్న వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటాం' అని ఎస్‌పి తెలిపారు.

# రియాసీలో దాడి చేసింది మేమే..

(మొదటి పేజీ తరువాయి)

ముష్కర సంస్థ హెచ్చరించింది. పర్యాటకులు, స్థానికేతరులే లక్ష్యంగా దాడులకు తెగబడతామని చెప్పిన టిఆర్‌ఎఫ్, ఇది ఆరంభం మాత్రమేనని ప్రకటించింది. ఉగ్రదాడి నేపథ్యంలో రియాసీలో హై అలెర్ట్ కొనసాగుతోంది. ఈ దాడికి తెగబడ్డ ముష్కరులను పట్టుకోవడానికి సైన్యం, కిఆర్‌పిఎఫ్, పోలీసు బలగాలు గాలింపు చర్యలు ప్రారంభించాయి. భారీగా రంగంలోకి దిగిన సైన్యం డ్రోన్లతో ముష్కర వేట ముమ్మరం చేసింది. మరోవైపు నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ(ఎన్‌ఐఎ) బృందం రియాసీ ప్రాంతాన్ని చేరుకుంది. సెర్చ్ ఆపరేషన్ చేస్తున్న పోలీసులతో కలిసి దర్యాప్తును ప్రారంభించింది.

**రూ.10లక్షలు ఎక్స్‌గ్రేషియా...** ఈ దాడిలో మరణించిన వారి కుటుంబాలకు రూ.10 లక్షలు చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇస్తామని జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా ప్రకటించారు. గాయపడిన వారికి రూ. 50,000 చొప్పున పరిహారం ఇస్తామని తెలిపారు. కాగా, వైష్ణోదేవి ఆలయాన్ని దర్శించి మరో మందిరానికి వెళ్తున్న ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన యాత్రికుల బస్సుపై ఆదివారం సాయంత్రం ఉగ్రవాదులు విచక్షణ రహితంగా కాల్పులు జరిపారు. ఫలితంగా అదుపు తప్పిన బస్సు లోయలో పడి 9మంది ప్రాణాలు కోల్పోయారు. 41మంది గాయపడ్డారు. ప్రమాదం జరిగిన వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసులు, స్థానికులు సహాయ చర్యల్లో పాల్గొన్నారు. 9మంది మృతదేహాలను వెలికితీసినట్లు రియాసీ జిల్లా సీనియర్ ఎస్‌పి మోహితాశర్మ తెలిపారు. పరిస్థితిని సమీక్షించిన ప్రధాని మోదీ దాడిలో హస్తమున్న ప్రతీఒక్కరికి శిక్షపడుతుందని హెచ్చరించినట్లు ఎల్‌జీ కార్యాలయం తెలిపింది.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad - 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com